మనం
జనం కోసం అక్షర యజ్ఞం..
హైదరాబాద్ - బుధవారం 1 ఏప్రిల్ 2026 | సంపుటి: 10 | సంచిక: 85 | పేజీలు:12 | వెల రూ.5
HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



## అమ్మానాన్నలు అంత చేదయ్యారా?

మారుమూల ప్రాంతంలోని తండాలో పుట్టినా.. అక్షర జ్ఞానం లేకున్నా.. విద్య విలువ తెలిసినవారు గనక ఆస్తులమ్మి మరీ పిల్లల్ని చదివించారు ఆ దంపతులు. తమ త్యాగాల పునాదులపై మంచి ఉద్యోగాలు సాధించిన కుమారులు ఇప్పుడు పట్టించుకోవడమే లేదు.

2

## ఆస్తులిచ్చినా కనికరం చూపని పిల్లలు!



2







# 'మహాలక్ష్మి'తో మహిళలకు రూ.10 వేల కోట్ల ఆదా

### మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట

### డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, సీతక్క

**హైదరాబాద్, మార్చి 31 (మనం బ్యూరో):** ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆ దిశగా ప్రభుత్వం వేస్తున్న అడుగులు అద్భుత ఫలితాలను ఇస్తున్నాయని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.10 వేల కోట్ల ఆర్థిక వెసులుబాటు సభ మంగళవారం ప్రజా భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి 290 కోట్ల మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారనీ, రూ.10 వేల కోట్ల ఆర్థిక ఆదా కలిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఇచ్చిన హామీ మేరకు మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించామన్నారు. మహిళలు ఆదా చేసుకున్న రూ.10 వేల కోట్లు వారి కుటుంబ ఆర్థిక అవసరాలకు పిల్లల చదువులకు ఉపయోగపడతాయన్నారు. కేవలం బస్సు ప్రయాణమే కాకుండా మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యమనీ, రాబోయే 3 ఏళ్లలో మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్లకు పైగా వడ్డీ లేని రుణాలు అందించబోతున్నామని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం విజయవంతం కావడంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల పాత్ర మరువలేనిదన్నారు. రోజుకు 65 లక్షల మంది ప్రయాణికులలో 40 లక్షల మంది మహిళలే ఉండటం గొప్ప విషయమన్నారు. ఆర్టీసీని కాపాడుకుంటూనే మహిళలకు ఈ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే ఆర్టీసీకి రావాల్సిన బకాయిలను ప్రభుత్వం చెల్లిస్తోందనీ, కొత్త బస్సులు, కొత్త రూట్ల ఏర్పాటుతో సంస్థను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ఉచిత ప్రయాణాన్ని విమర్శించే వారికి మహిళలు తమ తిరుగుబాటు ద్వారా తగిన సమాధానం చెప్పాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మహిళలను ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశాం.సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల

...మిగతా 2లో

# ట్యాంక్‌బండ్ శివకు ఆర్థిక సాయం

### రూ.5 లక్షల చెక్కు అందించిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మార్చి 31 (మనం బ్యూరో):** ట్యాంక్‌బండ్‌పై ఎంతో మంది ప్రాణాలను కాపాడిన శివకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసింది. ఈమేరకు మంగళవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శివ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయంతో పాటు ఆయన కుమారుడు వేణుమాధవ్‌కు హోం గార్డు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ట్యాంక్‌బండ్‌పై ఎంతో మంది ప్రాణాలను కాపాడిన శివ కుటుంబ దుస్థితి ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి వచ్చింది. ఉపాధి లేక కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్న విషయం సీఎం దృష్టికి రావడంతో శివకు అవసరమైన సాయం అందించాలని కొద్ది రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉపాధి కోసం ట్యాంక్‌బండ్ సమీపంలో స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఇవ్వాలని శివ కోరగా ఆ దిశగా చర్యలు తీసుకోవాలనీ, అలాగే, డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.



# ప్రజాస్వామ్యయుతంగా మూసీ పునరుజ్జీవం

### ఏప్రిల్ 15 వరకు అభిప్రాయాల సేకరణ

### 24 గంటలూ అందుబాటులో కేబినెట్ సబ్ కమిటీ

### డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క

**హైదరాబాద్, మార్చి 31 (మనం బ్యూరో):** మూసీ పునరుజ్జీవ పనులను ప్రజాస్వామ్యయుతంగా చేపడుతున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దీనికి సంబంధించి విలువైన సూచనలు చేసిన వారితో సబ్ కమిటీ భేటీ అవుతుందని పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మూసీపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ భేటీ జరిగింది. ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్‌లో మెయిల్ ఐడీ ద్వారా మూసీ పునరుజ్జీవంపై అభిప్రాయాలు స్వీకరిస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో వచ్చిన విలువైన సలహాలు, సూచనలను అన్నింటినీ అధికారులతో కలిసి విశ్లేషణ చేస్తామన్నారు. అభిప్రాయాలు వెల్లడించిన వారితో నేరుగా దశలవారీగా సబ్ కమిటీ సభ్యులు సంప్రదింపులు చేస్తారని తెలిపారు. నిర్వాసితులు, డిఫెన్స్ భూములపై సంప్రదింపులు చేస్తామనీ, 24 గంటలూ కేబినెట్ సబ్

...మిగతా 2లో



# తెలంగాణలో 5 రోజుల పాటు వర్షాలు

- గంటకు 50 నుంచి 60 కి.మీ్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం
- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో మరో ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అయితే, మంగళ, బుధ,గురు, శుక్ర, శనివారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇదిలాఉంటే, నేటి నుంచి పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు

...మిగతా 2లో

# రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించాలి

### ప్రభుత్వ సంక్షేమ పథకాలు చదివి వినిపించాలి

### కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్, మార్చి 31 (మనం బ్యూరో):** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, జూన్ 2 నుంచి అమలు చేయబోతున్న కొత్త పథకాలపై వివరించడానికి ఏప్రిల్ 2 నుంచి గ్రామ సభలు ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికపై జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభలు నిర్వహించే క్రమంలో మొదట ముఖ్యమంత్రి సందేశం, ఆ తరువాత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను చదివి వినిపించాలన్నారు. ఇప్పటి వరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు జూన్ 2 నుంచి అందరికీ జీవిత బీమా అమలు చేయనున్న విషయాన్ని వివరించాలని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నామనీ, గ్రామాల వారీగా విడుదలైన నిధుల వివరాలను అందుబాటులో పెట్టుకుని గ్రామ సభ రోజు ఆ గ్రామానికి ఎంత చేరిందో ప్రకటించాలన్నారు. ప్రజా పాలన కార్యక్రమం అమలవుతున్న తీరును ఎప్పటికప్పుడు చీఫ్ సెక్రటరీ, ప్రణాళికా శాఖ జిల్లా కలెక్టర్ల నుంచి సమాచారం సేకరిస్తారని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.



## పసుపు రైతులకు అండగా ప్రభుత్వం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మార్చి 31:** పసుపు రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తేమ కలిగిన పసుపును కోతలు

...మిగతా 2లో

## చొరబాట్లు.. ఎన్నికల అంశం కాదు



- అస్తిత్వ పరిరక్షణ, దేశ భద్రత ముఖ్యం
- అస్సాంలో హ్యాట్రిక్ లక్ష్యంగా పని
- ప్రధాని నరేంద్ర మోదీ

9



## శబరిమల గోల్డ్ స్కాంపై మోదీ మాట్లాడరేం?

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ



## ఉద్యోగాలపై సీఎంవి కాకి లెక్కలు

### మాజీ మంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్, మార్చి 31:** ఆరు గ్యారంటీలను అమలు చేస్తామంటూ రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం

...మిగతా 2లో

# నిన్న స్పెయిన్.. నేడు ఇటలీ

### ట్రంప్‌నకు షాకిస్తున్న దేశాలు



**రోమ్, మార్చి 31:** ఇరాన్‌పై యుద్ధం కొనసాగిస్తోన్న అమెరికాకు కొన్ని దేశాలు షాక్ ఇస్తున్నాయి. యుద్ధంలో పాల్గొనే అమెరికా విమానాలకు తమ గగనతలాన్ని మూసివేయడానికి ఇటలీ చర్యలు తీసుకుంటున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. సిసిలీలోని తమ కీలక వైమానిక స్థావరాన్ని అమెరికా విమానాలు ఉపయోగించుకోవడానికి అనుమతి నిరాకరిస్తున్నట్లు ఇటలీ ప్రకటించింది. పశ్చిమాసియాకు వెళ్లే ముందు సిసిలీలోని వైమానిక స్థావరంలో యూఎస్ బాంబర్ విమానాలను నిలపడానికి అమెరికా..ఇటలీ అనుమతి కోరినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో ఈ కథనాలు వెలువడడం గమనార్హం. ఇటీవల స్పెయిన్ సైతం ఇదే

...మిగతా 2లో

## శీతలామాతా ఆలయంలో తొక్కిసలాట

### ఎనిమిది మంది మృతి




**నలంద, మార్చి31:** బిహార్‌లో విషాదం చోటుచేసుకుంది. మంగళవారం నలంద జిల్లాలోని శీతలా మాతా ఆలయంలో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఎనిమిది మంది భక్తులు మృతి చెందగా, పలువురికి

...మిగతా 2లో

## అది బానిసల కోసమే

### జన్మతః పౌరసత్వంపై ట్రంప్



**వాషింగ్టన్, మార్చి 31:** అమెరికాలో జన్మతః పౌరసత్వంపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. అది కేవలం బానిసల పిల్లల కోసం తీసుకొచ్చిందేనని అన్నారు. కానీ, ప్రపంచవ్యాప్తంగా కొందరు సంపన్నులు దీన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. 'బర్త్‌రైట్ సిటిజన్షిప్' అంశంపై అమెరికా సుప్రీంకోర్టు మరోసారి విచారణ జరపనున్న నేపథ్యంలో ట్రంప్ దీనిపై స్పందించారు. "చైనా, ఇతర దేశాలకు చెందిన ధనవంతులు డబ్బులు చెల్లించి తమ పిల్లలకు అమెరికా పౌరసత్వం పొందేందుకు ఈ 'బర్త్‌రైట్ సిటిజన్షిప్'ను తీసుకురాలేదు. ఇది కేవలం బానిసల పిల్లల కోసం ఉద్దేశించినదే. ఈ అంశంపై ఎలాంటి చర్చలకు తావులేకుండా అలాంటి పిల్లలకు గౌరవప్రద హోదా

...మిగతా 2లో

# ఇస్ఫహాన్ విరుచుకుపడిన అమెరికా





**వాషింగ్టన్, మార్చి 31:** ఇరాన్‌లో అణుకేంద్రాలు ఉన్న కీలక నగరం ఇస్ఫహాన్‌పై అమెరికా భీకర స్థాయిలో విరుచుకుపడింది. ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై 2వేల పౌండ్ల బంకర్ బస్టర్లతో దాడి చేసింది. దీంతో అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. అమెరికా అధికారులను ఉటంకిస్తూ 'వాల్‌స్ట్రీట్ జర్నల్' ఈ విషయాన్ని పేర్కొంది. ఈ దాడికి సంబంధించిన

...మిగతా 2లో

## మా దగ్గర కొంటారా..? హర్మూజ్‌కు వెళ్తారా..?

దేశాలకు ట్రంప్ వార్నింగ్

2

## హర్మూజ్‌లో అధికారికంగా టోల్

### ఇరాన్ పార్లమెంట్ సెక్యూరిటీ కమిటీ ఆమోదం

**టెహ్రాన్, మార్చి 31:** చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ లో టోల్ వసూల్‌కు ఇరాన్ పార్లమెంట్ సెక్యూరిటీ కమిటీ ఆమోదముద్ర వేసింది. దీంతో అధికారికంగా ఇరాన్ ఆ జలసంధి గుండా ప్రయాణించే నౌకలపై ఇక నుంచి టోల్ వసూలు చేయనుంది. ఈ మేరకు హర్మూజ్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒక్కో చమురు ట్యాంకర్‌పై గరిష్ఠంగా రూ.18.90 కోట్లు వసూలు చేయనున్నారు. ఆ దేశ అధికారిక మీడియా ఐఆర్‌ఐబీ ఈ విషయాన్ని వెల్లడించింది. హర్మూజ్‌పై ఇరాన్ సార్వభౌమాధికారాన్ని

...మిగతా 2లో



## ఇది యుద్ధ చర్యే..

మహాన్ ఎయిర్‌పై దాడిని ఖండించిన ఇరాన్ ఎంబసీ

2

# ఆస్తులిచ్చినా కనికరం చూపని పిల్లలు!

నల్లగొండ, మార్చి 31: ఒకరుకాదు ఇద్దరు కాదు.. కడుపున పుట్టిన ఐదుగురిని కంటికి రెప్పలా పెంచారు. మలివయసులో ఆసరాగా ఉంటారని ఆశపడ్డారు. రెక్కలుముక్కలు చేసుకొని సంపాదించినదంతా ధారాదత్తం చేశారు. కానీ వయసుడిగినవేళ ఆ తల్లిదండ్రులను కుమారులు ఈసడించుకుంటున్నారు. మారోజు ఓంకారం (72), ఈశ్వరమ్మ (65)లది నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం రామాంజిపురం. పెళ్లయ్యాక కుమారులు ఎవరికివారే స్థిరపడిపోగా.. 15 ఏళ్లుగా దంపతులు సొంతూరిలోనే జీవిస్తున్నారు. 2019లో ఓంకారం తన పేరు మీదున్న ఐదెకరాల ఇరవై గుంటల భూమిని కొడుకులందరికీ సమానంగా పంచి ఇచ్చారు. ఈశ్వరమ్మ పేరు మీదున్న ఎకరా భూమిని అట్టిపెట్టుకున్నారు. ఇంతచేసినా ఆ సుపుత్రులు బాధ్యత మరిచారు.. కన్నవాళ్లకు ఖర్చులకని ఒక్కొక్కరు ఏడాదికి 8 వేల రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. రెండేళ్లుగా గుండె సంబంధిత రుగ్మతలు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నామని.. వారు ఇచ్చే డబ్బులు ఏమాత్రం సరిపోవడం లేదని వృద్ధ దంపతులు వాపోతున్నారు. బాధలు చెప్పుకోవడానికి ఇంటికెళ్తే.. ఎందుకొచ్చారని గెంటేస్తున్నారని కన్నీటిపర్యంతమవుతున్నారు. భర్త వైద్యం కోసం రెండు జతల బంగారు చెవికమ్మలు బ్యాంకులో కుదువ పెట్టి రుణం తీసుకున్నట్లు ఈశ్వరమ్మ తెలిపారు. పున్నామ నరకం నుంచి తప్పించేవాడు పుత్రుడని భావిస్తే.. ప్రత్యక్ష నరకం అనుభవించేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధాప్యంలో మమ్మల్ని ఆదుకోని పుత్రులకు మా సంపాదన అనుభవించే హక్కు లేదనీ వాళ్లకు ఇచ్చిన భూమిని తిరిగి ఇప్పించాలని కోరేందుకు నల్లగొండ కలెక్టరేట్‌కు వచ్చారు.

# అమ్మానాన్నలు అంత చేదయ్యారా?

ఖమ్మం, మార్చి 31: మారుమూల ప్రాంతంలోని తండాలో పుట్టినా.. అక్షర జ్ఞానం లేకున్నా.. విద్య విలువ తెలిసినవారు గనక ఆస్తులమ్మి మరీ పిల్లల్ని చదివించారు ఆ దంపతులు. తమ త్యాగాల పునాదులపై మంచి ఉద్యోగాలు సాధించిన కుమారులు ఇప్పుడు పట్టించుకోవడమే లేదని ఆ కన్నవాళ్లు వాపోతున్నారు. ఖమ్మం గ్రామీణ మండలం పడమటి తండాకు చెందిన భూక్యా బిక్యా (82), హంపిలి (79)లకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. పిల్లల చదువు కోసం బిక్యా మూడెకరాలు అమ్మేశారు. వీరి పెద్ద కుమారుడు ప్రభుత్వోద్యోగి కాగా.. రెండో కుమారుడికి సర్కారు ఉద్యోగం వచ్చినా చేరలేదు. ఆయన భార్య ప్రభుత్వోద్యోగి. కుమారులిద్దరూ మంచి స్థితిలో ఉంటూ ఖమ్మంలో స్థిరపడ్డారు. వృద్ధాప్యంలో ఉన్న బిక్యా, హంపిలి మాత్రం తండాలోనే ఒంటరిగా ఉంటున్నారు. హంపిలి నడవలేదు.. బిక్యాకు కళ్లు సరిగా కనిపించవు. ఈ స్థితిలో తమను పోషించాల్సిన కుమారులు పట్టించుకోవడం లేదంటూ ఈ దంపతులు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టించారు. పోలీసులను ఆశ్రయించారు. కూతుళ్ల సాయంతో 20 రోజుల వ్యవధిలో రెండు సార్లు ఖమ్మం కలెక్టరేట్‌కు వచ్చారు.

# ఇస్ఫహాన్ విరుచుకుపడిన అమెరికా

(మొదటి పేజీ తరువాయి)

వీడియోను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్రూత్ సోషల్లో పోస్టు చేశారు. దాడికి సంబంధించి ఆయన ఎలాంటి వివరణ ఇవ్వలేదు. అయితే, ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై అమెరికా- ఇజ్రాయెల్ ఈ దాడులు చేశాయని మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. దాడుల నేపథ్యంలో ఈ ప్రాంతంలో వరుస పేలుళ్లు చోటుచేసుకోగా భారీగా మంటలు ఎగసిపడుతున్నాయి. దీనిపై ఇరాన్ ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. కాగా ఇరాన్ సుమారు 540 కిలోల యురేనియం నిల్వలను ఇస్ఫహాన్‌లో ఓ భూగర్భ కేంద్రానికి తరలించినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు.. తమతో ఒప్పందం కుదుర్చుకోకపోతే.. ఆ దేశంలో భారీ విధ్వంసాన్ని సృష్టిస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇక్కడ భారీఎత్తున దాడులు జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా తయారుచేసిన ఎంక్యూ-9 రీపర్ డ్రోన్ను ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చివేసినట్లు తెలుస్తోంది. ఐఆర్జీసీ అధికార వర్గాలను ఉటంకిస్తూ మీడియా కథనాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఇస్ఫహాన్ ప్రాంతంలో ఎగురుతున్న ఎంక్యూ-9 రీపర్ డ్రోన్‌ను ధ్వంసం చేశామని ఐఆర్జీసీ వర్గాలు పేర్కొన్నాయి.

## మా దగ్గర కొంటారా..? హర్మూజ్‌కు వెళ్తారా..?

### దేశాలకు ట్రంప్ వార్నింగ్

వాషింగ్టన్, మార్చి 31: పశ్చిమాసియా ఘర్షణలతో హర్మూజ్‌లో తీవ్ర అంతరాయాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఇంధన కొరతతో ఇబ్బంది పడుతున్న దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహాలు ఇచ్చారు. 'హర్మూజ్ జలసంధి కారణంగా ఇంధనం కొరత ఎదుర్కొంటున్న దేశాలకు.. ఇరాన్‌పై చేస్తోన్న యుద్ధంలో కలిసిరాని యూకే వంటి దేశాలకు నాదొక సూచన. మొదటిది.. అమెరికా నుండి చమురు కొనాలి. అది మా దగ్గర పుష్కలంగా ఉంది. రెండవది.. కొంత ఆలస్యమైనా ధైర్యం కూడగట్టుకుని ఆ జలసంధికి వెళ్లి దానిని స్వాధీనం చేసుకోండి. మీ కోసం మీరే పోరాడటం నేర్చుకోవాలి. మీరు మాకు అండగా రావడం లేదు.. అలాగే మీకు సహాయం చేయడానికి అమెరికా మీతో రాదు. ఇరాన్ దాదాపుగా నాశనమైంది. కష్టమైన పని పూర్తయింది. వెళ్లి మీ చమురును మీరే తెచ్చుకోండి' అని పోస్టు పెట్టారు.



## శీతలా మాతా ఆలయంలో తొక్కిసలాట

(మొదటి పేజీ తరువాయి)

గాయాలు అయ్యాయి. నలంద జిల్లాలోని మాఘా గ్రామంలో ఈ ఆలయం ఉంది. చైత్రమాసంలో చివరి మంగళవారం కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. "ప్రతి మంగళవారం ఇక్కడ రద్దీ నెలకొంటుంది. మేం దర్శనం కోసం పట్నా నుంచి వచ్చాం. కానీ ఉన్నట్టుండి తోపులాట జరగడంతో పలువురు చనిపోయారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది" అని మమతాదేవి అనే భక్తురాలు మీడియాకు వెల్లడించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో ఆలయం, ఆసుపత్రి వద్ద విషాదఛాయలు నెలకొన్నాయి. మృతులంతా మహిళలేనని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. బాధిత కుటుంబాలను అన్నిరకాలుగా ఆదుకుంటామని చెప్పారు.

## నిన్న స్పెయిన్.. నేడు ఇటలీ

(మొదటి పేజీ తరువాయి)

తరహా ప్రకటన చేసింది. ఇరాన్‌తో జరుగుతోన్న యుద్ధంలో పాలుపంచుకొనే విమానాలను తమ గగనతలంలో అనుమతించబోమని ఆ దేశ రక్షణ మంత్రి మార్గరెటా రొబెల్స్ ప్రకటించారు. ఇరాన్‌పై దాడుల్లో జోక్యం చేసుకోవడానికి ఈయూ దేశాలు ఇష్టపడటం లేదు.

# ప్రజాస్వామ్యయుతంగా మూసీ పునరుజ్జీవం

(మొదటి పేజీ తరువాయి)



కమిటీ అందుబాటులో ఉంటుందన్నారు. మూసీ ఫేజ్-1, ఫేజ్-2 వరకు చేయాల్సిన పనులకు సంబంధించి రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ డిజైన్లు తుది దశకు తీసుకు రావడం, బ్యాంకర్లతో మాట్లాడటం ఇలా పనులను ఎక్కడికక్కడ విభజన చేసుకుని ముందుకు వెళ్లాలని అధికారులకు ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు.

# కూకట్‌పల్లిలో తల్లి...ఇద్దరు చిన్నారుల ఆత్మహత్య

- మూకుమ్మడి ఆత్మహత్య కేసుపై విచారణ
- రెండో పెళ్లి, ఆస్తి కోణంలో దర్యాప్తు

హైదరాబాద్,మార్చి31(మనం,ప్రత్యేక ప్రతినిధి): సైబరాబాద్ పరిధిలోని కూకట్‌పల్లి కైతలాపూర్ రాఘవేంద్ర కాలనీలో మంగళవారం ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనపై అనుమానస్పద రీతిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. స్రవంతి అనే మహిళ పది,పన్నెండేళ్ల వయస్సున్న తన ఇద్దరు కుమారులను చంపింది. ఆపై తాను కూడా ఆత్మహత్య చేసుకుంది. అయితే ఇది ఆత్మహత్య కాదని, భర్త ప్రవీణ్ చేసిన పథకం ప్రకారమే ఈ దారుణం జరిగిందని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..స్రవంతికి, ప్రవీణ్‌కు 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, ప్రవీణ్ తన మేనత్త కూతురిని రెండో పెళ్లి చేసుకోవడంతో దంపతుల మధ్య మనస్పర్ధలు మొదలయ్యాయి. మొదటి భార్యకు అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో ప్రవీణ్ తల్లిదండ్రులు (స్రవంతి అత్తమామలు) కొంత స్థలాన్ని ఆమె పేరు మీద రాసిచ్చారు.కాగా కొంతకాలం తర్వాత ప్రవీణ్‌ను తన రెండో భార్య కూడా వదిలి వెళ్లడంతో, అతను తిరిగి స్రవంతికి దగ్గరయ్యాడు. ఈనేపథ్యంలో స్రవంతి పేరు మీద ఉన్న ఆస్తిని తిరిగి తన పేరు మీదకు మార్చాలని ప్రవీణ్ ఆమెను వేధించడం మొదలుపెట్టాడు. ఈ విషయంలో సోమవారం రాత్రి కూడా పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగిందని, ఆ తర్వాతే ఈ ఘోరం జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు.

**బంధువుల అనుమానం:**

కూకట్‌పల్లి కైతలాపూర్ రాఘవేంద్ర కాలనీలో తల్లి,ఇద్దరు కుమారుల మృతదేహాలను చూసిన బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చనిపోయిన వారి శరీర రంగు మారిపోయిందని, ప్రవీణే రాత్రిపూట ముగ్గురిని చంపి, ఉదయం ఏమీ ఎరుగనట్లు పనికి వెళ్లి, మధ్యాహ్నం వచ్చి డ్రామా ఆడుతున్నాడని వారు ఆరోపిస్తున్నారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన కూకట్‌పల్లి పోలీసులు క్లూస్ టీంతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు.

మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రవీణ్ వేధింపుల భరించలేక స్రవంతి ఆత్మహత్య చేసుకుందా..? ఆమె భర్త ప్రవీణ్ హస్తం ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# అన్నా..అని పిలిచినా దయలేదు

- వరుసకు భయ్యే అసభ్య దృశ్యాలు చిత్రీకరించాడు
- ఐదేళ్ల చిన్నారి కేసులో నిందితుడి అరెస్ట్
- టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడి



హైదరాబాద్,మార్చి 31(మనం,ప్రత్యేక ప్రతినిధి): ఐదేళ్ల చిన్నారిని మాయమాటలతో నమ్మించి అసభ్య దృశ్యాలను చిత్రీకరించిన కేసులో నిందితుడు వరుసకు అన్నయ్య అవుతాడని టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడించారు. ఐదేళ్ల చిన్నారిపై లైంగిక అసభ్య దృశ్యాలను చిత్రీకరించిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళితే..ఐదేళ్ల చిన్నారికి సంబంధించిన అశ్లీల దృశ్యాలపై టిప్‌లైన్ ద్వారా అందిన సమాచారం మేరకు చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ లోతుగా విశ్లేషించిందని శిఖా గోయల్ తెలిపారు. వీడియో ఆధారాలను సాంకేతిక పరిజ్ఞానంతో పరిశీలించగా ఈ నేరం స్థానికంగానే జరిగినట్లు తేలిందన్నారు. అయితే బాధితురాలి తల్లిదండ్రులకు ఈ విషయం తెలియదని గుర్తించామన్నారు. ఈ ఘటనపై లోతైన దర్యాప్తు అనంతరం గోల్కొండలోని కుమ్మరివాడికి చెందిన మహమ్మద్ ఫహాద్ అలియాస్ ఆదిల్ (19) అనే డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థిని నిందితుడిగా గుర్తించి అరెస్ట్ చేశామన్నారు. కాగా 2026 సంవత్సరంలో బ్యూరో విజయవంతంగా చిన్నారిని రక్షించిన రెండో కేసు అని ఆమె వివరించారు.

**అన్నా..అని పిలిచినా:**


బాధితురాలైన చిన్నారికి నిందితుడికి అత్యంత సమీప బంధువని, వరుసకు అన్నయ్య అవుతాడని శిఖా గోయల్ తెలిపారు. సదరు చిన్నారి అతడిని ఎంతో ప్రేమతో 'భయ్యా' అని పిలుస్తుండేదన్నారు. నిందితుడు ఆ నమ్మకాన్నే ఆసరాగా చేసుకుని తరచూ బాధితురాలి ఇంటికి వెళ్లి ఎవరూ లేని సమయంలో బాలికను ఇంటి పైకప్పు పైకి తీసుకెళ్లి అసభ్య దృశ్యాలను చిత్రీకరించినట్లు విచారణలో తేలిందన్నారు. నిందితుడి వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాన్ని స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ పరీక్షల నిమిత్తం పంపామని, నిందితునిపై ఐటీ చట్టంలోని సెక్షన్ 67-బి తో పాటు పోక్సో చట్టంలోని వివిధ సెక్షన్ల కింద సీసీపీఎస్‌లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. బాధితురాలికి అవసరమైన సహాయం అందజేయడంతో పాటు ఆమె తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇప్పించామని వివరించారు.

**వెంటనే ఫిర్యాదు:**

పిల్లలపై జరిగే ఇలాంటి నేరాల్లో దురదృష్టవశాత్తు కుటుంబ సభ్యులు, తెలిసిన వారే నిందితులుగా ఉంటున్నారని టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడించారు. ఇది సమాజంలో నమ్మకాన్ని వంచించడమేనని, పిల్లలను ఎవరి సంరక్షణలో ఉంచుతున్నామనే విషయంలో తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లలో ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. పిల్లల రక్షణ అనేది మన అందరి సామూహిక బాధ్యత అని, అధునాతన సాంకేతికతతో ఇటువంటి నేరాలను అరికట్టడానికి బ్యూరో నిరంతరం కృషి చేస్తోందని డైరెక్టర్ శిఖా గోయల్ స్పష్టం చేశారు

# అది బానిసల కోసమే

(మొదటి పేజీ తరువాయి)



కల్పించిన ఏకైక దేశం మాదే. కానీ, ఇప్పుడు మా ప్రయోజనాలను వినియోగించుకొని ప్రపంచం సంపన్నంగా మారుతోంది. అదే సమయంలో మన విఫలమైన న్యాయవ్యవస్థను చూసి నవ్వుకుంటోంది. తెలివితక్కువ న్యాయవ్యవస్థతో దేశాన్ని గొప్పగా తీర్చిదిద్దలేం" అని ట్రంప్ ట్రూత్ పోస్ట్‌లో రాసుకొచ్చారు.

1865లో అమెరికాలో అంతర్యుద్ధం ముగిసిన తర్వాత ఈ జన్మతః పౌరసత్వ చట్టాన్ని ప్రవేశపెట్టారు. రాజ్యాంగంలో 14వ సవరణ ప్రకారం తల్లిదండ్రుల వలస స్థితితో సంబంధం లేకుండా అమెరికాలో జన్మించిన పిల్లలకు అగ్రరాజ్య పౌరసత్వం లభించే విధానం అమల్లో ఉంది. అయితే, ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తొలిరోజునే జన్మతః పౌరసత్వం లభించే హక్కును రద్దు చేసేలా కార్యనిర్వాహక ఆదేశాలు జారీ చేశారు. దీన్ని సవాల్ చేస్తూ పలు రాష్ట్రాలు దావాలు వేశాయి. దీనిపై విచారణ జరిపిన పలు కోర్టులు ట్రంప్ ఉత్తర్వులను నిలిపివేశాయి. అనంతరం ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. దీనిపై ఏప్రిల్ 1న విచారణ జరగనుంది.

# హర్మూజ్‌లో అధికారికంగా టోల్

(మొదటి పేజీ తరువాయి)

పెంచడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఐఆర్ఐబీ తెలిపింది. ఇందులో జలమార్గాన్ని పరిరక్షించే భద్రతా ఏర్పాట్లు, సముద్రయాన భద్రతను నిర్ధరించే చర్యలు, ఆర్థిక నిబంధనలు, అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన నౌకల రాకపోకలపై నిషేధం వంటివి ఉన్నాయని పేర్కొంది. ఐఆర్జీసీ నిర్దేశించిన టోల్ సిస్టమ్ నిబంధనలు పూర్తిచేసి ఇప్పటివరకు 26 నౌకలు హర్మూజ్‌ను దాటినట్లు పేర్కొంది. ఇందుకోసం ఆయా నౌకలు సంబంధిత పత్రాలు సమర్పించి, క్లియరెన్స్ కోడ్‌లు కూడా పొందినట్లు తెలిపింది.

**వ్యతిరేకించిన అమెరికా..**

హర్మూజ్‌పై ఇరాన్ తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా తీవ్రంగా ఖండించింది. జలసంధిపై టెహ్రాన్ నియంత్రణను ప్రపంచ దేశాలు అంగీకరించబోవని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో అన్నారు. 'ఇప్పుడు దేశాలు ఇతర దేశాలనే కాకుండా అంతర్జాతీయ జలమార్గాలను కూడా స్వాధీనం చేసుకొని, తమవిగా చెప్పుకోవచ్చనే కొత్త విధానం వచ్చింది' అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. మరోవైపు జలసంధిలో నౌకలపై టోల్ విధించడాన్ని జీ7 దేశాలు తప్పుబట్టాయి. నౌకాయాన స్వేచ్ఛను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నాయి.

**ఇది యుద్ధ చర్యే.. మహాన్ ఎయిర్‌పై దాడిని ఖండించిన ఇరాన్ ఎంబసీ**

ఢిల్లీ, మార్చి 31: ఇరాన్ నుంచి భారత్‌కు రావాల్సిన పౌర విమానంపై దాడి జరిగింది. మానవతా సాయాన్ని తరలించే ఈ విమానంపై అమెరికానే దాడి చేసిందని భారత్‌లోని ఇరాన్ ఎంబసీ ఆరోపించింది. ఈ ఘటనను యుద్ధ చర్యగా అభివర్ణిస్తూ ఎక్స్ వేదికగా విరుచుకుపడింది. పలు దేశాల నుంచి ఇరాన్‌కు మందులు, వైద్య పరికరాలను రవాణా చేస్తూ మషద్ విమానాశ్రయంలో దిగిన పౌర విమానంపై అమెరికా-ఇజ్రాయెల్ దాడికి పాల్పడ్డాయని ఆరోపించింది. ఈ దాడిలో విమానం దెబ్బతిన్నట్లు తెలిపింది. దీన్ని ఇరాన్ పౌర విమానయాన శాఖ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎంబసీ పేర్కొంది. మానవతా సాయాన్ని తరలించే పౌర విమానాలను లక్ష్యంగా చేసుకోవడం.. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని తెలిపింది. ఇది యుద్ధచర్యగా అభివర్ణించింది. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై విచారణ జరపాలని అంతర్జాతీయ సంస్థలకు పిలుపునిచ్చింది. యుద్ధం నేపథ్యంలో ఇరాన్ ప్రజల కోసం భారత్ మానవతా సాయం తరలిస్తున్న సంగతి తెలిసిందే. అందులోభాగంగానే మహాన్ ఎయిర్‌కు చెందిన ఈ విమానం మందులు, వైద్య సామగ్రిని తీసుకెళ్లేందుకు ఈ వారంలో భారత్‌కు రావాల్సిఉంది.

# ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు

- ఈనెల 4న హాజరుకావాలని ఆదేశాలు
- పోలీసులపై అనుచిత వ్యాఖ్యలపై విచారణ

హైదరాబాద్,మార్చి 31(మనం,ప్రత్యేక ప్రతినిధి): సమ్మక్క-సారలమ్మ జాతరలో బందోబస్తులో ఉన్న పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారన్న ఆరోపణలపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కి మంగళవారం సీఐడీ నోటీసులు జారీ చేసింది. జాతరలో మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసినట్లు సీఐడీ నోటీసులలో పేర్కొన్నారు. ఈక్రమంలో ఈనెల 4న ఉదయం 11.30 గంటలకు విచారణకు రావాలని సీఐడీ ఆదేశించింది. సీఐడీ నోటీసులపై కౌశిక్ రెడ్డి స్పందిస్తూ తాను ఎలాంటి తప్పు చేయకపోయినా తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని సీఐడీ నోటీసులు జారీ చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే కారణంతో తన కుటుంబ సభ్యులను, అలాగే పార్టీకి చెందిన ఇతర కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టడం సరైన విధానం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయంగా తనపై చర్యలు కేసులు పెట్టవచ్చని, నోటీసులు ఇవ్వవచ్చని కానీ కుటుంబాన్ని టార్గెట్ చేయడం అన్యాయమని స్పష్టం చేశారు. తనను నేరుగా లక్ష్యంగా చేసుకోవాలని, కానీ కుటుంబ సభ్యులను వేధించడం మానుకోవాలని కోరారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా, ఎన్ని నోటీసులు ఇచ్చినా తాను వెనక్కి తగ్గబోనని స్పష్టం చేశారు.

**ఇది..జరిగింది:**

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం సమ్మక్క-సారక్క జాతర వద్ద జనవరి 29వ తేదీన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, పోలీసులకు మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. గొడవ నేపథ్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను ఉద్దేశించి కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని పోలీసులు కేసు నమోదు చేశారు. విధి నిర్వహణలో ఉన్న ఉన్నతాధికారి పట్ల అగౌరవంగా ప్రవర్తించారన్న ఆరోపణలపై స్థానిక పోలీసులు చేపట్టిన విచారణకు సంబంధించిన నివేదికను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**సీఐడీ రంగ ప్రవేశం..**

కరీంనగర్ పోలీసులు దర్యాప్తు చేసిన అనంతరం ఈ కేసును తదుపరి విచారణను ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఈ క్రమంలోనే సీఐడీ అధికారులు ప్రాథమిక ఆధారాలను సేకరించి, ఎమ్మెల్యేకు నోటీసులు పంపారు.

ఏప్రిల్ 4న జరిగే విచారణలో కౌశిక్ రెడ్డి వివరణ తీసుకోనున్నారు. గత కొంతకాలంగా అధికార పక్షంపై నిప్పులు చెరుగుతున్న కౌశిక్ రెడ్డికి నోటీసులివ్వడం కక్షపూరిత చర్య అని బీఆర్ఎస్ శ్రేణులు విమర్శిస్తున్నారు. అయితే చట్టం తన పని తాను చేసుకుపోతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

# ఎన్ని కేసులువెట్టిన ప్రజల పక్షాన కొట్లాడతా

- సీఐడీ నోటీసులపై కౌశిక్ రెడ్డి కౌంటర్ ఏటాక్

హైదరాబాద్, మనం ప్రతినిధి: తనకు సీఐడీ నోటీసులు అందడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే కక్షతోనే తనను ఇబ్బంది పెడుతున్నారని ఆయన ఆరోపించారు. 'రేవంత్ రెడ్డి... నన్ను లక్ష్యంగా చేసుకోండి, నాపై ఎన్ని కేసులైనా పెట్టండి, నోటీసులు ఇవ్వండి. కానీ, నా కుటుంబాన్ని, మా బీఆర్ఎస్ కుటుంబ సభ్యులను ఈ గొడవల్లోకి లాగి ఇబ్బంది పెట్టడం ఎంతవరకు న్యాయం? అని ప్రశ్నించారు. ఏ తప్పు చేయకపోయినా కావాలనే వేధిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.
తనకు ఎన్ని నోటీసులిచ్చినా, ఎన్ని బెదిరింపులకు గురిచేసినా తాను వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. 'ఇది నా వ్యక్తిగత పోరాటం కాదు?.. ప్రజల కోసం చేస్తున్న పోరాటం అని అన్నారు. మీరు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటాను' అని హెచ్చరించారు. ప్రశ్నించే గొంతును అధికార బలంతో అణచివేయలేరని, ప్రజల పక్షాన తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని అన్నారు. అయితే, జనవరి 29న హుజూరాబాద్ నియోజకవర్గం వీణవంకలో జరిగిన మినీ మేడారం జాతర సందర్భంగా పోలీసులతో కౌశిక్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో, ఆయనపై కేసు నమోదయింది. ఈ క్రమంలో, ఏప్రిల్ 4న విచారణకు హాజరుకావాలని సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు.

## 'మహాలక్ష్మి'తో మహిళలకు రూ.10 వేల కోట్ల ఆదా

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహణ బాధ్యతలు కూడా వారికి అప్పగించాం. కోటి మంది మహిళను కోటీశ్వరులను చేసే వరకు విశ్రమించేది లేదని ఈ సందర్భంగా మంత్రి సీతక్క పేర్కొన్నారు. అనంతరం మహిళలు పొదుపు చేసుకున్న రూ.10000 కోట్ల మెగా చెక్కును మంత్రులు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి అందజేశారు.

## పసుపు రైతులకు అండగా ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

లేకుండా కొనుగోలు చేస్తామన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. రైతులను ఇబ్బంది పెడితే మార్కెట్ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. "నిజామాబాద్ మార్కెట్‌కు పసుపు భారీగా వస్తోంది. 1,500 టార్పాలిన్ల పంపిణీ కోసం బిడ్డింగ్ పూర్తి చేశాం. పసుపు కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించాం. మేలు రకం పసుపు పంటకు ప్రభుత్వం ఖరారు చేసిన ధర చెల్లిస్తున్నాం. రైతులకు చెల్లింపులు సక్రమంగా జరగాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాం" అని తుమ్మల పేర్కొన్నారు.

## ఉద్యోగాలపై సీఎంవి కాకి లెక్కలు

(మొదటి పేజీ తరువాయి)

చేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రాష్ట్ర బడ్జెట్ డొల్ల అని.. అందుకే దానికి సంబంధించిన పత్రాలను చించివేశామని చెప్పారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "తెలంగాణ ప్రజల గొంతుకగా బీఆర్ఎస్ వ్యవహరిస్తోంది. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. కోటి మంది మహిళలకు ప్రతి నెలా రూ.2,500 ఇస్తామని చెప్పారు. ప్రభుత్వ మోసాన్ని తెలిపేందుకు చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపాం. నీటిపారుదల శాఖ పద్దుపై చర్చ సమయంలో మమ్మల్ని సస్పెండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇచ్చిన నోటిఫికేషన్లు, ఉద్యోగాలపై నిలదీశాం. 16వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు సభలో ప్రభుత్వమే చెప్పింది. సీఎం రేవంత్ మాత్రం 60వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు కాకి లెక్కలు చెబుతున్నారు. శాసనసభలో సీఎం పహిల్వాన్ భాష మాట్లాడారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై మా పోరాటం కొనసాగుతుంది" అని హరీశ్‌రావు అన్నారు.

## తెలంగాణలో 5 రోజుల పాటు వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసింది. ఆదిలాబాద్, అసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రేపు కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. హైదరాబాద్ నగరంలో ఆకాశం మేఘావృతమై ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వెల్లడించింది.

## లీడర్.. క్యాడర్ మీటింగ్

- మూడు రోజుల పాటు వరుస సమావేశాలు

హైదరాబాద్, మార్చి 31(మనం,ప్రత్యేక ప్రతినిధి): కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో లీడర్,క్యాడర్‌తో వరుస సమావేశాలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా తెలంగాణ జాగృతి క్యాడర్ తో అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సుదీర్ఘ సమాలోచనలు సాగిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం నుంచి శుక్రవారం వరకు వరుసగా ఉమ్మడి జిల్లాల వారీగా నాయకులు, కార్యకర్తలతో చర్చలు జరుపనున్నారు. పార్టీ ఏర్పాటు కోసం వివిధ వర్గాల ప్రజల సమస్యలు, వాటికి పరిష్కారాలు, తెలంగాణ రాష్ట్ర స్వయం సమృద్ధి కోసం రూపొందించాల్సిన బ్లూ ప్రింట్ పై 50 కమిటీలు ఏర్పాటు చేసి స్టడీ చేసిన కవిత తాజాగా క్యాడర్ నుంచి సలహాలు, సూచనలు తీసుకోనున్నారు. జాగృతి నాయకులు, కార్యకర్తలతో కవిత సమావేశాల షెడ్యూల్ ను మంగళవారం జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి విడుదల చేశారు.

# తెలంగాణలో చికెన్ దుకాణాలు బంద్

## మార్జిన్లు పెంచే వరకు నేటి నుంచి నిరవధిక బంద్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో నేటి నుంచి చికెన్ దుకాణాలు బంద్ కానున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్లు పెంచే వరకు నిరవధిక బంద్ పాటిస్తామని చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. గతంలో కంటే మార్జిన్ ఇప్పుడు తక్కువగా ఇస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పౌల్ట్రీ వాళ్లు రిటైల్ దుకాణాలకు కిలోకు రూ.26 మార్జిన్ ఇచ్చేవారని, గత ఇరవై ఏళ్లుగా ఇదే మార్జిన్ ఇస్తున్నారని, ఇటీవల ఈ మార్జిన్ రూ.16కు తగ్గించారని దుకాణ యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. కేజీ చికెన్ మార్జిన్ రూ.30 ఇవ్వాలని ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.

అందుకే మార్జిన్ పెంచే వరకు నేడు బుధవారం నుంచి నిరవధిక బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపింది. ఇదిలాఉంటే, ప్రస్తుతం చికెన్ విక్రయాలపై వస్తున్న లాభాలు తక్కువగా ఉండటంతో షాపులు నిర్వహించడం కష్టంగా మారినట్లు అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. తక్కువ మార్జిన్ వల్ల వ్యాపారుల జీవనోపాధి సవాల్‌గా మారిందని అంటున్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరసన కొనసాగుతుందని తెలిపారు.

# ఢిల్లీ ధర్నాకు సింగరేణి రిటైర్ ఉద్యోగుల సంఘీభావం




**హైదరాబాద్, మనంన్యూస్‌:** గ్రేటర్ హైదరాబాద్ ఘట్కేసర్ సర్కిల్ లోని సుప్రభాత్ టౌన్ షిప్ కొర్రెములలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘీభావ సమావేశం జరిగింది. 2026 మార్చి 30 న జంతర్ మంతర్ న్యూ ఢిల్లీ లో బొగ్గు రంగ ఉద్యోగులకు పెన్షన్ పెంచాలని ఆల్ ఇండియా కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ వారు ధర్నా నిర్వహిస్తున్నారుకోల్ ఇండియా లిమిటెడ్, సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు కనీస పెన్షన్ రూ.10,000లు చెల్లించాలని,కోల్ మైన్స్ పెన్షన్ స్కీం-1998 ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి పెన్షన్ స్కీం సవరించి పెన్షన్ పెంచాలని, మాకు న్యాయం కావాలని ప్లే కారడ్స్ పట్టుకొని నిరసన తెలిపారు.ఈ సమావేశంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ మాట్లాడుతూ ప్రాణాలను పణంగా పెట్టి అతి లోతైన బొగ్గు గనులలో గాలి,వెలుతురు లేకుండా ఊపిరి ఆడని పరిస్థితుల్లో కఠోరంగా దశాబ్దాల పాటు శ్రమించి బొగ్గు వెలికి తీసి దేశ ఆర్థికాభివృద్ధి కి పాటుపడినామని, నేడు కనీస వెయ్యి రూపాయలు అంతకన్నా తక్కువ పెన్షన్ వలన ఆకలితో అలమటిస్తున్నారని,1998 ఏప్రిల్ నుంచి అమలు కాబడుతున్న కోల్ మైన్స్ పెన్షన్ స్కీం ప్రకారం పెన్షన్ ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి సవరించాలనే నిబంధన అమలు కావడం లేదని గత ఐదు సంవత్సరాలు నుంచి న్యూ ఢిల్లీ, వారణాసి, కోల్ కత్తా,కొత్త గూడెం,నాగ్ పూర్,గోదావరి ఖని లాంటి నగరాలలో పెన్షన్ పెంచాలని నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని,దేశ ప్రధానికి,కేంద్ర ప్రభుత్వ మంత్రులకు,పార్లమెంట్ సభ్యులకు వినతి పత్రాలు సమర్పించడం జరిగిందని,వయో భారంతో పాటు వృధ్యాప్యంలో వచ్చే వైద్య ఖర్చులు,మార్కెట్ లో పెరిగే ధరల వలన కనీస ప్రాథమిక అవసరాలకు పెన్షన్ సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తపరిచారు.ద్రవ్యోల్బణం 300 శాతం గణనీయంగా పెరిగినను కరువు భత్యం లేని పెన్షన్ సరిపోక దార్రిద్యం లోకి త్రోసి వేయడం వలన గౌరవప్రదమైన జీవితం గడుపుట కష్టపరంగా ఉందని, గౌరవ భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్నారని, బొగ్గు రంగ రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ కూడ పెంచుతారని ఆశాభావంతో ఉన్నామని,కావున కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ 2025 డ్రాఫ్ట్ బిల్ పార్లమెంట్ లో ప్రవేశపెట్టాలని, కోల్ మైన్స్ పెన్షన్ ఫండ్ బలోపేతం చేయాలని, బొగ్గు రంగ ఉద్యోగుల కనీస పెన్షన్ రూ.10,000 చెల్లించాలని, కోల్ మైన్స్ పెన్షన్ స్కీం సవరించి కరువు భత్యం (డి.ఏ)తో కూడిన పెన్షన్ చెల్లించి ఆర్థిక భరోసా,ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని ,సమాజం గౌరవప్రదమైన జీవితం కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, ఉపాధ్యక్షులు బంగారి రాజయ్య,కె.బీరయ్య, సంయుక్త కార్యదర్శి సామంతుల నర్సింగ్ రావు, గీస కనకయ్య, కొట్టే మల్లయ్య, ఎం.రాజా నర్సు, సీఎచ్.నర్సయ్య, రఫిక్, మదనయ్య, రామ రాజు సుభాష్ రెడ్డి, మునిందర్ రెడ్డి, రాజమల్లు, టి.శ్రీనివాస్ తదితర యాభై మంది సింగరేణి విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

# అమెరికాకు కేటీఆర్

## బిజినెస్ కాన్ఫరెన్స్ వేదికపై ప్రసంగించనున్న కేటీఆర్



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అమెరికా పర్యటనకు వెళ్లారు. వారం రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం ఉదయం ఆయన అమెరికాకు బయలుదేర్దారు. ఈ పర్యటనలో భాగంగా న్యూయార్క్ నగరంలోని ప్రతిష్టాత్మక కొలంబియా యూనివర్సిటీలో నిర్వహించనున్న అత్యున్నత స్థాయి సదస్సులో కేటీఆర్ పాల్గొననున్నారు. అమెరికా పర్యటనలో కేటీఆర్ బిజీగా గడపనున్నారు. కొలంబియా ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్ 2026 అంతర్జాతీయ వేదికపై ప్రసంగం.. భారతీయ వ్యాపార రంగం, ఆర్థిక సంస్కరణలు, అభివృద్ధి వ్యూహాలపై ఆయన తన అనుభవాలను పంచుకోనున్నారు. ఇక, ఈ పర్యటనలో కేటీఆర్ తన కుమారుడు హిమాన్షును కూడా కలవనున్నారు. వృత్తిపరమైన బాధ్యతలతో పాటు, కొంత సమయాన్ని తన కుటుంబ సభ్యులతో గడపనున్నట్లు కేటీఆర్ స్వయంగా వెల్లడించారు. సుమారు వారం రోజుల పాటు అమెరికాలో ఉండనున్న కేటీఆర్.. తిరిగొచ్చాక ఎప్పటిలాగే మళ్లీ రాజకీయ కార్యకలాపాల్లో నిమగ్నం కానున్నారు. తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా గతంలో ఆయన సాధించిన విజయాలు, రాష్ట్రాన్ని పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చిన తీరును దృష్టిలో ఉంచుకుని కేటీఆర్‌కు ఈ ఆహ్వానం అందినట్లు బీఆర్ఎస్ పేర్కొంది

# రాజ్యాంగం, విభేదాలు, భవిష్యత్‌పై సెమినార్

- బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** అంబేద్కర్ వర్సిటీలో ఆర్థిక సంస్కరణలు, భారత రాజ్యాంగం-విభేదాలు, భవిష్యత్ దిశ అనే అంశంపై త్వరలో 2 రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు జాతీయ సదస్సుకు సంబంధించి బ్రోచర్‌ను విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొ. చక్రపాణి మాట్లాడుతూ... ఆర్థిక సంస్కరణలు రాజ్యాంగ పరిమితులతో సమన్వయం సాధిస్తూ సమగ్ర, సమాన అభివృద్ధిని సాధించడం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ జాతీయ సదస్సు ఏప్రిల్ 9-10 తేదిల్లో విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సదస్సు ద్వారా ఆర్థిక సంస్కరణలు, రాజ్యాంగ పరిమితుల మధ్య ఉన్న సంబంధాలు, సవాళ్లు, అలాగే భవిష్యత్ అవకాశాలపై లోతైన చర్చలు జరగనున్నాయని సెమినార్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. వెంకటేశ్వర్లు తెలిపారు.

# నోటికాడి బుక్క నేలపాలు

- తెలంగాణ నీళ్ల ఆంధ్రాకు దోచిపెడ్తున్న సర్కార్
- కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ మాట్లాడరా?
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి




**హైదరాబాద్, మనం ప్రతినిధి :** నాటి నుండి నేటివరకు సాగునీటి రంగంలో దశాబ్దాల తరబడి తెలంగాణకు అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీపై కేసీఆర్ నాయకత్వంలో అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ సాధించుకున్నాం అని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. ఎందరో బలి దానాలతో ఏర్పడ్డ తెలంగాణ నీటిని ఆంధ్రాకు వదిలిపెట్టి రేవంత్ రెడ్డి తన గురుదక్షిణ చెల్లించుకుంటున్నాడని ఆయన అత్యంత ఘాటుగా విమర్శించారు. ఈ మేరకు మంగళవారంనాడు తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో సింగిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ... ప్రత్యేక రాష్ట్ర విభజన నేపథ్యంలో తాత్కాలిక ఒప్పందంలో కృష్ణా జలాల్లో కేంద్రం నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రా వ్యవహరిస్తున్నదని ఆయన దుయ్యబట్టారు. ఎలాంటి ఇండెంట్లు లేకుండా ఆంధ్రాకు నీటిని తరలిస్తున్నా తెలంగాణ ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని మండిపడ్డారు. గత రెండేళ్లలో ఏపీ అతి ఎక్కువగా నీళ్లను తరలిస్తే, తెలంగాణ అతి తక్కువగా వాడుకున్నది. అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుకు ఎందుకు డిమాండ్ చేయడం లేదని ప్రశ్నించారు. నల్లగొండ, పాలమూరు జిల్లాల్లో పంటలు చేతికి వచ్చే దశలో ఉన్నాయి. నోటికాడికి వచ్చే బుక్క నేలపాలవుతుంది. రైతుల కష్టార్జితం నాశనం అవుతుంది. సర్కార్ నడుపుతున్నారా ? సర్కస్ నడుపుతారా ? అని ప్రశ్నించారు. కేంద్రం పరిధిలో ఉన్న కేఆర్ఎంబీ తెలంగాణకు చేస్తున్న అన్యాయం గురించి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఒక్కనాడు కూడా ఎందుకు ప్రశ్నించరు ? తెలంగాణకు సాగునీటిలో జరుగుతున్న అన్యాయం మీద ఒక్కనాడు ఎందుకు అడగరన్నారు. ఏపీ ప్రభుత్వం ఇంటర్ బేసిన్ ట్రాన్స్‌ఫర్‌కు వ్యతిరేకంగా కృష్ణా బేసిన్ లో లేని హంద్రి నీవా, పెన్నా బేసిన్ , గాలేరు నగరి కి తరలిస్తున్నది.

ఇప్పుడు బనకచర్లతో ముందుకు గోదావరి జలాలు కృష్ణాకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఏడాది దాదాపు 45 రోజులు ఆలస్యంగా ఎత్తిపోతల పంపులు ప్రారంభించారన్నారు. ఈ ఏడాది అత్యధికంగా కృష్ణా నదికి వరదలు వచ్చాయి . సాగునీరు ఎత్తిపోసుకోకపోవడమే కాకుండా.. ఏపీ జలదోపిడీని నిరోధించలేక పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు వారాల ముందే హెచ్చరించినా ఈ ప్రభుత్వం మేలు కోలేదు. సాగునీటి దోపిడీని అడ్డుకోకుండా ఇప్పుడు పంటలు ఎండిపోయేటప్పుడు శ్రీశైలం వద్ద తీరిగ్గా ధర్నా చేస్తున్నారని అన్నారు. నీళ్లు మలుపుకునుడు చేతగాక, వెళ్లిపోయిన నీళ్ల కోసం శ్రీశైలం డ్యాం వద్ద ధర్నా చేస్తున్నారు. మీకు దమ్ముంటే, మీకు ప్రజలు, రైతుల ప్రయోజనాలు ముఖ్యం అనుకుంటే, మీకు పదవీలాలస లేకుంటే మిగిలిపోయిన పాలమూరు పనులు చేపట్టాలని రేవంత్ రెడ్డి ఇంటి ముందు ధర్నా చేయాలని సవాల్ విసిరారు. కేఎల్ఐ ఎత్తిపోతలను సక్రమంగా వాడితే 5 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు.

రిపేరులో ఉన్న రెండు పంపుల మరమ్మతులకు రూ.10 కోట్లు ఇవ్వకుండా రెండేళ్లుగా పెండింగులో పెట్టారు. 5 పంపులు నడిపితే సమృద్ధిగా నీరు వాడుకోవచ్చన్నారు. పాలమూరు- రంగారెడ్డి పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్ రెడ్డి, మర్రి జనార్దన్ రెడ్డి, ఆల వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

# అసెంబ్లీలో రేవంత్ ‘పహిల్వాన్’ భాష

- ఇక్కడ పాలసీలే ఉంటయ్?..కుస్తీ పోటీలుండవు?
- రేవంత్.. సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు ఏం తేడా లేదు?
- మాజీ మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలసీలను గాలికి వదిలేసి, పహిల్వాన్ల భాషను మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ధ్వజమెత్తారు. అసెంబ్లీలో పాలసీలు ఉంటాయి.. కానీ, పహిల్వాలు, కుస్తీ పోటీలు ఉండవని ఎద్దేవా చేశారు. అసెంబ్లీని కుస్తీల పోటీగా మార్చారని ఆయన మండిపడ్డారు. కత్తులతో కోలాటంలో తలలు తీసేస్తామని మరో ఎమ్మెల్యే వ్యాఖ్యానించారని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని హరీశ్ కోరారు.

### సీఎం భాషపై ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని డిమాండ్

గడిచిన రెండున్నర సంవత్సరాలలో రేవంత్ రెడ్డి సభలో మాట్లాడిన ఎన్నో అనాగరిక వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వం వైఫల్యాలను నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. అసెంబ్లీని కూడా ఈ ప్రభుత్వం ఇష్టం వచ్చినట్లు నడుపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీ బ్రేక్ పేరుతో, రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళుతున్నారని, ముఖ్యమంత్రి కేరళ నుంచి వస్తున్నారని, ఆర్థిక మంత్రి ప్రిపేర్ అవుతున్నారని, లంచ్ బ్రేక్ అంటూ ఇలా వివిధ కారణాలతో సభను గంటల పాటు వాయిదా వేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వివిధ కారణాలతో అసెంబ్లీ సమయాన్ని వృథా చేసి, మరి కావాలని సభను రాత్రి వరకు నడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ ఎన్నికల కోసమే.. శాసనసభను గత 30వ తేదీనే నిరవధిక వాయిదా వేశారని ఆరోపించారు. కేరళ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అవసరమేమో కానీ, తెలంగాణ ప్రజలకు, బీఆర్ఎస్ శాసనసభ్యులకు ప్రజా సమస్యలు ముఖ్యమని అన్నారు.

### రేవంత్.. సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు తేడా లేదు?

కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు పెద్దగా తేడా లేదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు నా(నే)టి కేంద్ర ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు కూడా కాళేశ్వరం చాలా గొప్ప ప్రాజెక్టు అని ప్రశంసించాయని అన్నారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లాంటి వారు కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణాకు వరప్రదాయిని అని అన్నారని గుర్తు చేశారు. ఇటీవల పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఎకనామిక్ సర్వేలో కాళేశ్వరం వల్ల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని చెప్పిందని వెల్లడించారు. అసెంబ్లీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కాళేశ్వరం వల్ల గత రెండేళ్లలో వేల ఎకరాల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని నివేదిక పెట్టారని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలో గంధమల్ల ప్రాజెక్టుకు, మూసీలో తెచ్చే గోదావరి నీళ్లు కాళేశ్వరం నుండి వస్తున్నాయని తెలిపారు. సీఆర్ పాటిల్ తెలంగాణకు వచ్చి ఇక్కడ రైతులను నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని అడిగితే సమాధానం వస్తుందని అన్నారు. కేవలం బీఆర్ఎస్ పార్టీ మీద బురదజల్లడానికే కాళేశ్వరం గురించి తప్పుగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో రూ.50 కోట్లు ఖర్చు చేస్తే మరో 2 లక్షల ఎకరాల ఆయకట్టు వస్తుందని రెండేళ్ల నుంచి దాదాపు 20 లేఖలు రాస్తున్నా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించడం లేదని ఆరోపించారు. మా మీద కోపం ఉంటే తీర్చుకోవచ్చు... కానీ ఆ కోపాన్ని రైతుల మీద చూపించవద్దని కోరారు.



# హనుమాన్ జయంతికి ప్రత్యేక ఆహ్వానం

**రంగారెడ్డి మార్చి 31 (మనం న్యూస్):** ఏప్రిల్ 2న హనుమాన్ జయంతి సందర్భంగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ శోభాయాత్ర నిర్వహించబడుతుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు కు ఆహ్వాన పత్రాన్ని సుధీర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గురువారం సాయంత్రం 4:00 గంటలకు బి.ఎన్.రెడ్డి.నగర్ చౌరస్తా నుండి సాహెబ్ నగర్ త్రినేత్ర ఆంజనేయ స్వామి దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు.భక్తి,శక్తి,ఐక్యతకు ప్రతీకగా నిర్వహించే ఈ భవ్య హనుమాన్ శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఇట్టి కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు,మాజీ కార్పొరేటర్లు,పలు డివిజన్ల అధ్యక్షులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా శ్రీవారికి స్నపన తిరుమంజనం

## ఏప్రిల్ 1న పౌర్ణమి గరుడసేవ రద్దు

**తిరుమల, మార్చి 31,మనం న్యూస్ :** తిరుమలలోని వసంతోత్సవ మండపంలో శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలలో భాగంగా రెండవ రోజైన మంగళవారం శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామివారికి స్నపన తిరుమంజనం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. ఆ తరువాత స్వామి, అమ్మవార్లు సాయంత్రం అక్కడినుండి బయల్దేరి ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్స్వామి, చిన్న జీయర్ స్వామి, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### ఏప్రిల్ 1న పౌర్ణమి గరుడసేవ రద్దు

శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 1వ తేదీన పౌర్ణమి గరుడసేవను టీటీడీ రద్దు చేసింది. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా శ్రీవారికి గరుడ సేవ నిర్వహిస్తున్న విషయం విదితమే. శ్రీవారి వార్షిక వసంతోత్సవాలు జరుగుతున్న కారణంగా పౌర్ణమి గరుడసేవ రద్దయింది. ఈ విషయాన్ని భక్తులు గమనించగలరు.

# హనుమాన్ జయంతి ఎమ్మెల్యేకు ఆహ్వానం అందజేత



**రంగారెడ్డి మార్చి 31 (మనం న్యూస్ )** ఏప్రిల్ 2న హనుమాన్ జయంతి సందర్భంగా (మీర్పేట్ (గ్రామం) 59వ డివిజన్ కు చెందిన యువ నాయకులు పల్లె అక్షయ్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ శోభాయాత్ర నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి , మహేశ్వరం నియోజకవర్గము శాసన సభ్యురాలు, బిఆర్ఎస్ పార్టీ శాసనసభాపక్ష డిప్యూటీ ఫ్లోర్ లీడర్. పి. సబితా ఇంద్రా రెడ్డి కి ప్రత్యేక ఆహ్వానాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం జిల్లెలగూడ భారీ యువకుల సమూహమున నడుమ అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి మీర్పేట్ సర్కిల్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి , సీనియర్ నాయకులు అర్కల భూపాల్ రెడ్డి , సునీత బాలరాజు , పల్లె జంగయ్య, దీప్లాల్ చౌహాన్ , పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి ,అనిల్ కుమార్ యాదవ్ , అవినాష్, నాయకులు భారీ ఎత్తున యువకులు తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల సాధన కోసం రాజీలేని పోరాటం

- మదనపల్లె రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సాకే శైలజానాథ్, నిస్సార్ అహమ్మద్ స్పష్టం



**మదనపల్లి, మార్చి 31,మనం న్యూస్ :** కరువు పీడిత రాయలసీమ ప్రాంతానికి రాయలసీమ ఎత్తిపోతల పథకం జీవనాడి అని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ నేత సాకే శైలజానాథ్, మదనపల్లె వైయస్సార్ సిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ అన్నారు. మంగళవారం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులపై మదనపల్లె ప్యారడైజ్ ఫంక్షన్ హాల్లో మదనపల్లె వైయస్సార్ సిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ముఖ్య అతిథిగా విచ్చేసారు. మాజీ మంత్రి సాకే శైలజానాథ్, రాజంపేట ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథరెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి, మదనపల్లె నియోజకవర్గం నిస్సార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి, మదనపల్లె నియోజకవర్గ పరిశీలకులు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రమేష్ కుమార్ రెడ్డి, నల్లారి తిమ్మారెడ్డి, పీలేరు ఇక్బల్ అహమ్మద్, ముఖ్య నేతలు ప్రజాప్రతినిధులు హజరైనారు. ముందుగా నిస్సార్ అహమ్మద్ ఆధ్వర్యంలో పెద్దాయన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు.

ముందుగా మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల ఆవశ్యకతను వివరించారు. వారు మాట్లాడుతూ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్కు సంబంధించిన భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా చర్చించడం జరిగింది. కూటమి ప్రభుత్వం సాగు నీరంటే పట్టింపు లేదని, వ్యవసాయం అంటే దండగ అన్న భావనలో ఉన్నారన్నారని విమర్శలు గుప్పించారు. స్వప్రయోజనాలు తప్ప రైతాంగానికి మేలు చేసే ప్రజా సమస్యలపై మాట్లాడలేని స్థితిలో ముఖ్యమంత్రి ఉన్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజల కోసం, కృష్ణా పరివాహక ప్రాంత ప్రయోజనాల కోసం వైఎస్సార్సీపీ తీవ్ర పోరాటం చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తో ఆంధ్ర సిఎం చంద్రబాబునాయుడు కుమ్మక్కై ప్రాజెక్టును ఆపేయడం దారుణమన్నారు. రాయలసీమ లిఫ్ట్ వల్ల వచ్చే 22 టీఎంసీలతో ఏం లాభమని ఇరిగేషన్ మంత్రి మాట్లాడడం దారుణమన్నారు.

హంద్రీ-నీవా నుంచి గాలేరు-నగరికి ఉన్న లింక్ కెనాల్ కూడా పూర్తి చేయడం లేదని విమర్శలు గుప్పించారు. తమ భవిష్యత్తు ప్రశ్నార్థకం చేసే రాయలసీమ వ్యతిరేక నిర్ణయాలను సహించబోమని, కలిసి వచ్చే పార్టీలతో పోరాటం చేస్తామని, పార్టీలకు అతీతంగా కలసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైయస్సార్ సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మనిషితనమే పరమధర్మం

ఈ నేలపైని గాలులు
స్నేహాన్ని మోసుకొచ్చే శ్వాసలు
గాయపడిన మనసులపై
హిమబిందువుల్లా చల్లదనాన్ని చల్లే సవ్వడులు

ఈ దేశం ఒక నది -
అనేక ప్రవాహాలు కలిసే మహాసముద్రం
ఒక ప్రవాహాన్ని అడ్డుకుంటే
సముద్ర హృదయంలో చీలిక పుడుతుంది

ఇక్కడ మసీదు మీనారులు
అజాన్ గీతాన్ని ఆలపిస్తాయి
గుడి గోపురాలు కీర్తనలు పాడుతాయి
చర్చీ గంటలు శాంతి స్వరాన్ని మోగిస్తాయి
గురుద్వారా నాదాలు సోదరత్వాన్ని చాటుతాయి
అన్నీ కలిసే ఈ నేల గుండె చప్పుడు

ఆ చప్పుడు
ఒకప్పుడు ప్రేమతో నిండిన నాదం
మనసులను కలిపే మృదువైన స్వరం
కానీ ఇప్పుడు విద్వేషపు పొగమంచు
కొన్ని కళ్లపై చీకటిని కప్పేసింది
మనిషిని మతంతో కొలిచే
విష నాగులు వీధుల్లో వీరవిహారం చేస్తున్నాయి

గుర్తుంచుకో -
రాజ్యాంగం ఒక కాగితం ముక్క కాదు
ఈ నేల ప్రజల కన్నీళ్లు, రక్తం
ఆశలతో చెక్కిన ప్రతిజ్ఞ

విద్వేషం అగ్ని అయితే
ప్రేమ ఒక సముద్రం -
ఎంత ఎగిసినా
చివరికి తప్పున చల్లారి పోయేదే

మన చేతులు విడదీయడానికి కాదు
విరిగిన హృదయాలను
మళ్లీ కలపడానికే

మనసులు మతాల కంటే విశాలమైతే
ఈ నేలపై పుట్టే ప్రతి ఉదయం
సామరస్యపు సూర్యోదయంగా వికసిస్తుంది

ఆ రోజు భారతం ప్రపంచానికి చెబుతుంది -
మనిషితనం కన్నా గొప్ప ధర్మం
ఈ పుడమిపై లేదని...

**- యండి. ఉస్మాన్ ఖాన్**
9912580645

# ఆర్బీఐ తొమ్మిది దశాబ్దాల అప్రతిహత యాత్ర

భారతదేశ ఆర్థిక చరిత్రను నిశితంగా పరిశీలిస్తే, ఒక దేశం యొక్క సార్వభౌమాధికారం కేవలం దాని రాజకీయ సరిహద్దుల్లోనే కాకుండా, ఆ దేశ కరెన్సీ స్థిరత్వం మరియు ఆర్థిక క్రమశిక్షణలోనూ దాగి ఉంటుందని స్పష్టమవుతుంది. ఈ దిశగా భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా, దిక్సూచిగా నిలిచిన అత్యున్నత సంస్థ 'భారతీయ రిజర్వు బ్యాంకు' (ఆర్బీఐ). ఒక చారిత్రక అనివార్యతగా ప్రారంభమై, నేడు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన కేంద్రీయ బ్యాంకులలో ఒకటిగా ఎదిగిన ఆర్బీఐ ప్రస్థానం అనన్య సామాన్యం.



మొదటి ప్రపంచ యుద్ధం (1914-1918) సృష్టించిన ఆర్థిక విధ్వంసం ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల ఆర్థిక పునాదులను కదిలించి వేసింది. యుద్ధం కారణంగా ఏర్పడిన సరఫరా గొలుసు అంతరాయాలు, విపరీతమైన రక్షణ వ్యయం, మరియు కరెన్సీ విలువలలో సంభవించిన అస్థిరత అప్పట్లో బ్రిటిష్ వలస పాలనలో ఉన్న భారతదేశంపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. యుద్ధ కాలంలో బ్రిటన్ తన అవసరాల కోసం విపరీతంగా కరెన్సీని ముద్రించడంతో ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకింది. 1920వ దశకంలో భారతీయ రూపాయి విలువ అంతర్జాతీయ మార్కెట్లో, ముఖ్యంగా పౌండ్ స్టెర్లింగ్తో పోల్చినప్పుడు తీవ్రమైన ఒడిదుడుకులకు లోనైంది. రూపాయి విలువ ఒక పౌండ్ స్టెర్లింగ్‌కు 15 రూపాయల వరకు పెరగడం, మళ్ళీ అతి తక్కువ కాలంలోనే 13 రూపాయలకు పడిపోవడం వంటి పరిణామాలు భారతీయ వ్యాపారవేత్తలను, సామాన్య రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బ తీశాయి. కరెన్సీ మరియు పరపతి నియంత్రణను కేవలం ప్రభుత్వ విభాగంగా కాకుండా ఒక స్వతంత్ర కేంద్రీయ సంస్థ ద్వారా నిర్వహించాల్సిన అవసరం ఆ కాలంలోనే బలంగా వినిపించింది. ఈ నేపథ్యంలో, భారత కరెన్సీ మరియు ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు సూచించేందుకు 1926లో బ్రిటిష్ ప్రభుత్వం 'రాయల్ కమిషన్ ఆన్ ఇండియన్ కరెన్సీ అండ్ ఫైనాన్స్'ను నియమించింది. దీనినే మనం 'హిల్టన్ యంగ్ కమిషన్' అని పిలుస్తాము. అయితే, ఈ బ్యాంకు ఏర్పాటు వెనుక ఉన్న మేధోపరమైన పునాదిని ప్రస్తావించకుండా ఆర్బీఐ చరిత్ర అసంపూర్ణ మవుతుంది. ఆధునిక భారతదేశ నిర్మాతలలో ఒకరైన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాసిన 'ది ప్రాబ్లం ఆఫ్ ది రూపాయి - ఇట్స్ ఆరిజిన్ అండ్ ఇట్స్ సొల్యూషన్' (The Problem of the Rupee& Its Origin and Its Solution) అనే పరిశోధనా గ్రంథం ఈ కమిషన్ ముందు ఒక దిక్సూచిలా నిలిచింది. అంబేద్కర్ గారు కరెన్సీ స్థిరత్వంపై అందించిన లోతైన విశ్లేషణలు, ఒక కేంద్రీయ బ్యాంకుకు ఉండాల్సిన స్వయం ప్రతిపత్తిపై ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు హిల్టన్ యంగ్ కమిషన్ సభ్యులను ఎంతగానో ప్రభావితం చేశాయి. ఫలితంగా, భారత దేశానికి ఒక స్వతంత్ర కేంద్రీయ బ్యాంకు ఉండాలనే బలమైన సిఫారసు వెలువడింది. ఈ సిఫారసుల ఆధారంగానే 'భారతీయ రిజర్వు బ్యాంకు చట్టం1934' ఆమోదించ బడింది. ఆ చట్టం ప్రకారం 1935 ఏప్రిల్ 1న ఆర్బీఐ తన కార్యకలాపాలను అధికారికంగా ప్రారంభించింది. ఆరంభంలో ఇది ఒక ప్రైవేట్ షేర్ హోల్డర్ల సంస్థగా, 5 కోట్ల రూపాయల ప్రాథమిక మూలధనంతో ఏర్పాటైంది. ఆ రోజుల్లో ఇది ఒక అసాధారణ పెట్టుబడిగా పరిగణించ బడేది. మొదట కోల్కతాలో ఉన్న దీని ప్రధాన కార్యాలయాన్ని, దేశ వాణిజ్య కార్యకలాపాల కేంద్ర బిందువుగా ఎదుగుతున్న ముంబైకి 1937లో మార్చడం జరిగింది.

భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత, దేశాభివృద్ధిలో కేంద్రీయ బ్యాంకు పాత్ర మరింత కీలకమని ప్రభుత్వం గుర్తించింది. ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉన్న ఆర్థిక అధికారం ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగపడాలనే ఉద్దేశంతో 1949 జనవరి 1న ఆర్బీఐని జాతీయీకరణ చేశారు. దీంతో ఇది పూర్తిగా భారత ప్రభుత్వ పర్యవేక్షణలోకి రావడమే కాకుండా, దేశ సామాజిక-ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసే ఒక ప్రజాస్వామ్య సంస్థగా రూపాంతరం చెందింది. ఆర్బీఐ యొక్క ప్రాథమిక మరియు అత్యంత ముఖ్యమైన విధి 'కరెన్సీ జారీ'. ఒక రూపాయి నోటు మరియు చిల్లర నాణేలు మినహా, భారతదేశంలో చలామణిలో ఉన్న ప్రతి కరెన్సీ నోటు వెనుక ఆర్బీఐ గవర్నర్ సంతకం చేసిన 'భరోసా' ఉంటుంది. 1950వ దశకంలో కేవలం 1,200 కోట్లుగా ఉన్న కరెన్సీ చలామణి, నేడు 35 లక్షల కోట్లకు పైగా పెరగడం అనేది కేవలం అంకెల్లో పెరుగుదల మాత్రమే కాదు, అది భారత ఆర్థిక వ్యవస్థ విస్తరణకు, పారిశ్రామిక వృద్ధికి మరియు ప్రజల కొనుగోలు శక్తికి అద్దం పడుతోంది. అయితే, కేవలం డబ్బును ముద్రించడం మాత్రమే కాకుండా, మార్కెట్లో డబ్బు సరఫరాను నియంత్రించడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడం ఆర్బీఐ యొక్క అసలైన నైపుణ్యం. దీనినే మనం 'ద్రవ్య విధానం' (Monetary Policy) అంటాము. రిపో రేటు (బ్యాంకులకు ఆర్బీఐ ఇచ్చేఅప్పుపై వడ్డీ), రివర్స్ రిపోరేటు, నగదు నిల్వల నిష్పత్తి (CRR) వంటి సంక్లిష్టమైన సాధనాల ద్వారా మార్కెట్లో నగదు లభ్యతను ఆర్బీఐ సర్దుబాటు చేస్తుంది. ఉదాహరణకు, కరోనా మహమ్మారి సమయంలో ఆర్థిక వ్యవస్థ స్తంభించకుండా ఉండేందుకు రిపో రేటును 4 శాతానికి తగ్గించి, మార్కెట్లోకి నిధులు ప్రవహించేలా చేయడం ద్వారా సామాన్యులకు తక్కువ వడ్డీకే రుణాలు అందేలా చేసిన ఘనత ఆర్బీఐదే.

కేంద్రీయ బ్యాంకుగా ఆర్బీఐ పోషిస్తున్న మరో కీలక పాత్ర 'బ్యాంకర్లకు బ్యాంకర్'గా వ్యవహరించడం. దేశంలోని వాణిజ్య బ్యాంకులన్నీ తమ నిధులలో కొంత భాగాన్ని భద్రత కోసం ఆర్బీఐ వద్ద ఉంచాలి. ఇది బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకాన్ని కలిగిస్తుంది. అలాగే, ప్రభుత్వానికి కూడా ఇది ఆర్థిక సలహాదారుగా పనిచేస్తుంది. ప్రభుత్వం తరఫున బాండ్లు జారీ చేయడం, రుణాలు సేకరించడం వంటి బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తోంది. భారత ఆర్థిక చరిత్రలో 1991వ సంవత్సరం ఒక పెద్ద మలుపు. అప్పట్లో దేశం తీవ్రమైన విదేశీ మారక ద్రవ్య సంక్షోభాన్ని ఎదుర్కొంది. మన వద్ద ఉన్న నిల్వలు కేవలం రెండు వారాల దిగుమతులకు సరిపడేలా, అంటే కేవలం 1 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. అటువంటి క్లిష్ట సమయంలో ఆర్బీఐ మరియు ప్రభుత్వం కలిసి చేపట్టిన సాహసోపేతమైన ఆర్థిక సంస్కరణలు మనల్ని గట్టెక్కించాయి. ఆ సంక్షోభం నుండి పాఠాలు నేర్చుకున్న ఫలితంగా, నేడు మన విదేశీ మారక నిల్వలు 650 బిలియన్ డాలర్ల మైలురాయిని అధిగమించాయి. ఇది ప్రపంచ వేదికపై భారత ఆర్థిక పటిమను చాటి చెబుతోంది. నేడు మనం ఉపయోగిస్తున్న యూపీఐ (Unified Payments Interface) వ్యవస్థ ప్రపంచా నికే ఆదర్శంగా నిలిచింది. నగదు రహిత లావాదేవీలను ప్రోత్స హించడం ద్వారా ఆర్థిక పారదర్శకతను పెంచడంలో ఆర్బీఐ కీలక పాత్ర పోషించింది. 2024-25 నాటికి నెలకు సగటున 12 బిలియన్లకు పైగా యూపీఐ లావాదేవీలు జరుగుతున్నాయంటే, అది ఆర్బీఐ కల్పించిన డిజిటల్ మౌలిక సదుపాయాల విజయం. అంతేకాకుండా, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 'సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ' (CBDC) లేదా డిజిటల్ రూపాయిని ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టింది. ఇది కరెన్సీ నిర్వహణ వ్యయాన్ని తగ్గించడమే కాకుండా, లావాదేవీల వేగాన్ని పెంచుతుంది. 2022-2024 మధ్య కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు, ఆర్బీఐ అప్రమత్తంగా వ్యవహరించి వడ్డీ రేట్లను సవరించడం ద్వారా దేశీయ మార్కెట్లో ధరల స్థిరత్వాన్ని కాపాడింది.

భారతీయ రిజర్వు బ్యాంకు అనేది కేవలం ఒక నియంత్రణ సంస్థ మాత్రమే కాదు, అది దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక సురక్షితమైన కవచం. హిల్టన్ యంగ్ కమిషన్ సిఫార్సుల నుండి డాక్టర్ అంబేద్కర్ మేధో పునాది వరకు, 1935 నాటి ప్రైవేట్ సంస్థ నుండి నేటి డిజిటల్ ఆర్థిక చోదక శక్తి వరకు ఆర్బీఐ ప్రయాణం స్ఫూర్తిదాయకం. దేశంలోని పేద ప్రజల పొదుపు మొత్తానికి భద్రత నిస్తూ, పారిశ్రామిక వేత్తల పెట్టుబడులకు దిశానిర్దేశం చేస్తూ, అంతర్జాతీయ స్థాయిలో రూపాయి గౌరవాన్ని నిలబెడుతూ ఆర్బీఐ చేస్తున్న కృషి అమోఘం. రాబోయే దశాబ్దాల్లో భారత దేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగే క్రమంలో, ఆర్బీఐ తన అనుభవం మరియు ఆధునిక సాంకేతికతతో దేశాభివృద్ధికి మరింత పటిష్టమైన పునాది వేస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఆర్థిక స్థిరత్వం, పారదర్శకత మరియు సమ్మిళిత వృద్ధి అనే మూడు సూత్రాలే పరమావధిగా సాగుతున్న ఆర్బీఐ ప్రస్థానం భారత ప్రగతి పథంలో చిరస్థాయిగా నిలిచి పోతుంది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# ఆధిపత్య వేటలో మానవత్వం బలి!



మానవ చరిత్రను తిరగేస్తే యుద్ధాలు మనిషి సృష్టించిన అతిపెద్ద విషాదాలు అని స్పష్టమవుతుంది. అభివృద్ధి, సాంకేతిక ప్రగతి, ఆర్థిక వృద్ధి ఎంత ఉన్నా..మానవతా విలువలు లేకపోతే ఆ ప్రగతి నిష్ప్రయోజనం. నేటి ప్రపంచం అలాంటి దశలో నిలిచింది. ఒకవైపు ఆధునికత గర్వంగా నిలుస్తుంటే, మరోవైపు యుద్ధ భయాలు మానవ సమాజాన్ని కమ్మేస్తున్నాయి.ఈ పరిస్థితుల్లో శాంతి అవసరం మరింత ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

ప్రపంచం హింస, వినాశనాల దశలోకి జారిపోతోంది. దేశాల మధ్య విభేదాలు, భయాందోళనలు పెరుగుతూ మానవ సమాజాన్ని అశాంతి వైపు నెట్టుతున్నాయి. ఇది మానవ జాతికి అనుకూలమైన దిశ కాదు. గతంలో జరిగిన రెండు ప్రపంచ యుద్ధాలు మానవాళికి ఇచ్చిన గాయాలు ఇంకా మానలేదు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా జరిగిన నష్టం మానవ చరిత్రలో మచ్చలుగా నిలిచిపోయింది. ఈ అనుభవాలే ఒక స్పష్టమైన హెచ్చరిక- అహింసా మార్గమే శాశ్వత శాంతికి దారి. అయితే,కొన్ని దేశాల సామ్రాజ్య కాంక్షలు, ఆధిపత్య భావజాలం ప్రపంచాన్ని మళ్లీ యుద్ధాల వైపు నెడుతున్నాయి. అణచివేతలు, దాడులు, విధ్వంసక చర్యలు పెరుగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ శాంతి కోసం ఏర్పడిన సంస్థలు కూడా చాలా సందర్భాల్లో మౌనంగా ఉండడం బాధాకరం. ఈ మౌనం కేవలం నిర్లక్ష్యం కాదు- బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. ఇటీవలి కాలంలో ప్రపంచంలోని పరిణామాలు మరింత ఆందోళనకరంగా ఉన్నాయి. యుద్ధాల పేరిట పౌరులపై దాడులు, ఆసుపత్రులు, పాఠశాలలు, శరణార్థ శిబిరాలు లక్ష్యాలుగా మారడం మానవత్వాన్ని అవమానించడమే. అంతర్జాతీయ ఒప్పందాలు, ముఖ్యంగా జెనీవా ఒప్పందాలు, కాగితాలపై మాత్రమే మిగిలిపోతున్నాయి.

ఒకవైపు యుద్ధం పేరుతో దేశాలు తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలనుకుంటే, మరోవైపు సాధారణ ప్రజలు నాశనానికి గురవుతున్నారు. యుద్ధం వల్ల గెలిచేది ఎవరో తెలియదు కానీ ఓడిపోవడం మాత్రం ఖచ్చితంగా మానవత్వమే. ఆర్థిక వ్యవస్థలు కూలిపోతాయి, దేశాలు అప్పుల కూపంలో పడతాయి, ప్రజల జీవితం శిధిలమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఈ విధ్వంసం చూస్తూ కూడా మౌనం పాటించడం మరింత ప్రమాదకరం. యుద్ధం తర్వాత మిగిలేది రక్తపు మచ్చలు, కన్నీటి జాడలు మాత్రమే- ఇది చరిత్ర చెప్పిన నిజం. ప్రస్తుతం ప్రపంచ రాజకీయాల్లో చోటుచేసు కుంటున్న పరిణామాలు మరింత సంక్లిష్టంగా మారుతున్నాయి. కొన్ని దేశాలు తమ ఆర్థిక, రాజకీయ సంక్షోభాలను దాటేందుకు యుద్ధాలను ఆశ్రయిస్తున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇలాంటి చర్యలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను కుదేలు చేస్తూ, చమురు, వాణిజ్య రంగాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ప్రజలలో ఆగ్రహం పెరుగు తోంది. ముఖ్యంగా అమెరికాలో ప్రజలు పెద్ద ఎత్తున యుద్ధం వద్దు అని గళమెత్తుతున్నారు.

దేశ వ్యాప్తంగా వేలాది నిరసన కార్య క్రమాలు జరిగాయి.లక్షలాది మంది ప్రజలు వీటిలో పాల్గొని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పెద్ద నగరాల్లో జరిగిన ఈ ప్రదర్శ నలు యుద్ధానికి వ్యతిరేకంగా పెరుగుతున్న ప్రజా స్వరం ఎంత బలంగా ఉందో చూపిస్తున్నాయి. పౌరహక్కులు, మానవ విలువలు, శాంతి కోసం గళమెత్తుతున్న ఈ స్వరాలు భవిష్యత్తుకు ఆశాకిరణం. ఇక అంతర్జాతీయ రాజకీయాల్లో నాయకత్వం వహిస్తున్న దేశాలు, నాయకులు తమ బాధ్యతను గుర్తించాలి. ప్రపంచం అగ్నిగుండంలా మారుతున్న ఈ సమయంలో మౌనం కాదు,చర్య అవసరం. పక్కవాడు కష్టాల్లో ఉన్నప్పుడు మౌనం పాటిస్తే, రేపు మన వంతు వచ్చినప్పుడు మాట్లా డేందుకు ఎవరూ మిగలరు అనే నిజాన్ని ప్రపంచ దేశాలు గ్రహించాలి.

ప్రపంచం ఇప్పటికే ఎన్నో చేదు అనుభవాలను ఎదుర్కొంది. యుద్ధాల వల్ల ధ్వంసమైన దేదీ మళ్లీ రాదు. పాడైపోయిన ఆర్థిక వ్యవస్థలు పునరుద్ధరణకు సంవత్సరాలు పడతాయి. అయినప్పటికీ, మనిషి అదే తప్పులను మళ్లీ మళ్లీ పునరావృతం చేయడం విచారకరం. యుద్ధం అనేది కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణ మాత్రమే కాదు-అది మానవ విలువలపై దాడి. ప్రతి బాంబు పేలుడు వెనుక కొన్ని వేల కుటుంబం బాధ ఉంది, ప్రతి ఆధునిక ఆయుధాలు ప్రయోగించడం వల్ల ఒక తరం భవిష్యత్తు చీకటిలో కలిసి పోతుంది. కాబట్టి యుద్ధాన్ని సాధారణ రాజకీయ సాధనంగా చూడటం అత్యంత ప్రమాదకరం.

'మనిషి మనిషిని కాపాడే సమాజమే నిజమైన నాగరికత. రక్తపాతం కాదు, సహానుభూతే మానవత్వానికి గుర్తు. యుద్ధాలు ఆగాలి.. శాంతి సాగాలి.. ప్రపంచం మళ్లీ మానవత్వం వైపు నడవాలి'.

**- మేకిరి దామోదర్**
9573666650



# అహం కాలిపోయే చోట.. సత్యం పుడుతుంది!



ఈ సృష్టిలో మనిషి ప్రయాణం ఒక విచిత్రమైన పాఠశాల. పుట్టిన క్షణం నుండి గిట్టే వరకు మనం ఎందరో గురువులను కలుస్తాం. వేలు పట్టి నడక నేర్పే అమ్మ, లోకాన్ని చూపే నాన్న, అక్షర జ్ఞానాన్ని ప్రసాదించే గురువులు ఇలా ఎందరో మనల్ని తీర్చిదిద్దుతారు. కానీ, వీరందరి కంటే అత్యంత నిష్ఠగా, ఎటువంటి మొహమాటం లేకుండా, పచ్చినిజాలను నిరంతరం బోధించే ఒకే ఒక్క గురువు ఉన్నాడు. అతడే స్మశానం. చాలా మందికి స్మశానం అంటే భయం, మరికొందరికి అది అపవిత్రమైన చోటు, ఇంకొందరికి అంతులేని దుఃఖానికి చిరునామా. ఆ దారిలో వెళ్లడానికే జంకే మనస్తత్వాలు మనవి. కానీ, ఒక్కసారి ఆలోచించండి.. ఏ కోలాహలం లేని ఆ నిశ్శబ్ద క్షేత్రంలో నిలబడి, కళ్ళు మూసుకుని మనసును తెరిచి ఉంచితే అక్కడ లభించే జ్ఞానోదయం ఏ ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ విశ్వవిద్యాలయాలూ ఇవ్వలేవు. మన భారతీయ సంస్కృతిలో, ముఖ్యంగా తెలుగు సాహిత్యంలో స్మశానానికి ఒక విశిష్టమైన వేదాంత స్థానం ఉంది. కాళిదాసు మహాకవి తన కావ్యాల్లో స్మశాన వైరాగ్యాన్ని వర్ణించిన తీరు నుండి, విక్రమార్కుడి కథల్లో బేతాళుడు స్మశానంలోనే జ్ఞానాన్ని పరీక్షించే ఘట్టాల వరకు ఇవన్నీ మనకు ఒకటే విషయాన్ని గుర్తు చేస్తాయి. ఆదిశంకరాచార్యుల వంటి మహనీయులు స్మశానాన్ని ఒక సాధనా క్షేత్రంగా చూశారు. మన పెద్దలు తరచూ శ్మశాన వైరాగ్యం అనే పదాన్ని వాడుతుంటారు. కానీ, ఆ క్షణ కాలపు వైరాగ్యంలో ఉదయించే ఒకే ఒక్క ప్రశ్న మనిషిని మార్చగలదు. నేను ఎవరు? నేను ఎందుకు జీవిస్తున్నాను? చివరికి మిగిలేది ఏమిటి? ఈ ప్రశ్నలతో అహంకారం కరిగిపోతే, మనిషి మహనీయుడు అవుతాడు. సగటు మనిషి తన దైనందిన జీవితంలో అహంకారం, అసూయ, లోభం, మోహం అనే చతుర్విధ శత్రువుల చుట్టూ తిరుగుతుంటాడు. నా ఇల్లు, నా కారు, నా పదవి, నా అంతస్తు అనే భ్రమల్లో బతుకుతుంటాడు. కానీ, ఒక్కసారి మండుతున్న చితి ముందు నిలబడి చూడండి. ఆ మంటల్లో కాలిపోతున్నది కేవలం ఒక శరీరం మాత్రమే కాదు, ఆ మనిషి మోసిన అసంఖ్యాకమైన ఆశలు, అహంకారాలు కూడా బూడిదైపోతున్నాయి. మనం ప్రాణప్రదంగా దాచుకున్న ధనం గానీ, మనం గర్వపడే అందం గానీ ఏదీ ఆ అగ్నిని ఆపలేదు. ఈ లోకంలో మనం సంపాదించినవన్నీ ఇక్కడే వదిలేసి, ఒట్టి చేతులతో వెళ్లాల్సిందే అనే సత్యాన్ని స్మశానం ఒక కర్రతో కొట్టినట్టు చెబుతుంది. ఈ శరీరం పంచభూతాల కలయిక, చివరకు ఆ పంచభూతాల్లోనే కలిసి పోతుంది. ఆది శంకరాచార్యులు తన భజ గోవిందంలో అత్యంత సరళంగా ఈ జీవిత సత్యాన్ని వివరించారు. 'పునరపి జననం పునరపి మరణం, పునరపి జననీ జఠరే శయనం' మళ్ళీ పుట్టడం, మళ్ళీ చావడం, మళ్ళీ తల్లి గర్భంలో చేరడం ఈ జనన మరణ చక్రం అనంతమైనది. ఈ చక్రం నుండి విముక్తి పొందడమే అసలైన జ్ఞానం అని ఆయన బోధించారు. అక్కడ ఉన్నప్పుడు మనకు అనిపిస్తుంది అరే! నిన్నటి వరకు మనతో తిరిగిన మనిషి ఈరోజు పిడికెడు బూడిదై పోయాడు కదా అని. ఈ అనిత్యతను గ్రహించిన వాడు దేనికోసం అశాంతికిలోనుకాడు. చాలా మంది వైరాగ్యం అంటే అడవుల్లోకి వెళ్లిపోవడమని, సంసారాన్ని వదిలేయడమని పొరబడతారు. కానీ సంస్కృతంలో వైరాగ్యం అంటే వస్తువుల మీద, వ్యక్తుల మీద ఉన్న అతిశయమైన వ్యామోహాన్ని వదులుకోవడం. ఇది నిరాశావాదం కాదు, ఇది అసలైన స్వేచ్ఛ.

స్మశానంలో నిలబడినప్పుడు మనకు ఒక స్పష్టత వస్తుంది. మనం ఎన్ని ఆస్తులు కూడబెట్టినా, ఆఖరి ప్రయాణంలో మన వెంట వచ్చేది మన కర్మ మాత్రమే. మనం ఇతరులకు చేసిన మేలు, పంచిన ప్రేమ, చూపిన కరుణ మాత్రమే మన పేరును నిలబెడతాయి. రామకృష్ణ పరమహంస తన శిష్యులను తరచూ స్మశానాలకు తీసుకెళ్లి ధ్యానం చేయమనేవారు. ఆయన చెప్పే ఒక గొప్ప మాట రాజు కూడా మట్టి, పేదవాడు కూడా మట్టే. ఆ మట్టిలో కలవకముందే నీవు ఈ లోకానికి ఏమి ఇచ్చావు అనేదే నీ చరిత్రను రాస్తుంది. ఈ బోధనలు విన్నప్పుడు శిష్యుల మనసులు అద్దంలా స్వచ్ఛంగా మారిపోయేవి.నేటి సమాజంలో మనుషుల మధ్య ఎన్ని గోడలు! కులం పేరుతో కొందరు, మతం పేరుతో మరికొందరు, ధనిక పేద వ్యత్యాసాలతో ఇంకొందరు విడిపోతున్నారు. అంతస్తుల భవనాల్లో ఉండేవారికి, ఫుట్పాత్పై పడుకునేవారికి మధ్య ఆకాశానికి భూమికి ఉన్నంత తేడా ఉంటుంది. కానీ స్మశానానికి వస్తే అక్కడ అందరూ సమానమే.

అక్కడ ధనవంతుడికి ప్రత్యేకమైన అగ్ని ఉండదు, పేదవాడికి తక్కువ రకపు మట్టి ఉండదు. అందరినీ ఆహ్వానించేది ఒకే భూమి, అందరినీ దహించేది ఒకే అగ్ని. ఈ మహా సమానత్వం చూసినప్పుడు ఏ మనిషికైనా సహజంగానే వినయం వస్తుంది. ఎదుటి మనిషిని తక్కువ చేసి చూసే అహంకారం సన్నగిల్లుతుంది. స్మశానం ఒక గొప్ప సోషలిస్ట్ గురువు. అది గ్రంథాల్లోని వేదాంతాన్ని నేరుగా ప్రాక్టికల్గా చూపిస్తుంది. స్మశానం అంటే కేవలం మృతదేహాలను సాగనంపే చోటు కాదు, అది మనలోని దుర్గుణాలను సాగనంపే క్షేత్రం. మనసును ఒక క్రమపద్ధతిలో ఉంచే సాధన కేంద్రం. మనం రోజులో కనీసం ఒక్క నిమిషమైనా మన మరణాన్ని మనం ఊహించుకుంటే, మనలో ఉన్న క్రోధం, ద్వేషం ఆ క్షణమే మాయమవుతాయి.జీవితం అనేది ఒక పరుగు పందెం కాదు, అదొక అనుభవం. ఆ అనుభవంలో మనం ఎంత సంపాదించామన్నది ముఖ్యం కాదు, ఎంతమంది హృదయాలను గెలుచుకున్నామన్నదే ముఖ్యం. స్మశాన వాటిక మనకు గుర్తు చేసేది అదే. నీవు వెళ్ళిపోయాక కూడా నీవు చేసిన మంచి పనులు ఇక్కడ సజీవంగా ఉండాలి అనే సందేశాన్ని అది మన నిరంతరం అందిస్తూనే ఉంటుంది. అందుకే మిత్రులారా, స్మశానాన్ని చూసి భయపడకండి. అది జీవితాన్ని ద్వేషించమని చెప్పదు, జీవితాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో నేర్పుతుంది. అక్కడ కాలిపోయే చితి మనకు చెప్పే చివరి మాట ఇదే నేను కాలిపోయాను, కానీ నా నుంచి వెలుగును తీసుకుని నీ జీవితాన్ని ప్రకాశవంతం చేసుకో.

ఎవరికీ హాని చేయకు, ఉన్నంతలో అందరికీ మంచి చేయి.ఈ సత్యాన్ని గ్రహించిన రోజే మనిషి నిజమైన మనిషిగా మారుతాడు. స్మశానం నేర్పే ఈ నిశ్శబ్ద పాఠం ప్రతి ఒక్కరి గుండెల్లో జ్ఞాన జ్యోతిని వెలిగించాలి.

**- డా. సూర్యదేవర రామకృష్ణ**
9490754169

# సంగీత రంగంలోనూ లింగ వివక్ష



సంగీతంలో మహిళల పాత్రను ప్రశంసించడం, వారిని ప్రోత్సహించడం, ఈ రంగంలో లింగ సమానత్వాన్ని సాధించడం, మంచి మహిళా సంగీత విద్వాంసులను సన్మానించడం, మహిళా సంగీతకారుల ప్రభావాన్ని గుర్తు చేసుకోవడం, భవిష్యత్తులో మహిళా సంగీతకారులకు సముచిత స్థానం కల్పించడం లాంటి అంశాల్లో పాల్గొనడానికి ప్రతి ఏటా 28 మార్చి రోజున ప్రపంచ దేశాలు అంతర్జాతీయ మహిళా సంగీత కళాకారుల దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీ. సంగీత పరిశ్రమలో మహిళలు చాలా తక్కువగా ఉన్నారు. మహిళామణులకు తగిన ప్రోత్సాహం కూడా కరువైంది. నేపథ్య గానం, సంగీత దర్శకత్వం, సంగీత నిర్మాతలు, సంగీత కళాకారులు లాంటి రంగాల్లో పురుషుల ఆధిపత్యం అనాదిగా కొనసాగుతూ వస్తున్నది. భారతీయ సంగీతరంగాన్ని సుసంపన్నం చేసిన మహిళల్లో ఎం.ఎస్. సుబ్బులక్ష్మి, గంగుబాయి హంగల్ వంటి శాస్త్రీయ సంగీత దిగ్గజాల నుండి శ్రేయా ఘోషల్, సునీధి చౌహాన్ వంటి సమకాలీన దిగ్గజాల వరకు.. భారతదేశ సాంస్కృతిక రంగంపై చెరగని ముద్ర వేశారు. వీరు తమ సంగీత కళతో మానవాళిని మెప్పించి పురుషాధిక్యతను అధిగమించి తమదైన ముద్రను వేయడం హర్షదాయకం. శాస్త్రీయ సంగీతంలో ఎం ఎస్ సుబ్బులక్ష్మి, గౌహర్ జాన్, అక్తరి బాయి లాంటి మహిళలు ఉన్నారు. సంగీత వాయిద్యకారుల వర్గంలో మృదంగం, తబలా, ఘటం, కంజీరా వంటి వాయిద్యాలను వాయించే మహిళలు కూడా కొందరు ఉండడం విశేషం. రుద్ర వీణ కళాకారిణి జ్యోతి హెగ్డే, సంగీత దర్శకులుగా ఉషా ఖన్నా, జద్దన్ బాయి, సరస్వతి దేవి లాంటి కళాకారులు ఉన్నారు. ఆధునిక భారతీయ సంగీత ప్రపంచంలో శ్రేయ ఘోషల్, నేహా కక్కర్,



సన్నిధి చౌహాన్ వంటి నేటి మేటి తరం గాయనీ మణులా ప్రపంచ గుర్తింపును కూడా పొందారు. తెలుగు సంగీత ప్రపంచంలో ఎం ఎం శ్రీలేఖ, భానుమతి రామకృష్ణ లాంటి ప్రముఖులు సంగీత దర్శకులుగా మంచి పేరు తెచ్చు కున్నారు. గాయనీమణులుగా సుశీల, జానకి, చిత్ర, సునితా, లాంటి వర్తమాన కళాకారులు తమ ప్రతిభతో ప్రేక్షకుల మన్ననలు పొందుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా మహిళలు సంగీత ప్రపంచాన్ని ఉర్రూతలూగించారు. సంగీత రంగంలో మహిళలకు నాయకత్వ బాధ్య తలు ఇవ్వడానికి పురుష సమాజం సిద్ధంగా లేదు. తగిన గుర్తింపు, వేతన వ్యత్యాసాలు మహిళలను వేధిస్తున్నాయి. మహిళా సంగీత విద్వాంసుల నైపుణ్యాలను గుర్తించడం, అర్హత కలిగిన మహిళలకు అవకాశాలు ఇవ్వడం, మహిళా సందగీతకారులకు స్వేచ్ఛను ఇవ్వడం, మహిళల సంగీత కచేరీలు లేదా ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, సంగీత పరిశ్రమలో లింగ సమానత్వ సాధనకు కృషి చేయడం లాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలి. సంగీతం అత్యంత ప్రభావితం చేయగల ఓ విశ్వ భాష. మాటలు ఆగిన చోట సంగీత స్వరాల పలుకులు ప్రారంభం అవుతుంది. సంగీతం ఓ దివ్య ఔషధం. మాటల్లో చెప్పలేని విషయాలను సంగీత మాధ్యమంగా వర్ణించవచ్చు. సంగీతం లేని జీవితం నిస్సారం. ప్రపంచాన్ని జాగృతం చేయగల శక్తి సంగీతానికి ఉంటుంది. సాంప్రదాయ సంగీతం నుంచి ఆధునిక సంగీతం వరకు మహిళలు తమ అంకితభావం, నైపుణ్యంతో దేశ సంగీత చిత్రపటాన్ని నిరంతరం పునర్నిర్వహిస్తూనే ఉన్నారు. సంగీతం ఓ నిర్మలమైన నదీ ప్రవాహం. సంగీతానికి ఎల్లలు లేవు. అత్యంత ప్రభావం కలిగిన సంగీత జగత్తులోకి మహిళామణులను ఆహ్వానిద్దాం.

**- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# మంత్రి కోమటిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే



జగిత్యాల, మార్చి 31(మనం న్యూస్): జగిత్యాల నియోజకవర్గం లోని పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని ఆయన కార్యాలయం లో కలిసి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గం లోని అనేక వంతెనలు చెడిపోగా, రామాజీపేట, రాయికల్, పెంబట్ల బ్రిడ్జ్ ల పని పూర్తి అయినా గాని వాటి అప్రోచ్ రోడ్డు పూర్తి కాలేదని. పలు చోట్ల రోడ్లు రెన్యూవల్ చేయాల్సిన అవసరం ఉందనీ,నూతన రోడ్లు కూడా మంజూరు ఇప్పించాలని సారంగాపూర్ పోతారం, జగిత్యాల పోతారం, అంతర్గం నూతన రోడ్లు కావాలని నూతనంగా కొన్ని బ్రిడ్జు గోవిందుపల్లి బ్రిడ్జ్, నర్సింగ పూర్ బ్రిడ్జ్, పెరకపల్లి బ్రిడ్జ్ లో లెవెల్ బ్రిడ్జి లు రాయికల్ సారంగాపూర్ మండలంలో బ్రిడ్జి లు ఉన్నాయి,, కొత్త వాటికి టెండర్ పిలవాల్సిందిగా వినతి పత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఇంజనీర్ ఇన్ చీఫ్ మోహన్ నాయక్ కు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కి జగిత్యాల నియోజకవర్గ ప్రజల పక్షాన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# పేదల ఆసరాగా పెద్దపల్లి ఆసుపత్రి

- **ఆధునిక పద్ధతుల్లో విజయవంతమైన శస్త్రచికిత్సలు**



పెద్దపల్లి, మార్చి 31 (మనం ప్రతినిధి): జమ్మికుంట మండలానికి చెందిన 50 సంవత్సరాల ఒక మహిళ, సిపిడిఓ కార్యాలయంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ, గత కొన్ని రోజులుగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతుండగా డి డబ్ల్యు ఓ పెద్దపల్లి స్పందించి, మాతా శిశు ఆసుపత్రిలో ఆధునిక సదుపాయాలు, నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని జిల్లా ఆసుపత్రి పెద్దపల్లికి వెళ్లాలని సూచించారు.అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించగా గర్భాశయంలో గడ్డ ఉన్నట్లు గుర్తించారు. ఇదే సమయంలో, చికురాయి (పెద్దపల్లి జిల్లా)కు చెందిన 42 సంవత్సరాల మరో మహిళ కూడా తీవ్రమైన రక్తస్రావంతో జిల్లా ఆసుపత్రికి చేరుకున్నారు. ఇద్దరు పేషెంట్లను పరిశీలించిన అనంతరం, నిపుణులైన వైద్యుల బృందం ఆధునిక వైద్య పద్ధతిలో హిస్టరెక్టమీ (గర్భాశయ తొలగింపు) శస్త్రచికిత్సను మంగళవారం విజయవంతంగా నిర్వహించి గడ్డలను తొలగించారు. ఓదెలకి చెందిన 32 సంవత్సరాల మహిళకు తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి రావడం జరిగింది. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేసుకోగా గాల్ బ్లాడర్ నెక్ లో స్టోన్ ఉంది అని కనుక్కోవడం జరిగింది. అధునాతన పద్ధతిలో లాప్రోస్కోపిక్ కోలిసిస్టెక్టమీ ఆపరేషన్ ను మరియు టుబెక్టమి విజయవంతంగా నిర్వహించడం జరిగింది. నిమ్మనపల్లి కి చెందిన 55 సంవత్సరాల మహిళ తీవ్రమైన కుడివైపు కడుపునొప్పితో బాధపడుతూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది పరీక్షలు చేసుకోగా గాల్ బ్లాడర్ నెక్ లో స్టోన్ ఉంది అని కనుక్కోవడం జరిగింది. సదరు పేషెంటుకు కూడా అధునాతన పద్ధతిలో లాప్రోస్కోపిక్ కోలిసిస్టెక్టమీ ఆపరేషన్ ను విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి సర్జరీల లో పాల్గొన్న వైద్యుల బృందం లాప్రోస్కోప్ సర్జన్ డాక్టర్ అమర సింహ రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ సాయి ప్రసాద్, గైనకాలజిస్ట్ డాక్టర్ అనసూయ, డాక్టర్ మీరాజ్, డాక్టర్ రవళిక, అనేస్తేషియా డాక్టర్ స్వాతి, డాక్టర్ భవాని. ఈ ఆపరేషన్ లలో సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ కూడా పాల్గొన్నారు.

ఈ నాలుగు సర్జరీలు చేసిన వైద్య బృందాలను, ఓటి సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.అదేవిధంగా ప్రజలందరూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న నవజాత శిశు కేంద్రం సేవలు, 2 డి ఎకో సేవలు, ఆధునిక పరిజ్ఞానంతో కూడిన లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలు, యూరాలజీ సేవలు, రూట్ కెనాల్ సేవలను ఉపయోగించుకోవాలని, ఈ సేవలలో ఏవైనా ఇబ్బందులు ఎదురైనచో నేరుగా సూపరింటెండెంట్ ని కలవచ్చు అని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భం గా ప్రజలందికి సూపరింటెండెంట్ చేయు విజ్ఞప్తి ఏమనగా వారికి సంబందించిన పేషెంట్ హాస్పిటల్ లో ఉన్న సమయం లో సానిటేషన్ గురించి గాని, వాష్ రూమ్ శుభ్రత గురించి గాని ఎవరైనా డబ్బులు అడిగినా గాని, ఏ ఇతర సమస్య ఉన్నా కూడా నర్సింగ్ సూపరింటెండెంట్ ని, ఆర్ ఎం ఓ ని, నేరుగా సూపరింటెండెంట్ ని సంప్రదిొంచగలరు లేని యెడల ఫిర్యాదులను కంప్లైంట్ బాక్స్ లో ఇవ్వవచ్చు, వారి సమస్యని వెంటనే పరిష్కారం చేయడానికి ప్రయత్నం చేస్తాం అని సూపరింటెండెంట్ తెలియజేశారు, ప్రభుత్వ ఆసుపత్రి లో అన్ని రకముల సేవలు ఉచితం ఎవ్వరికి లంచం ఇవ్వరాదు అని తెలియచేసారు.

# ఏప్రిల్ 8 లోపు ఎస్సీ యువతీ యువకులు, వార్షిక ప్రణాళిక దరఖాస్తులు సమర్పించాలి

- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



పెద్దపల్లి, మార్చి 31 (మనం ప్రతినిధి): ఏప్రిల్ 8 లోపు ఎస్సీ యువతీ యువకులు, వార్షిక ప్రణాళిక దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ ఎస్సీ యువతీ యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పలు పథకాలను ఆమోదించిందని అన్నారు.

2025-26 వార్షిక ప్రణాళికకు సంబంధించి 90 శాతం సబ్సిడీ 10 శాతం బ్యాంకు లోన్ తో లక్ష రూపాయల విలువ గల 100 టూ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలు, 70 శాతం సబ్సిడీ, 30 శాతం బ్యాంకు లోన్ తో 3 లక్షల రూపాయలు విలువ గల 71 త్రీ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలు, 7 లక్షల రూపాయలు విలువ గల 15 సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్ సెట్ లను పెద్దపల్లి జిల్లాకు ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. వ్యవసాయేతర పథకాలకు 21 నుంచి 50 సంవత్సరాల వయసు, వ్యవసాయ పథకాలకు 21 నుంచి 60 సంవత్సరాల వయసు ఉండాలని, అభ్యర్థులు ఆధార్ కార్డు రేషన్ కార్డు కుల ధ్రువీకరణ పత్రం, ఆధాయ ధృవీకరణ పత్రం (గ్రామీణ ప్రాంతాలలో సంవత్సరానికి లక్ష 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షల) మించి ఉండకుండా ఉండాలని, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగ పథకాలకు) , పట్టాదారు పాసు పుస్తకం (సోలార్ పంప్ సెట్ కోసం కనీసం రెండు ఎకరాల భూమి ఉండాలని) దివ్యాంగ అభ్యర్థులు అయితే సదరం సర్టిఫికెట్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోగ్రాఫ్ తో అభ్యర్థులు తమ దరఖాస్తును నమోదు చేయాలని అన్నారు నిరుద్యోగ ఎస్సి యువతీ యువకులు ఏప్రిల్ 8 లోగా తమ దరఖాస్తులను ఆన్‌లైన్ పోర్టల్ https://tgob-mms.cgg.gov.in లో నమోదు చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఎమ్మెల్యేని కలిసిన తహసీల్దార్ సమ్మక్క



దుగ్గొండి. మార్చి 31 (మనం న్యూస్): ఈరోజు నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి వారి ఆశీర్వాదం తీసుకున్న దుగ్గొండి మండల తహసిల్దార్ సమ్మక్క . ఈ సందర్భంగా ఎం ఎల్ ఏ దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ వివిధ పనులపై దుగ్గొండి తహసిల్దార్ కార్యాలయానికి వచ్చే మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి న్యాయంగా అందాల్సిన సేవలను అందించాలని, మండల ప్రజల మన్ననలను చూరగొనాలని ,మంచిపేరు తెచ్చుకోవడానికి మీదైన శైలిలో పనిచేయాలని,నీతి నిజాయితీగా పనిచేసే అధికారులకు నేను ఎప్పుడూ అండగా ఉంటానని,ఎలాంటి ఇబ్బంది ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, అందుబాటులో ఉంటానని మార్గనిర్దేశనం చేస్తూ ఆశీర్వదించారు.

# దీర్ఘకాల సేవ అనంతరం ఘన వీడ్కోలు



- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి, మార్చి 31 (మనం ప్రతినిధి): దీర్ఘకాలం ప్రజలకు సేవలు అందించిన ఉద్యోగుల పదవి విరమణ వేడుకలు ఘనంగా జరిగాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం రంగంపల్లి లోని సాయి గార్డెన్స్ లో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచయ్య పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ముఖ్య అతిథిగా హాజరై పంచాయతీ అధికారి సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, 30 నుంచి 35 సంవత్సరాల పాటు ప్రజా సేవలో నిర్విరామంగా సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న జిల్లా పంచాయతీ అధికారి కు తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో ఇటీవల నిర్వహించిన పంచాయతీ ఎన్నికలు సజావుగా జరగడంలో పంచాయతీ అధికారి కీలక పాత్ర పోషించారని, కేటాయించిన విధులను ఎప్పటికప్పుడు సమర్ధవంతంగా నిర్వహిస్తూ బాధ్యతలను నెరవేర్చే వారని కలెక్టర్ గుర్తు చేశారు.పదవి విరమణ తర్వాత కూడా అవసరమైన సమయంలో ప్రభుత్వానికి తమ సూచనలు సలహాలు అందజేస్తూ సేవలు అందించాలని కలెక్టర్ కోరారు. పదవీ విరమణ తర్వాత వారు జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యవంతంగా జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ పదవి విరమణ పొందిన జిల్లా పంచాయతీ అధికారిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీల్లో జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్

- **జీసీడీఓ కవిత**



పెద్దపల్లి, మార్చి 31 (మనం ప్రతినిధి): పెద్దపల్లి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) చదువుతున్న విద్యార్థినులను జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధం చేసే దిశగా ప్రత్యేక కోచింగ్ కార్యక్రమాలను ప్రారంభించినట్లు జిల్లా గర్ల్ చైల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ( జి సి డి ఓ) కవిత ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. గ్రామీణ ప్రాంత బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యంతో ప్రత్యేక కోచింగ్ ప్రారంభిస్తున్నామని, కేజీబీవీ జూలపల్లి లో, వైద్య రంగంలో రాణించాలనుకునే విద్యార్థినుల కోసం (నీట్) కోచింగ్ ,కేజీబీవీ రామగుండం లో ఇంజనీరింగ్ రంగం పై ఆసక్తి ఉన్న వారి కోసం (జేఈఈ) కోచింగ్ , కేజీబీవీ సుల్తానాబాద్ లో ,న్యాయ రంగంలో స్థిరపడాలనుకునే విద్యార్థినుల కోసం (క్లాట్) కోచింగ్ ,నిపుణులైన అధ్యాపకుల పర్యవేక్షణలో, పక్కా ప్రణాళికతో కూడిన బోధన అందిస్తున్నామని , విద్యార్థినులకు అవసరమైన స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడంతో పాటు, వారిలోని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు క్రమం తప్పకుండా మాక్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు వివరించారు.గ్రామీణ ప్రాంతాల బాలికలకు పట్టణ విద్యార్థులతో సమానంగా అవకాశాలు కల్పించి, మెడికల్, ఇంజనీరింగ్, లా వంటి ప్రతిష్టాత్మక రంగాలలో వారు ప్రవేశాలు పొందేలా చేయడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశమని, విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని జీసీడీఓ కవిత ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు స్వామి వారిని దర్శించుకునేలా చూడాలి

- **చిన్న హనుమాన్ జయంతికి 914 మంది సిబ్బందితో పటిష్ట భద్రత**
- **సీసీ కెమెరాలు ద్వారా నిరంతర పర్యవేక్షణ**
- **జిల్లా ఎస్పీ అశోక్ కుమార్.**



జగిత్యాల, మార్చి 31(మనం ప్రతినిధి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు వద్ద చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు ప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణంలో స్వామి వారిని దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 914 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బందోబస్తును 5 సెక్టార్లుగా విభజించి, 3 షిఫ్టుల విధానంలో పోలీసు సిబ్బందికి విధులు కేటాయించినట్లు వెల్లడించారు. జయంతి సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఏలాంటి నేరాలకు తావులేకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే జిల్లా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు పోలీస్ సిబ్బంది ఓపికతో సలహాలు,సూచనలు ఇస్తూ విధులు నిర్వర్తించాలని,ఎక్కడ కూడా అసౌకర్యం కలగకుండా అందరూ సమన్వయంతో విధులు నిర్వహిస్తూ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా దేవస్థానం,మాల విరమణ వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండి భక్తులు క్యూ లైన్ పాటించేలా చూడాలని,భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా 24 గంటలు పోలీస్ నిఘా ఉంచాలని ప్రతి ఒక్క భక్తుడు ప్రశాంతమైన వాతావరణంలో ఆంజనేయ స్వామిని దర్శించుకుని క్షేమంగా తిరిగి వెళ్లేవిధంగా ప్రతి పోలీస్ బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు: ఈ సంవత్సరం భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున భారీ సంఖ్యలో వచ్చే వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ చేసేలా చూడాలని,ట్రాఫిక్ ,పార్కింగ్ ప్రదేశాల్లో విధుల్లో ఉన్న సిబ్బంది ట్రాఫిక్ జామ్ అవకుండా నియంత్రణ చేయాలన్నారు. రాత్రి వేళలో ప్రమాదాలు జరగకుండా స్టాపర్స్, కోన్స్, స్టిక్కర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా కాలి నడకన వచ్చే భక్తులు రోడ్డుపైన వెళ్ళే వాహనాలు గమనిస్తూ నడవాలి హనుమాన్ దీక్ష తీసుకున్న దీక్షపరులు కాలినడకన కొండగట్టుకు వచ్చే సమయం లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రేడియం స్టికర్స్ ను వారి బ్యాగులకు, జెండా కు అంటించడం జరిగింది. రోడ్డు కు ఇరువైపులా నడుస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని వాహనాలను గమనిస్తూ తమ యొక్క గమ్యస్థానానికి చేరుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి లు వెంకటరమణ, రఘు చందర్, రాములు, వెంకటరమణ, ఖిఆ ఇన్స్పెక్టర్ అరిఫ్ అలీ ఖాన్, సి.ఐ లు రవి, రామ్ నరసింహారెడ్డి, సురేష్ ,అనిల్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు సైదులు, కిరణ్ కుమార్, వేణు వివిధ జిల్లాలకు చెందిన సి.ఐలు, ఎస్.ఐ లు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కుటుంబం కోసం సమయాన్ని కేటాయించాలి



- **రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**
- **ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ అధికారులకు ఘన సన్మానం**

పెద్దపల్లి, మార్చి 31 (మనం ప్రతినిధి): తమ కుటుంబ క్షేమం కన్నా సమాజం క్షేమం కోసం నిరంతరం విధులు నిర్వహించేది పోలీసులు మాత్రమేనని,ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేస్తున్న పోలీస్ అధికారులు తమ కుటుంబ సభ్యుల కోసం ఎక్కువ సమయం కేటాయించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్లో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను ఆయన మంగళవారం ఘనంగా సత్కరించారు.పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులు ఎస్ఐ అంజయ్య, ఏఎస్ఐలు ఎం. వెంకటస్వామి (1987), సయ్యద్ రాయిస్ అహ్మద్ (1851)లను పోలీస్ కమిషనర్ పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ,తమ కుటుంబ క్షేమం కన్నా సమాజం క్షేమం కోసం నిరంతరం విధులు నిర్వహించేది పోలీసులు మాత్రమేనన్నారు. ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ అధికారులు తమ విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని,కొన్ని సందర్భాల్లో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సేవలందించినవారని పేర్కొన్నారు.వీరు రేపటి తరం పోలీసులకు స్ఫూర్తిగా నిలుస్తారని కొనియాడారు.ఉద్యోగ విరమణ చేసిన అధికారులు తమ ఆరోగ్యం కోసం యోగ లేదా వ్యాయామాన్ని నిరంతరం కొనసాగిస్తూ,ఇకపై కుటుంబ సభ్యులతో సమయాన్ని గడిపి సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని సీపీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, ఆర్ఐలు పెద్దన్న, మల్లేశం,రమేష్, సూపరింటెండెంట్లు ఇంద్రసేనారెడ్డి, సందీప్,సంధ్య, రామగుండం పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం, పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు,ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సమన్వయంతో అండర్ గ్రౌండ్ కేబుల్ పనులు చేపట్టాలి

- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



పెద్దపల్లి, మార్చి 31 (మనం ప్రతినిధి): జిల్లాలో బి.ఎస్.ఎన్.ఎల్ అండర్ గ్రౌండ్ కేబుల్ పనులు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో బి.ఎస్.ఎన్.ఎల్ అండర్ గ్రౌండ్ కేబుల్ పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, రామగుండం పరిధిలో పలు చోట్ల డ్యామేజైన బి.ఎస్.ఎన్.ఎల్ అండర్ గ్రౌండ్ కేబుల్ మరో మారు వేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఆర్‌బీ, మిషన్ భగీరథ, ఎన్.పి.డి.సి.ఎల్, లోకల్ బాడీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పని చేయాలని కలెక్టర్ సూచించారు. నూతన విద్యుత్ పోల్స్, త్రాగు నీటి పైప్ లైన్ , రోడ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో ఆ ప్రాంతంలో వేసిన అండర్ గ్రౌండ్ డ్యామేజ్ కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సెల్ ఫోన్ నెట్ వర్క్ సజావుగా కొనసాగేందుకు వేసవి కాలంలో విద్యుత్ కోతలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని, మెయింటెనెన్స్ పనుల నిమిత్తం కరెంట్ కోతలు విధించే అవసరం వస్తే బ్యాకప్ ముగిసే లోపు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరిగేలా చూడాలని అన్నారు. సెల్ ఫోన్ సిగ్నల్, బి.ఎస్.ఎన్.ఎల్ అండర్ గ్రౌండ్ కేబుల్ సంబంధించి ప్రతి నెలా సంబంధిత శాఖ అధికారులు సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఓ కాళిందిని,ఆర్ అండ్ బి ఈ ఈ బావ్ సింగ్ , సి సెక్షన్ సూపరిండెంట్ కుమారస్వామి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయాణ చార్జీలలో రూ.10,000 కోట్ల ఆదాయం ఆదా

- **జగిత్యాల నూతన బస్టాండ్లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**




జగిత్యాల, మార్చి 31(మనం ప్రతినిధి): మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయాణ చార్జీలలో రూ.10,000 కోట్ల ఆదాయం ఆదా అయిందని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. ఈ పథకం వల్ల మహిళలు తమ రోజువారీ ప్రయాణ ఖర్చులను ఆదా చేసుకుని ఆ డబ్బును కుటుంబ అవసరాలు, విద్య, మరియు ఆరోగ్యంపై వినియోగిస్తున్నారని వివరించారు. ఉచిత బస్సు సదుపాయం మహిళల ఆర్థిక భద్రతకు పునాది వేస్తోందని చెప్పారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం మహిళల అభివృద్ధి కి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా నూతన బస్టాండ్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు సౌకర్యవంతమైన, భద్రమైన ప్రయాణ సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ ప్రయాణించే కొంత మంది మహిళలకు జిల్లా కలెక్టర్ శాలువాలతో సన్మానం చేసి, బహుమతులు అందించారు. మహిళల భాగస్వామ్యం ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ చైర్పర్సన్ సమిండ్ల వాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గ్రామీణ స్థాయి నుండి మొబైల్ నెట్‌వర్క్‌లను అభివృద్ధి చేయాలి



- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల,మార్చి 31 (మనం ప్రతినిధి): ప్రభుత్వ, ప్రైవేట్ మొబైల్ నెట్వర్క్ లు తమ సేవలను గ్రామీణ స్థాయి నుండి విస్తరించి ప్రజలకు మెరుగైన నెట్వర్క్ సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి టెలికం కమిటీ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, శ్రీనివాస్ రావు లతో కలిసి ప్రైవేట్ నెట్ వర్క్, టి - ఫైబర్ నెట్ వర్క్ ల ప్రతినిధులు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. టెలికాం టవర్ సైట్ లకు విద్యుత్ సరఫరా విస్తరణ, ప్రభుత్వ సంస్థలకు బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీ, భారత్ నెట్ ఇన్ఫ్రా వినియోగం అంశాలపై అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రైవేట్ నెట్వర్క్ లు టవర్ల ఏర్పాట్లు నిబంధనల ప్రకారం మార్కెట్ ధర ప్రకారం చెల్లింపులకు హామీ ఇచ్చినట్లయితే ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నష్టపరిహారంపై ఆంధ్రా ప్రభుత్వం సహకరించాలి



యానాం: యానాం-ఆంధ్రా ప్రాంతాల్లో బాధిత ప్రజలకు ఓఎన్జీసీ నుండి నష్టపరిహారం రాబట్టడానికి సంబంధించి ఆంధ్రా రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరించేలా యుద్ధప్రాతిపదికన యంత్రాంగాన్ని సమాయత్తపరిచేలా ఆదేశాలు జారీచేయాలని పుదుచ్చేరి పూర్వ మంత్రి మల్లాడి కృష్ణారావు సారథ్యంలో ముగ్గురు ఎమ్మెల్యేలతో కలిసి సీఎం చంద్రబాబునాయుడుకు పూర్తి పత్రాలను శనివారం అందజేశారు. బాధితులకు రూ.కోట్ల నష్టపరిహారాన్ని ఓఎన్జీసీ ద్వారా ఇప్పించేలా పుదుచ్చేరి ప్రభుత్వం మాదిరిగానే ఆంధ్రా ప్రభుత్వం స్పందించి కలెక్టర్ స్థాయిలో అత్యున్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వాటికి సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావులతో కలిసి అందజేశారు. ఓఎన్జీసీ చమురు క్షేత్రంలో యానాం - ఆంధ్రా ఉమ్మడి సరిహ ద్దులో బ్లో ఔట్ జరిగి వేలాదిమంది జీవనోపాధికి భంగం, నష్టం జరిగి నెలల గడుస్తున్నా ఇంతవరకు బాధితులు నష్టపరిహారానికి నోచుకోలేదు. పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్, డిల్లీ స్థాయిలో పరిహారాన్ని రాబట్టడానికి మల్లాడి కృష్ణారావు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు.

# గ్రామాలలో మౌలిక వసతులు కల్పనకు కృషి

- ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు



కాట్రేనికోన మార్చి 31 మనం ప్రతినిధిః గ్రామాలలో మౌలిక వసతులు కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు తెలిపారు మంగళవారం కాట్రేనికోన మండలం చెయ్యేరు, ఉప్పూడి, గెద్ద పల్లి, కుండలేశ్వరం గ్రామాలలో లో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.2 కోట్ల 7 లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తయిన మొత్తం 13 సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముమ్మిడివరం నియోజకవర్గంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ రోడ్ల వంటి మౌలిక వసతులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ముమ్మిడివరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. ఉప్పూడి గ్రామం లో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన రోడ్డు పనులను ప్రారంభించారు. గెద్దనపల్లి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా రూ.1 కోటి 35 లక్షల వ్యయంతో నిర్మించిన మూడు రహదారులను ప్రజలకు అంకితం చేశారు.

కుండలేశ్వరం గ్రామంలో రూ.11 లక్షల 20 వేల వ్యయంతో నిర్మించిన రహదారిని శాసన సభ్యులు చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో గత ప్రభుత్వంపై ఘాటైన విమర్శలు చేశారు. అభివృద్ధి చేయకుండా మాయమాటలతో కాలం గడపాలని రాక్షస పాలన సాగించాలని పేర్కొన్నారు తమ ప్రభుత్వం అభివృద్ధిలో ముందుకు సాగుతుందన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో సర్పంచ్ లను, వార్డ్ మెంబెర్ లను ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం శాసన సభ్యులు ను సర్పంచ్ లు భారీ గజ మాల తో సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ పి రాజశేఖర్ , మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, ఏ ఎం సి చైర్మన్ ఒగూరి భాగ్య శ్రీ, గంధం పల్లం రాజు, ఎంపీడీఓ రాజేశ్వరరావు, తహసీల్దార్ రవి కిరణ్, మండల ఇంజనీరింగ్ అధికారి నరహరి, మాజీ మత్స్య కార కార్పొరేషన్ చైర్మన్ నాగిడి నాగేశ్వరావు, చెల్లి అశోక్, దాట్ల పృథ్వి, దాట్ల పవన్, సర్పంచ్ లు చెల్లి సురేష్, రంబాల రమేష్, దంతులూరి సీతా రామ కృష్ణం రాజు, జి వి వి సుబ్బలక్ష్మి సత్తిబాబు, త్సవట పల్లి నాగు, త్సవట పల్లి శ్రీనివాస్, నడింపల్లి సుబ్బరాజు, గోలకోటి బుల్లి, కాయల బలరాం, ఎంపీటీసీ జి వి మహా లక్ష్మి,విత్తనాల బుజ్జి, ఆకాశం శ్రీను, బండారు యేసు,కొంకి శ్రీను,పోతా బత్తుల నారాయణ రావు, మోకా బాల ప్రసాద్, వాసంశెట్టి రాజేశ్వరరావు, నూకల దుర్గ, భీమాల సూరిబాబు, నంద్యాల వెంకన్న బాబు, పంచాయతీ కార్యదర్శులు పి వి రామారావు, ఎం టి వి వర్మ, దుర్గమ్మ, పంచాయతీ పాలక వర్గం సభ్యులు, నీటి సంఘం అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు

# పోడూరు అంబటివాని చెరువు రహదారిపై ప్రజల వినతి

- వెలుతురు లేక భయంతో ప్రయాణం చేస్తున్న ప్రజలు
- వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు, వాహనదారులు



పోడూరు, మార్చి 31మనం న్యూస్ః రోడ్డు మీద ప్రయాణం చేస్తూ ఉండగా అనుకోని ప్రమాదం సంభవిస్తే అది క్షణాల్లోనే ప్రాణనష్టం, తీవ్ర గాయాలకు దారితీస్తుంది. అలాంటి సంఘటనలు కుటుంబాలకు తీరని నష్టం మిగులుస్తాయి. ప్రస్తుతం పోడూరు నుంచి అంబటివాని చెరువు వెళ్లే రహదారిపై రాత్రి సమయంలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది.వెలుతురు లేకపోవడంతో ప్రజలు భయాందోళనల మధ్య ప్రయాణం చేయాల్సి వస్తోంది.

**వీధిలైట్ల కోసం ప్రజల వినయపూర్వక విజ్ఞప్తి..**

పోడూరు గ్రామపంచాయతీ పరిధిలోని పోడూరు గ్రామం నుంచి అంబటివాని చెరువు వరకు సుమారు మూడు కిలోమీటర్ల దూరం ఉంటుంది.ఈ మార్గంలో ఎడమవైపు వరి చేలు, కుడివైపు కాలువ ఉండడంతో రాత్రి వేళ ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారుతోంది. ఈ నేపథ్యంలో పోడూరు గ్రామపంచాయతీ అధికారులు,మండల విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ఈ రహదారిపై వీధిలైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు వినయపూర్వకంగా కోరుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ రోడ్డు గుండా వీధులైట్లను ఏర్పాటు చేయడం అవసరంతో పాటు అత్యవసరమని నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈ రోడ్డుని ఇప్పటివరకు సంబంధిత అధికారులు, పంచాయతీ వారు పట్టించుకోకపోవడం విచారించదగ్గ విషయమని పలువురు పేర్కొన్నారు.

# తూర్పులంక పాలకవర్గానికి ఘన సత్కారం



అల్లవరం మార్చి31మనం న్యూస్ ప్రతినిధి: అల్లవరం మండలం తూర్పులంక గ్రామపంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగిస్తుండడంతో ఆ గ్రామస్తులు సర్పంచ్ కడలి గంగాచలం ఉప సర్పంచ్ కాశీ కరుణాకర్ పాలకవర్గాన్ని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు,శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు మంగళవారం ఘనంగా సత్కరించారు సర్పంచ్ గంగా చలం మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో సంతృప్తికరమైన పాత్రపోషించామన్నారు.గ్రామాభివృద్ధికి తోడ్పడిన గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామ కార్యదర్శి చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు గ్రామస్తులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా శ్రేయస్సు కొరకు కార్యసాధనకు కృషి చేసిన వ్యక్తి ఎంపిడిఓ కిశోర్..

- ఎంపిడిఓ కిశోర్ పదవీ విరమణ సభలో కొనియాడిన నేతలు...



శంఖవరం మార్చి 31 మనం ప్రతినిధి : శంఖవరం మండలంలోని అన్నవరంలో గల ప్రైవేట్ ఫంక్షన్ హాలులో మండల అభివృద్ధి అధికారి కిశోర్ పదవీ విరమణ పురష్కరించుకుని మండల పరిషత్ అధికారులు, సిబ్బంది ఏర్పాటు చేసిన సన్మాన సభకు ముఖ్య అతిధులుగా ఎంపీపి పర్వత రాజబాబు, టిడిపి సీనియర్ నేత పర్వత సురేష్, టిడిపి నేతలు వెన్నా శివ, ఈగల దేవుళ్ళు, బద్ది రామారావు హాజరయ్యారు. ఈ సంధర్భంగా సురేష్ మాట్లాడుతూ,ప్రజా శ్రేయస్సు కోసం ఒక పక్కన అధికారులను, మరో పక్కన ప్రజా ప్రతినిధులను ఒప్పించి, మెప్పించి అభివృద్ధి కార్యక్రమాల కార్య సాధనకు కృషి చేసిన ఘనత ఎంపిడిఓ కిశోర్ కు దక్కుతుందన్నారు. పదవీ విరమణ సమావేశాన్ని ఆధ్యంతం డిప్యూటి ఎంపిడిఓలు పుష్యమి కీర్తి, నాగలక్ష్మి ఘనంగా ఏర్పాట్లు నిర్వహించారు. అనంతరం ఎంపిడిఓ కిశోర్, భారతి దంపతులను ఎంపీపి పర్వత రాజబాబు, టిడిపి నేత పర్వత సురేష్, మండల టిడిపి అధ్యక్షుడు ఈగల దేవుళ్ళు, వైసిపి నేతలు శెట్టిబత్తుల కుమార్ రాజా, వైస్ ఎంపీపి ధారా వెంకటరమణ, పర్వత వివేక్ దుశ్శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం, మండల పరిషత్, సచివాలయాల సిబ్బంది, విద్యాశాఖ, ఆర్ డబ్ల్యుఎస్, పంచాయతీ రాజ్ విభాగాల సిబ్బంది, శంఖవరం మండలం పాత్రికేయులు ఘనంగా సన్మానించారు.

# లక్ష్మీవాడ సర్పంచ్ శ్రీ లక్ష్మి వెంకటేశ్వరరావుదంపతులకు సన్మానం



కాట్రేనికోన, మార్చి 31 మనం ప్రతినిధిః సర్పంచ్ ల పదవీ కాలం వచ్చే నెల ఏప్రిల్ రెండవ తేదీతో ముగియనున్న తరుణంలో కాట్రేనికోన మండలం లక్ష్మీవాడ సర్పంచ్ చొల్లంగి శ్రీలక్ష్మి వెంకటేశ్వరావుని మరియు ఉప సర్పంచ్ పరమట తరుణ్ కుమార్ మరియు వార్డ్ మెంబర్లను లక్ష్మీవాడ గ్రామ ప్రజలు మరియు వివిధ పార్టీల నాయకులు సచివాలయం సిబ్బంది శాలువా లు, పూల మాలలు వేసి ఘనంగా సన్మానించారు. మంగళవారం జరిగిన కార్యక్రమం లో చొల్లంగి లక్ష్మి వెంకటరెశ్వరావు మాట్లాడుతూ గత అయదేళ్లుగా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు సహకరించిన అధికారులకు మరియు గ్రామ ప్రజలకు సచివాలయం సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా గ్రామ అభివృద్ధి కి నిరంతరం కృషి చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమం లో పంచాయతీ కార్య దర్శి బడుగు సుమ, ఎంపీటీసీ బీర ధనుంజయ్, వి ఆర్ ఓ జే వి రమణ, పరమట హరి ప్రసాద్, సాకా బాలరాజు, కాండ్రేగుల సత్యనారాయణ, కుంచె రాజు,విత్తనాల రాజేశ్వ్రరావు, గుత్తల సత్యనారాయణ, బడుగు శ్రీనివాస్ రావు, తరపట్ల వెంకటేశ్వరావు, ఇతర గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఐస్ క్రీమ్ బండ్లకు మా గ్రామంలో ప్రవేశం లేదు

కుక్కునూరు, మార్చి 31 ( మనం న్యూస్ ): మండలంలో నెమలిపేట గ్రామంలో ఐస్క్రీమ్ బండ్లపై రూ.3000 జరిమానా విధిస్తూ, పిల్లల ఆరోగ్యం కోసం గ్రామస్థులు కఠిన నిర్ణయం తీసుకున్నారు. గ్రామ సరిహద్దుల్లో బ్యానర్లు ఏర్పాటు చేసి అమలు చేస్తున్నారు.కుక్కునూరు మండలంలో దాచారం పంచాయతీ నెమలిపేట గ్రామం తీసుకున్న నిర్ణయం ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఎండాకాలం రాగానే పిల్లలు చల్లని పదార్థాలవైపు ఆకర్షితులవుతారని తెలుసుకున్న గ్రామస్థులు,వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతో కఠిన నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలోకి ఐస్క్రీమ్ బండి వస్తే రూ.3000 జరిమానా , అలానే కొన్నవారికి కూడా రూ.1000 జరిమానా విధిస్తామని స్పష్టంగా ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని కేవలం మాటల్లోనే కాకుండా గ్రామ సరిహద్దుల్లో బ్యానర్లు ఏర్పాటు చేసి అమలు చేస్తున్నారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకున్న నిర్ణయాన్ని పలువురు అభినందిస్తున్నారు.




# బట్టు పండు కుటుంబానికి అండగా జనసేన పార్టీ



- 5 లక్షల ఉద్యమి ప్రమాద బీమా అందచేత

అమలాపురం మనం న్యూస్ః గతేడాది రోడ్డు ప్రమాదంలో మరణించిన జనసేన పార్టీ అమలాపురం నియోజకవర్గ నిస్వార్ధ జనసైనికుడు, రాష్ట్ర చేనేత వికాస విభాగం దివంగత ప్రధాన కార్యదర్శి బట్టు నాగ పుల్లేశ్వర రావు (పండు) కుటుంబానికి జనసేన పార్టీ భరోసాగా నిలిచింది. పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మక నిర్ణయంతో ఏర్పాటు చేసిన ప్రమాద బీమా 5 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ చెక్కును ప్రభుత్వ విప్ మరియు శాసన మండలి సభ్యులు పిడుగు హరిప్రసాద్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కే కే చేతుల మీదుగా వారి కుటుంబానికి అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా హరి ప్రసాద్ 'బట్టు పండు' పార్టీకి అందించిన సేవలను గుర్తు చేసుకుని, వారి కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరించి, వారికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండీ క్రాఫట్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్డీఎస్ ప్రసాద్, సీనియర్ నాయకులు, సాధక్ లింగోలు పండు పాల్గొన్నారు.

# జర్నలిస్టు నేతలను సన్మానించిన మాజీ ఎంపీ అనురాధ



అమలాపురం మార్చి 31 మనం న్యూస్ః డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ మరియు ఏపీబీజేఏ కార్యవర్గానికి అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ అభినందనలు తెలిపారు. అమలాపురం కిమ్స్ లో నిర్వహించిన ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీ బీజేఏ జిల్లా మహాసభ విజయవంతమైన సందర్భంగా తమకు సహకరించిన మాజీ ఎంపీ చింతా అనురాధ కు కృతజ్ఞతలు తెలిపేందుకు మొగళ్లమూరులో జర్నలిస్ట్ నేతలు కలసిన సందర్భంగా వారిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు మట్టపర్తి శ్రీనివాస్. ఏపీ బీజేఏ అధ్యక్షులు కడలి రాజు, వాతాడ బాబులు, కడలి సూరిబాబు,పరమట బీమా మహేష్,దిడ్ల మోహన్, దంగేటి శ్రీనివాసరావు, అద్దంకి భాస్కర్ అక్రిడేషన్ కమిటీ సభ్యులు సమయ మంతుల హరి తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు ప్రమాద మృతుని వివరాలు తెలపండి

దేవరపల్లి, మనంన్యూస్ః జాతీయ రహదారి ఎన్.హెచ్.-16 పై సోమవారం రాత్రి యర్నగూడెం-కృష్ణంపాలెం మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు .

సుమారు 30-40 సంవత్సరాల మధ్య వయస్సు గల వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో సంఘటనా స్థలంలో మృతి చెందడం జరిగింది.

ఇందుపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని, సదరు మృతుని వివరాలు ఎవరికైనా తెలిస్తే దేవరపల్లి ఎస్సై - 9440796624, దేవరపల్లి సి.ఐ - 9440796584 నంబర్లకు సమాచారం అందించాలని దేవరపల్లి పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. ఎన్.నాయక్ కోరారు.

# గ్రామాల్లో రహదారులు ప్రారంభించిన ప్రభుత్వ విప్

ముమ్మిడివరం, మార్చి 31, మనం న్యూస్ః డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని కాట్రేనికోన మండలం కుండలేశ్వరం గ్రామంలో ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు రూ.11 లక్షల 20 వేల వ్యయంతో నిర్మించిన రహదారిని ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ రహదారి నిర్మాణంతో గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని, ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుముఖం పడతాయని తెలిపారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం ప్రభుత్వం ముఖ్య లక్ష్యంగా తీసుకుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తూ ప్రతి గ్రామానికి అవసరమైన వసతులు అందించేందుకు కృషి చేస్తోందని అన్నారు.



# చిన్నపిల్లల ఆరోగ్య దృష్ట్యా మే నెల అంతా సెలవులు ప్రకటించాలి

- శంఖవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్వాడీల డిమాండ్, నిరసన



శంఖవరం మార్చి 31 మనం ప్రతినిధిః అంగన్వాడి పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వేసవి కాలమైన మే నెల అంతా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలకు సెలవులు ప్రకటించాలని అంగన్వాడీలు మంగళవారం డిమాండ్ చేసారు. మండల కేంద్రం శంఖవరంలో తమ విధుల నిర్వహణ అనంతరం సాయంత్రం 4 గంటలకు అంగన్వాడీలు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్దకు చేరుకుని తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐసిడిఎస్ అధికారికి అందజేసారు. ఈ సంధర్భంగా అంగన్వాడి నేత జి బుల్లెమ్మ మాట్లాడుతూ, అంగన్వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలని, సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యూటి అమలు చేయాలని, మార్చి 13న ఆయాలను ఉద్దేశించి ప్రభుత్వం ఇచ్చిన జిఓ నెంబర్ 5ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేసారు. నిరసనలో అంగన్వాడీ నేతలు బి రత్నకుమారి, ఆశ వర్కర్ల నేత సత్యవేణి, అధిక సంఖ్యలో అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# పినపాక నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

**మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వినతి**



**మణుగూరు, మార్చి 31(మనం న్యూస్):** పినపాక నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల మెరుగుదల లక్ష్యంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కీలక ముందడుగు వేశారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను హైదరాబాద్లోని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. రవాణా కనెక్టివిటీ, మణుగూరు, పినపాక, అశ్వాపురం, కరకాగూడెం, గుండాల, అల్లపల్లి, బూర్గంపాడు మండలాల్లోని మారుమూల ఏజెన్సీ గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ముఖ్యంగా పంచాయతీరాజ్ శాఖ పరిధిలో రోడ్ల నిర్మాణం, హై లెవల్ బ్రిడ్జిల ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడీ భవనాలు, సుమారు 173 అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్న నేపథ్యంలో, వాటికి శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలు కేటాయించి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఖాళీల భర్తీ వేతనాలు, అంగన్వాడీ టీచర్ల ఖాళీలను తక్షణమే భర్తీ చేయడంతో పాటు వారి వేతనాలను పెంచి, సమస్యలను పరిష్కరించాలని మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమర్పించిన వినతిపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రోడ్లు, బ్రిడ్జిలు, అంగన్వాడీ భవనాలు టీచర్ల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# కారడవిలో కార్ల ప్రయాణం..





## దండకారణ్యం అంతటా రహదారులే
## కుగ్రామాలకు రహదారులను వేస్తున్న సర్కార్
## మెరుగైన విద్యా, వైద్యం, సాంకేతిక పరిజ్ఞానం
## దట్టమైన అడవులలో పరుగులు పెడుతున్న అభివృద్ధి

**చర్ల, మార్చి 31(మనం న్యూస్):** ఏడాది క్రితం వరకు దండకారణ్యంకు వెళ్లాలంటే కాలిబాటే దిక్కు. ఎంత దూమయినా నడక లేదా సైకిల్ ప్రయాణం ద్వారా చేరుకోవాల్సిందే. నేడు అక్కడి పరిస్థితులు మారాయి. కగార్ ఆపరేషన్ నేపథ్యంలో దండకారణ్యంలో అడుగడుగుకూ పోలీస్ క్యాంప్ లను ఏర్పాటు చేసారు. ప్రధాన గ్రామాలను కలుపుతూ పామేడ్ నుండి తెర్రం, పూసుగుప్ప నుండి ఆవుపల్లి వరకు పక్కా రహదారులను నిర్మించారు. ఈ రహదారులకు అనుభందంగా లోపటి గ్రామాలకు వెళ్లేందుకు ఉప రహదారులను నిర్మిస్తున్నారు. ఒక్కప్పుడు సైకిల్, మోటార్ సైకిల్ ప్రయాణమే కష్టంగా ఉండే దండకారణ్యం అడవులలో నేడు రయ్..రయ్..మంటూ బస్ లు, కార్లు పరుగులు పెడుతున్నాయి.దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపబడ్డ ఛత్తీస్ఘడ్ దండకారణ్యం నేడు అభివృద్ధి పథంలో ఉరుకులు పరుగులు పెడుతోంది. కేంద్రం, ఛతీస్ఘడ్ రాష్ట్రంలో బిజేపి ప్రభుత్వాలు ఉండటంతో డబుల్ ఇంజన్ సర్కార్ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోంది. ఒకప్పుడు మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో అభివృద్ధికి నోచుకోలేదు. నేడు వందల కోట్ల రూపాయలను వెచ్చించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. బిటి రహదారులతో పాటు ప్రతి చిన్న గ్రామానికి రహదారులను వేస్తున్నారు. దీంతో ఆదివాసీల రాకపోకలు సులభతరమయ్యాయి. గతంలో రహదారులు లేక ఆదివాసీలు అవస్థలు పడేవారు. ఎక్కడికి వెళ్లాలన్నా కాలి మార్గాన కిలోమీటర్ల కొలది వాగులు వంకలు దాటి ప్రయాణాలను సాగించాల్సి వచ్చేది. నేడు ఆ పరిస్థితులకు కాలం చెల్లింది. వాగులు వంకలపై భారీ ఇనుప వంతెనలను నిర్మిస్తూ రహదారులను వేయడంతో ప్రతి గ్రామానికి కార్లు, బస్ లు తిరుగుతున్నాయి. ప్రదానంగా పామేడ్ - తర్రెం, పూసుగుప్ప - ఆవుపల్లి, చర్ల - బోపాల్ పట్నం మార్గంలో చర్ల మండల కేంద్రం నుండి ప్రతిరోజూ ఏడు బస్ సర్వీస్ లు రాకపోకలు సాగిస్తున్నాయంటే పరిస్థితులలో ఎంత మార్పు వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. ఏడాది క్రితం వరకు ఇక్కడి ఆదివాసీలు అనారోగ్యం బారినపడితే జెడ్డీ మోతలు తప్పేవి కాదు. రహదారులు లేకపోవడంతో సకాలంలో వైద్యం అందక అనేక మంది గిరిజనులు మృతి చెందిన ఘటనలు అనేకం ఉండేవి. ప్రస్తుతం రహదారులు ఏర్పడటంతో అనారోగ్య బాధితులు క్షణాలలో సమీపంలోని వైద్యశాలలకు వెళ్లి చికిత్స పొంది ప్రాణాలను రక్షించుకుంటున్నారు. ఒకప్పుడు సెల్ ఫోన్ ను వింతగా చూసిన ఆదివాసీలు అదే స్మార్ట్ ఫోన్లను చేతిలో పట్టుకొని తిరుగుతున్నారు. ఛత్తీస్ఘడ్ దండకారణ్యంలోని ఏ కుగ్రామానికి వెళ్లినా సెల్ ఫోన్ సేవలు అందుతున్నాయి. ప్రతి పోలీస్ బేస్ క్యాంప్ వద్ద జియో లేదా బిఎస్ఎల్ఎన్ టవర్లను ఏర్పాటు చేసారు. దీనికి తోడు ప్రదాన గ్రామాలకు ఇంటర్ నెట్ సౌకర్యం కల్పించడంతో దండకారణ్యం సాంకేతికంగా ముందుకు దూసుకెలుతోంది. ప్రతి ఆదివాసీ ఇంట టివిలు దర్శనమిస్తున్నాయి. ఎవరి చేతిలో చూసినా స్మార్ట్ ఫోన్లు ట్రింగ్ ట్రింగ్ మంటున్నాయి. సెల్ ఫోన్ లో సినిమాలు, వార్తలు, యూట్యూబ్ చూస్తూ సంబరపడుతున్నారు. మరోవైపు కుగ్రామాలకు సైతం విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారు. రహదారుల పనులతో పాటు విద్యుత్ లైన్లను శరవేగంతో వేస్తున్నారు. చిమ్మచీకట్లు కమ్ముకున్న గ్రామాలు నేడు విద్యుత్ వెలుగులతో జిగేల్ మంటున్నాయి. గ్రామ ప్రదాన కూడళ్లలో ఐమాక్స్ లైట్లను పోలిన భారీ లైట్లను అమర్చడంతో రాత్రులు పట్టపగలను తలపిస్తోంది. గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీటి కొరకు అల్లాడిన ఇక్కడి జనం నేడు ప్రతి గ్రామానికి సోలార్ లేదా విద్యుత్ ఆదారిత రక్షిత మంచినీటి పదకం ఏర్పాటు చేసి ఇంటింటికి తాగునీటిని అందిస్తున్నారు. ఇలా మైదాన ప్రాంతాలకు ధీటుగా దండకారణ్య అటవీప్రాంత గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి. కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టి మావోయిజం నిర్మూలనకు నడుంబించిన వేళ ఇక్కడి ఆదివాసీల మనసును మళ్లించేందుకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. అభివృద్ధి రుచిని చూపించి మావోయిస్ట్ లను వారి దరిచేరకుండా చేసేందుకు ముమ్మర ప్రయత్నాలను చేస్తోంది. ఈ వ్యూహం ఫలించినట్లే కనిపిస్తోంది. ఆదివాసీలంతా మావోయిజం వైపు నుండి మెల్లగా దృష్టి మరల్చుకొని అభివృద్ధి వైపు చూసేలా చేయడంలో డబుల్ ఇంజన్ సర్కార్ సఫలీకృతం అయిందనే చెప్పాలి. ఇదే వరవడిని కొనసాగించి అభివృద్ధి తో పాటు సంక్షేమ పధకాలను అందించి ఉపాదిని కల్పిస్తే ఆదివాసీల జీవితాలు మెరుగుపడ తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.


# రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే తమ ప్రధాన లక్ష్యం: పోలీస్ కమిషనర్




**నేలకొండపల్లి, మార్చి 31(మనం న్యూస్):** ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలను, మరణాలను తగ్గించడమే తమ ప్రధాన లక్ష్యమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టాలను తగ్గించాలనే సంకల్పంతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మూడో విడత 'అరైవ్.. అలైవ్' ప్రచార కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. అందులో భాగంగా నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్పంచులు, ఆటో యూనియన్, మార్కెట్ యూనియన్లు, విద్యార్థులు, స్థానిక ప్రజలతో శ్రీకర ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ..దేశ వ్యాప్తంగా రోజురోజుకి పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రత ప్రాముఖ్యతను ప్రతి పౌరుడి మనసులో బలంగా నాటేందుకే అరైవ్ అలైవ్ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు మీ కోసం ఇంట్లో ఎదురుచూసే భార్యాపిల్లలను గుర్తుకు తెచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమం ద్వారా ప్రజలకు సురక్షిత డ్రైవింగ్ సంస్కృతిని అలవాటు చేసి, రోడ్డు భద్రతా వ్యవస్థలను పటిష్ఠం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ప్రముఖులు, మీడియా, ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో రోడ్డు భద్రతలో తెలంగాణను దేశానికే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నది తమ ధ్యేయమని పేర్కొన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై జరిమానా విధించడం తిరిగి తప్పిదాలు జరగకుండా జాగ్రత్త తీసుకుంటారని ఉద్దేశ్యమేనని అన్నారు. అరైవ్ ఆలైవ్ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి ప్రతి వ్యక్తికి చేరవేసి ప్రమాద రహిత జిల్లాగా నిర్మించేందుకు సమావేశానికి వచ్చిన అందరూ కట్టుబడి ఉండాలని స్పష్టంగా స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల జరగకుండా వేగం నియంత్రణ సూచిక బోర్డులను పోలీస్ కమిషనర్ స్వయంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏసిపి తిరుపతిరెడ్డి ఎస్ఐ సంతోష్ పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణతో ఆనందం

- **ఎస్జిపిఏటి శుభాకాంక్షలు**



**ఖమ్మం, మార్చి 31(మనం న్యూస్):** అంకిత భావంతో, బోధనను భాద్యతగా దశాబ్దాల పాటు విద్యాసేవ చేసి సోమవారం ఉద్యోగ విరమణ చేస్తున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం శుభాకాంక్షలు తెలిపింది. సిరిపురం ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు యంఏసు పాదం, చింతకాని ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు పొత్తూరి సీతారామారావు, వెలుగుమట్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏజి.ప్రమీల ఉద్యోగ విరమణ కార్యక్రమాలు ఆయా పాఠశాలల్లో ఉత్సాహపూరిత వాతావరణం లో వేడుకగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జిపిఏటి) జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య, జిల్లా కార్యదర్శులు బెల్లం రాధాకృష్ణ, కనపర్తి నాగప్రసాద్, సీనియర్ కార్యకర్త చీదిరాల వెంకటేశ్వరరావు లు ఆయా పాఠశాలల్లో జరిగిన ఉద్యోగ విరమణ సన్మానోత్సవాలలో పాల్గొని డైరి బహుకరించి, శుభాకాంక్షలు తెలిపారు. సిరిపురం పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీమోహన్ రావు, చింతకాని పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు బివిశర్మ , వెలుగుమట్ల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి సీనియర్ ఉపాధ్యాయులు యం ఉదయలక్ష్మి అధ్యక్షతన ఉద్యోగ విరమణ సన్మానోత్సవాలు ఘనంగా జరిగాయి.నూతన పెన్షనర్లకు కావలసిన సేవలు తాము అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం(ఎస్జిపిఏటి)జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య తన ప్రసంగంలో హామీ ఇచ్చారు.

# ప్రతి విద్యార్థి బాధ్యతాయుతమైన పౌరుడిగా ఎదగాలి: డిఎస్పి ఆదినారాయణ



**చుంచుపల్లి, మార్చి 31(మనం న్యూస్):** చుంచుపల్లి మండలంలో గల రామ్ నగర్లోని ఎస్ ఆర్ డీజీ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డిఎస్పి ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమాజంపై బాధ్యతాయుతమైన పౌరుడిగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న అవినీతి, డ్రగ్స్ వంటి సమస్యలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని, ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. చుట్టుపక్కల జరుగుతున్న అవినీతిపై జాగ్రత్తగా ఉండి, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ ఆర్ కొత్తగూడెం జోనల్ ఇంచార్జ్ సతీష్, ఎస్సై రవికుమార్, పాఠశాల ప్రిన్సిపల్ తిరుమల్ రెడ్డి, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

- **సదుపాయాలపై నిర్లక్ష్యం సహించబోం**
- **కలెక్టర్ అంకిత్**
- **జూలూరుపాడు మండల పాఠశాలల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు**
- **ఆహారం పదార్థాల నాణ్యత పరిశీలన**





**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 31 (మనంప్రతినిధి):** విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, సదుపాయాలపై నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని జిల్లా కలెక్టర్ అంకిత్ హెచ్చరించారు. మంగళవారం జూలూరుపాడు మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం , జూనియర్ కళాశాల, అలాగే పడమటి నర్సాపురం గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా స్థాయి, ఆహార నాణ్యత, తాగునీటి సదుపాయాలు, మౌలిక వసతులు, పరిపాలనా వ్యవస్థపై సమగ్రంగా పరిశీలించారు. మొదటగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం మరియు జూనియర్ కళాశాలను సందర్శించిన కలెక్టర్, ఎనిమిదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులు తీసుకుంటున్న టిఫిన్, భోజన నాణ్యతపై ఆరా తీశారు. మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా అనే విషయాన్ని నిర్ధారించుకున్నారు. విద్యార్థులతో ఇంగ్లీష్ పాఠ్యపుస్తకాన్ని చదివించి వారి పఠన సామర్థ్యాన్ని పరీక్షించారు. సిలబస్ పూర్తిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాల్, కిచెన్ను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందించకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తూ, బీట్రూట్ వంటి కూరగాయలు అందించకపోవడంపై సిబ్బందిని ప్రశ్నించారు. విద్యార్థులకు తప్పనిసరిగా నాణ్యమైన, తాజా కూరగాయలతో ఆహారం అందించాలని ఆదేశించారు. విద్యార్థులు చేతులు శుభపరచుకునే ప్రదేశంలో ట్యాపులు లేకపోవడం, మరమ్మతులు చేపట్టకపోవడంపై వివరణ కోరారు. పాఠశాలలో గ్యాస్ సదుపాయం, సిలిండర్ల లభ్యత, వంట సిబ్బంది సంఖ్య, నెలవారీ వ్యయాలపై వివరాలు తెలుసుకున్నారు. పనిచేయకుండా ఉన్న ఆర్.ఓ ప్లాంప్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ, తక్కువ వ్యయంతో మరమ్మతులు చేయవచ్చని ఉన్నప్పటికీ బయట నుంచి నీటి సరఫరా కొనసాగించడం ఎందుకని ప్రశ్నించారు. అనవసర ఖర్చులను తగ్గించి నిర్వహణ నిధులను విద్యార్థుల సౌకర్యాల కోసం వినియోగించాలని సూచిస్తూ, ఒక వారం రోజుల్లో ఆర్.ఓ ప్లాంట్ను మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలో సరుకుల సరఫరా విధానం, ఏఎన్ఎం అందుబాటు, రాత్రి డ్యూటీ సిబ్బంది వివరాలు, డ్యూటీ షెడ్యూల్, విద్యార్థుల టైమ్ టేబుల్ను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మజ పాఠశాలలో 166 మంది విద్యార్థులు, జూనియర్ కళాశాలలో 92 మంది విద్యార్థులు ఉన్నట్లు వివరించారు. అనంతరం పడమటి నర్సాపురం గిరిజన బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, తరగతి గదులను పరిశీలించి ఏడవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, ఆహార నాణ్యతపై ఆరా తీశారు. పాఠశాలలో మొత్తం 450 మంది విద్యార్థులు ఉన్నట్లు ప్రధానోపాధ్యాయులు సుభద్ర తెలిపారు. భోజనశాల, కిచెన్ షెడ్ను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహారాన్ని రుచి చూసి నాణ్యతను పరీక్షించారు. స్టోర్ రూమ్లో నిల్వ ఉంచిన కూరగాయలను పరిశీలించిన సమయంలో దుర్వాసన రావడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుళ్లిన కూరగాయలను వెంటనే తొలగించాలని ఆదేశిస్తూ, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. వంటకు నాణ్యమైన, తాజా కూరగాయలనే వినియోగించాలని స్పష్టం చేశారు. స్టోర్ రూమ్లో నిల్వ ఉన్న బియ్యం తదితర సరుకులను పరిశీలించి వాటి నాణ్యతపై విచారణ చేశారు. ఆర్.ఓ ప్లాంట్ను పరిశీలించి తాగునీటి సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు యూనిఫార్ములు, నైట్ డ్రెస్సులు, స్పోర్ట్స్ డ్రెస్సులు సమయానికి అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్ యంత్రాలు పనిచేయకపోవడంపై అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్, అవి వినియోగంలో లేకపోతే ఎందుకు ఉంచారో ప్రశ్నించారు. కేవలం అలంకారంగా ఉంచడానికేనా అని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వాటిని వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని లేదా అవసరం లేకపోతే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం తప్పనిసరిగా అందించాలి. పాఠశాలల్లో శుభ్రమైన త్రాగునీరు, పరిశుభ్రతపై ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదు. పనిచేయని ఆర్.ఓ ప్లాంట్లు, బయోమెట్రిక్ యంత్రాలను అలాగే ఉంచడం సరైంది కాదు. ఇవి అలంకారానికి కాదు వెంటనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలి లేదా తొలగించాలి. అనవసర ఖర్చులను తగ్గించి విద్యార్థుల సౌకర్యాల అభివృద్ధికి నిధులు వినియోగించాలి. విద్యార్థుల ఆరోగ్యం, విద్యా నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని స్పష్టం చేశారు. ఈ తనికఖీలో కలెక్టర్ వెంట తాసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణిలో మహావీర్ జయంతి వేడుక



**ఖమ్మం, మార్చి 31(మనం న్యూస్):** స్థానిక త్రివేణి ఉన్నత పాఠశాలలో మహావీర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి వారి మహావీరుడు చిత్రపటానికి పూలమాలను అలంకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో డైరెక్టర్ మాట్లాడుతూ జైన మతం 24వ తీర్థంకరుడు అయిన మహావీర్ అహింసా మార్గాన్ని పాటించాలని ప్రబోధించిన జైనమత ప్రచారకుడు అని అతను సిద్ధాంతాలు సమాజాన్ని ఎంతో ప్రభావితం చేశాయని తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మహావీరుడు క్షత్రియ కుటుంబంలో జన్మించి 36వ యేట సన్యాసాన్ని స్వీకరించి జైన మతం పట్ల ఆకర్షితులై అహింసా సిద్ధాంతాన్ని పాటించమని ప్రబోధించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ముస్తఫా స్వప్న క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

### త్రివేణి లో డాక్టర్ ఆనంది గోపాల్ జోషి జయంతి వేడుక

స్థానిక త్రివేణి ఉన్నత పాఠశాలలో ఆనంది గోపాల్ జోషి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి జోషీ చిత్రపటానికి పూలమాలను అలంకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో డైరెక్టర్ మాట్లాడుతూ భారతదేశంలోని తొలి మహిళ డాక్టర్ ఆనంది గోపాల్ జోషి అనీ, ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని తెలుపుతూ ఆమె చేసిన సేవలను కొనియాడారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ ముస్తఫా స్వప్న క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్ పాల్గొన్నారు.



# పొంగులేటికి వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేకే అసత్య ఆరోపణలు

**దమ్మపేట, మార్చి 31(మనం ప్రతినిధి):** పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి పెరుగుతున్న ప్రజాదారణ చూసి తట్టుకోలేకనే బిఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు వార్డు సభ్యుడు శివనాగరాజు పేర్కొన్నారు. అసెంబ్లీలో తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని బిఆర్ఎస్ శాసనసభ్యుడు హరీష్ రావు పై విమర్శలు చేశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,కి రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న ప్రజాధారణ చూసి అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు. రాజకీయాల్లో రాకముందే వ్యాపార రంగంలో ఒక్కొక్క మెట్టు ఎదిగి తనదైన శైలిలో ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చారని అలాంటి నాయకుడిపై విమర్శలు చేయడం సరికాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇలాంటి తప్పుడు ప్రచారం చేయడం వల్ల బిఆర్ఎస్ నాయకులు ప్రజల్లో మరింత చులకన అవుతారని పేర్కొన్నారు.

# ఎమ్మెల్సీ విజయశాంతి చిత్రపటానికి పాలాభిషేకం



**ఖమ్మం, మార్చి 31(మనం న్యూస్):** మయూర్ సెంటర్ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం(రిజిస్టర్డ్) ఆధ్వర్యంలో అధికార పార్టీ ఎమ్మెల్సీ విజయశాంతి ఫోటోకి పాలభిషేకం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం(రిజిస్టర్డ్) రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె వి కృష్ణారావు పాల్గొని మాట్లాడారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు మౌనం వీడాలని అన్నారు . సీఎం రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయని పక్షంలో రాబోయే కాలంలో తగిన ఫలితం అనుభవించక తప్పదని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో కూడా అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఆవేదనను అర్థం చేసుకొని ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను గురించి మాట్లాడిన అధికార పార్టీ ఎమ్మెల్సీ విజయశాంతి కి ఉద్యమకారుల అందరి తరఫున ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంతేటి వీరభద్రం, రడం సురేష్, లింగన బోయిన సతీష్ , బత్తిన మధుగౌడ్, రవిచంద్ర చౌహాన్, ఎస్ డి బురాన్, ఆసిఫ్, దరిపల్లి వీరబాబు, భుక్య శ్రీనివాస్ నాయక్, అజ్మీరా వీరన్న నాయక్, ఎస్.కే.సలీం, గాజుల రవి, మెట్టు వెంకటేశ్వర్లు, దాసరి శ్రీనివాస్, దొడ్డా శ్రీనివాస్ రెడ్డి, రవీంద్ర నాయక్, కొట్టే ఉపేందర్, గాలి రాము గౌడ్, యాకుబ్, బచల పద్మాచారి, యస్.కే. నాగులు మీరా తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 2న ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక గ్రామ, వార్డు సభలను విజయవంతంగా నిర్వర్తించాలి




- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ఉమ్మడి మహబూబ్ నగర్ మార్చి 31 (మనం బ్యూరో)ః ఏప్రిల్ 2వ. తేదీన గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభల నిర్వహణపై మంగళవారం హైదరాబాద్ సెక్రటేరియట్ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక పై సమీక్షించారు. మంగళవారం ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ..., గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలు రాష్ట్ర ప్రభుత్వ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రతి గ్రామ పంచాయతీలో, మున్సిపల్ పరిధిలో వార్డు సభలను విజయవంతంగా నిర్వర్తించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వానికి అనుసంధానంగా పనిచేస్తూ ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల మధ్యలోకి తీసుకువెళ్లి ప్రజలందరికీ వివరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రతి గ్రామసభ, వార్డు సభకు ప్రజా ప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఆదేశించారు. వివిధ ప్రభుత్వ పథకాల లబ్దిదారుల వివరాలతో కరపత్రం రూపొందించాలన్నారు. దానిని కార్యక్రమంలో అందజేయాలని తెలిపారు. ప్రగతి ప్రణాళిక కోసం గ్రామ స్థాయి, వార్డు స్థాయి అభివృద్ధి ప్రాధాన్యతలను గుర్తించాలన్నారు. గ్రామం, వార్డులో ఉన్న సమస్యలను గుర్తించాలని, పరిష్కారాలపై చర్చించాలని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో ఇప్పటిదాకా చేపట్టిన పనులు, పురోగతి అంశాల వారీగా ఎన్ని పెండింగ్ ఫైళ్లు పరిష్కరించారో వివరించాలని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు. జిల్లాలో గ్రామ సభల నిర్వహణకు పకడ్బందీగా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం,

**షెడ్యూల్ ప్రకారం కార్యక్రమం నిర్వహణ,**

వీడియో కాన్ఫరెన్స్ లో ఉప ముఖ్యమంత్రి కి తెలిపిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం ఏప్రిల్ 2వ. తేదీన నాగర్ కర్నూల్ జిల్లాలోని 461 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు, 4 మున్సిపాలిటీల్లో వార్డు సభల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి హాజరైన నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉప ముఖ్యమంత్రికి వివరిస్తూ..., నాగర్ కర్నూల్ జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో నిర్వహించే గ్రామ సభలకు సర్పంచ్, మున్సిపాలిటీలో చైర్ పర్సన్, ఉప సర్పంచ్, వైస్ చైర్ పర్సన్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సంబంధిత శాఖల అధికారులు, గ్రామ పెద్దలు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత రైతులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులను, వివిధ పథకాల లబ్ధిదారులు హాజరయ్యేలా అధికారుల ద్వారా ఇప్పటికే చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికను జిల్లా లో సమర్థవంతంగా నిర్వర్తించడంతో పాటు ప్రజల అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతున్నట్లు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలు భాగంగా నిర్వహించే గ్రామ సభల ఈ సందర్భంగా వివరించారు. గ్రామ సభలకు అవసరమైన ఏర్పాట్లతో పాటు ప్రభుత్వం ఆమోదించిన ఫ్లెక్సీల ఏర్పాట్లు, షామియానాలు, త్రాగునీరు, ఎల్ఈడి, సౌండ్ సిస్టం, తెలంగాణ జాతీయ గీతం, ప్రజా ప్రతినిధుల ఆహ్వానాలు, విఐపిల హాజరు తదితర అంశాలపై అధికారులు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అత్యవసర ఏర్పాట్లతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న నూతన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ముఖ్యంగా అంగన్వాడీల నుండి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని నూతనంగా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ భీమ రూ.5 లక్షల ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ చదివే దివ్యాంగ విద్యార్థినీలకు ద్విచక్ర వాహనాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించే ఈ నూతన పథకాలను ప్రజలందరికీ గ్రామ సభలో వివరించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు జీవి శ్యాం ప్రసాద్ లాల్, అమరేందర్, జిల్లా పరిషత్ సీఈఓ దేవా సహాయం, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద రథోత్సవంపై శ్రీరాముడు చూడముచ్చటగా

- శ్రీరామ నామస్మరణతో మారుమోగిన సిరసనగండ్ల
- ముక్కిడి పోచమ్మకు మొక్కులు
- వేలాది భక్తజనం మధ్య శ్రీరాముడు
- 80 ఏళ్ల వయసులో వృద్ధుల జంట దర్శనం



చారకొండ,మార్చి31(మనం న్యూస్): చారకొండ మండలం సిరసనగండ్ల గ్రామం అయోధ్య నగర్(గుట్ట)లో శ్రీ సీతారామచంద్రస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వాములవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,అనంతరం మంగళవారం తెల్లవారుజామున పెద్ద రథోత్సవం(పెద్దతేరు)ను దేవస్థాన చైర్మన్ డేరం రామశర్మ,కార్యనిర్వహణ అధికారి స్వర్గం ఆంజనేయులు,మేనేజర్ నిరంజన్,అర్చకులు,పెద్దల సమక్షంలో రథోత్సవాన్ని ప్రారంభించారు.పెద్ద రథోత్సవం వేలాదిమంది భక్తజనం మధ్య దేవాలయాలకు దర్శనం ఇచ్చుకుంటూ దేవాలయాల వద్ద ప్రధాన అర్చకులు లక్ష్మణ్ శర్మ పూజలు నిర్వహించి,విజయవంతంగా శ్రీరామ నామస్మరణతో మార్మోగింది.తేరును లాగడానికి భక్తులు ఆసక్తితో ముందుకు వచ్చి తేరును లాగుతూ స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.విజయవంతంగా పెద్దతేరు సాగింది...



**ముక్కుడి పోచమ్మ అమ్మవారికి మొక్కులు**

బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తులు మొదటగా ముక్కిడి పోచమ్మ అమ్మవారికి మొక్కులు చెల్లించి,ఆ తర్వాత శ్రీ సీతారాముల స్వాములవారిని దర్శించుకోని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి,అనంతరం కుటుంబ సమేతంగా సంపక్తి భోజనం చేసి మహిళలు ఆడపడుచులు జాతరలో రకరకాల వస్తువులను కొనుగోలు చేసి చూడముచ్చటగా ఇంటి ప్రయాణం పట్టారు.

**80 ఏళ్ల వయసులో దర్శనం కోసం వృద్ధుల జంట**

శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలను తిలకించుటకు కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన 80 ఏళ్ల వయసుగల వృద్ధుల జంట తన కుటుంబం తో పాటు ప్రతి ఒక్కరు క్షేమంగా ఉండాలని,ముక్కిడి పోచమ్మను దర్శించుకుని అనంతరం శ్రీ సీతారాముల దర్శించుటకు గుట్టపై బయలుదేరిన జంట'మనం న్యూస్₹ కంటపడింది.

**పోలీసు బందోబస్తు విజయవంతం**

జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా పెద్ద రథోత్సవం విజయవంతంగా కొనసాగించి,శాంతి భద్రతలకు ఆటంకం కలిగించకుండా చారకొండ పోలీస్ ఎస్సై వీరబాబు ఆధ్వర్యంలో డి.ఎస్.పి,సీఐ,ఎస్ఐలు,పోలీసు బలగాల పర్యవేక్షణలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి పెద్ద రథోత్సవం విజయవంతంగా సాగింది.జాతర బ్రహ్మోత్సవాలలో వేలాదిమంది భక్తులు దర్శించుకున్నారు.పెద్ద రథోత్సవం పై ప్రధాన అర్చకులు లక్ష్మణ్ శర్మ,అర్చకులు గోపిశర్మ,వేణు శర్మ,ఆనంద శర్మ,అనంతశర్మ,భాస్కర్ శర్మ,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకండి

- మునిసిపల్ కౌన్సిల్ ప్రతినిధులకు ఎమ్మెల్యే మేఘారెడ్డి సూచన
- మునిసిపల్ సిబ్బంది పనితీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవు
- 55.31 వార్షిక అంచనా బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం



వనపర్తి మార్చి 31 (మనం ప్రతినిధి)ః ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కౌన్సిల్ ప్రతినిధులు పనిచేయాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ మాధవి అధ్యక్షతన 2026-27 సవరించిన వార్షిక బడ్జెట్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత ఏడాది 53.85 కోట్ల వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టగా ఈ ఏడాది 55.31 కోట్ల అంచనా తో బడ్జెట్ ప్రవేశపెట్టినట్లు కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మొత్తం బడ్జెట్లో 10 శాతం నిధులతో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించి గ్రీన్ బడ్జెట్ గా కేటాయించినట్లు వారు తెలిపారు. 1/3 వ వంతు బడ్జెట్ ను పురపాలక సంఘంలోని వెనుకబడిన ప్రాంతాలు, అభివృద్ధి చెందని ప్రాంతాలు, మైనారిటీ, బలహీన వర్గాలు నివసించే ప్రాంతాలు, మురికివాడల అభివృద్ధికి వినియోగించనున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా సమన్వయంతో పనిచేసి మునిసిపాలిటీని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. త్వరలో మునిసిపల్ సమావేశం ఏర్పాటు చేసి మునిసిపల్ శాఖలో ఇంజనీరింగ్ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది ఎంతమంది ఉన్నారో ఎక్కడెక్కడ విధులు నిర్వహిస్తున్నారు సభ ముందు ఉంచాలని హెచ్చరించారు. రోడ్ల పైన చిరు వ్యాపారం చేసుకునే వారికి నచ్చజెప్పి సమీకృత మార్కెట్ కు పంపించాలని సూచించారు. చైర్మన్ మాధవి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అన్ని వార్డులకు సమాన నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ కిమ్యా నాయక్ కమిషనర్ వెంకటేశ్వర్లు వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఎంతో మేలు



- సబితా ఇంద్రారెడ్డి

రంగారెడ్డి మార్చి 31 (మనం న్యూస్) : ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఎంతో మేలు అని మాజీ మంత్రి, మహేశ్వరం శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లెలగూడలోని క్యాంప్ క్యారాలయంలో లబ్ధిదారు శారదకు మంజూరైన రూ.40,000 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ బి.ఆర్.యస్ పార్టీ మాజీ ఫ్లోర్ లీడర్ కార్పొరేటర్ అర్కల భూపాల్ రెడ్డి,పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు సునీత బాల్ రాజ్ పాల్గొన్నారు.

# జనగణనలో మాస్టర్ ట్రైనర్లు కీలకం

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సీఎంఎంఎస్, డిజిటల్ విధానం, హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్‌పై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ




రాజన్న సిరిసిల్ల, మార్చి - 31(మనం ప్రతినిధి )ః జనగణన - 2027 లో మాస్టర్ ట్రైనర్లు కీలకమని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జనగణన 2027లో భాగంగా సెన్సస్ మానిటరింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్, (సీఎంఎంఎస్), డిజిటల్ విధానం, హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ పై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం జిల్లా సమీకృత కార్యాలయం సముదాయంలో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు కొనసాగుతుండగా, మంగళవారం కలెక్టర్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో డిజిటల్ విధానంలో జరిగే మొదటి జనగణనని వెల్లడించారు. మొదటి దశలో మే 11 వ తేదీ నుంచి జూన్ 09 వ తేదీ వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని, రెండో దశ ఫిబ్రవరి 2027 లో వ్యక్తుల వారిగా సమాచారం సేకరిస్తారని తెలిపారు. జనగణన సేకరించే వివరాలు కీలకమని స్పష్టం చేశారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యతల నిర్వహణలో ఎంతో కీలకమని స్పష్టం చేశారు. వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయించాలని ఆదేశించారు. హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్, ఇతర అన్ని అంశాలపై డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్ మాస్టర్ ట్రైనర్ శివ రామ కృష్ణ పూర్తి స్థాయిలో వివరించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రతి అంశంపై తెలిపారు. శిక్షణలో జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, గణాంక అధికారి సంపత్ కుమార్, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి 10వ. తరగతి ప్రశ్నపత్రాల మూల్యాంకనం

- డీఈవో రమేష్ కుమార్



ఉమ్మడి మహబూబ్ నగర్, మార్చి 31 (మనం బ్యూరో): నేటి నుంచి పదో తరగతి పరీక్షల ప్రశ్నాపత్రాల మూల్యాంకనం ఈ సంవత్సరం మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు, ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 23వ. తేదీ వరకు 23 రోజుల పాటు 1,72,190 ప్రశ్న పత్రాలను మూల్యాంకనం నిర్వహించనున్నట్లు నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ స్కూలులో ప్రశ్నా పత్రాలను మూల్యాంకనం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షలు ఎక్కువ రోజులు జరుగుతున్నాయన్నారు. పదో తరగతి పరీక్షలను 34 రోజుల పాటు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అందుకు అనుగుణంగానే పదవ తరగతి పరీక్షల ప్రశ్నపత్రాల మూల్యాంకనం మూడు విడతలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేటి నుంచి మొదటి విడత ఏప్రిల్ 1వ. తేదీ నుంచి తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితశాస్త్రంతో మూల్యాంకనం ఏప్రిల్ 9వ. తేదీ వరకు జరగనున్నట్లు డిఇఓ తెలిపారు. రెండో విడతలో ఏప్రిల్ 10 నుంచి 17వ. తేదీ వరకు భౌతికశాస్త్రం, జీవశాస్త్రం సబ్జెక్టుల మూల్యాంకనం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. చివరగా మూడో విడతలో ఏప్రిల్ 17 నుంచి ఏప్రిల్ 23వ. తేదీ వరకు సాంఘిక శాస్త్రం ప్రశ్నపత్రాల మూల్యాంకనం నిర్వహించనున్నట్లు డిఇఓ తెలిపారు. ఇందుకోసం 92 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 554 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 162 మంది స్పెషల్ అసిస్టెంట్లను మూల్యాంకనానికి నియమించినట్లు డీఈవో తెలిపారు. ప్రతి సబ్జెక్టుకు ఇద్దరి చొప్పున 16 మంది ప్రత్యేక అధికారులుగా క్యాంప్ ఆఫీసర్ గా డీఈఓ రమేష్ కుమార్, అదనపు క్యాంప్ ఆఫీసర్ గా కురుమయ్య, ఎగ్జామినర్ రాజశేఖర్ రావు లు మూల్యాం కేంద్రానికి వ్యవహరించనున్నారు. మూల్యాంకనం జరిగే లిటిల్ ఫ్లవర్ స్కూల్లో బెంచీలు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, తాగునీరు వంటి ఏర్పాట్లు ఇప్పటికే పూర్తిచేసినట్లు డీఈవో తెలిపారు. మూల్యాంకనం ప్రక్రియ సజావుగా జరిగేలా, ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. రోజుకు 40 పేపర్లు మూల్యాంకనం ప్రతి సబ్జెక్ట్ ఉపాధ్యాయుడికి రోజుకు మూల్యాంకనం చేసేందుకు 40 పేపర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. మూల్యాంకనం చేయడానికి ఆర్డర్లు అందుకున్న ప్రతి ఉపాధ్యాయుడు విధిగా హాజరు కావాలన్నారు. అనధికారికంగా మూల్యాంకనం విధులకు హాజరు కాకుంటే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని డిఇఓ హెచ్చరించారు. ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకనం నిర్వహించినట్లు తెలిపారు.

# వీర హనుమాన్ శోభాయాత్ర



భీమదేవరపల్లి మార్చి 31 మనం న్యూస్ః మేజర్ గ్రామపంచాయతీ ముల్కనూరులో వీర హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. మంగళవారం రోజున ముత్తారం త్రికూటేశ్వరఆలయం కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా కొత్తపల్లి శ్రీ దత్త సాయి ఆలయ మందిరం నుండి హనుమాన్ శోభాయాత్ర ప్రారంభమై ముల్కనూర్ ప్రధాన రహదారి వెంబడి అనుమాన భక్తులు హనుమాన్ విగ్రహానికి ఆకర్షణీయమైన అలంకరణతో వాహనంపై ఊరేగిస్తూ హనుమాన్ చాలీస్ జపిస్తూ భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా నృత్యాలతో యాత్రను ముత్తారంత్రికుటేశ్వరాలయానికి శోభయాత్రను చేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులు, గ్రామాల ప్రజలు మహిళలు యువకులు యువకులు, తదితరులు పాల్గొన్నారు.


# విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి

- పాఠశాల, అంగన్వాడి కేంద్రాలపై కలెక్టర్ సమగ్ర పరిశీలన



సంగారెడ్డి, మార్చి 31 మనం ప్రతినిధిః జిల్లాలో విద్యా , శిశు సంక్షేమ సేవల అమలు పరిశీలనలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం కొండాపూర్ మండలం గుంతపల్లి గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల , అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసి, అక్కడి వసతులు, సేవల నాణ్యతపై సమగ్రంగా పరిశీలించారు.మొదట ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్, తరగతి గదుల పరిస్థితి, పరిశుభ్రత, మరుగుదొడ్లు, త్రాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, పాఠశాల పరిసరాలు, కాంపౌండ్ వాల్ వంటి మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యతపై ఆరా తీశారు. భోజనం బాగుందని విద్యార్థులు తెలపడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని, ప్రతి విద్యార్థి చదువు పై దృష్టి పెట్టాలని సూచించారు. తదుపరి అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలోని వంటగది, పరిశుభ్రత, పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. పిల్లలకు గుడ్లు మరియు ఇతర పౌష్టికాహారం అందుతున్నదా అని ఆరా తీశారు. చిన్నారుల శారీరక మరియు మానసిక అభివృద్ధికి పౌష్టికాహారం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం సరైన మోతాదులో పోషకాహారం అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పిల్లలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, త్రాగునీరు, చల్లని వాతావరణం కల్పించాలని తెలిపారు. అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్, ఇండ్ల ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పిమ్మట మోనిన్ పరిశ్రమను సందర్శించి పరిశీలించిన కలెక్టర్ పరిశ్రమలో అమలవుతున్న భద్రతా చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని కంపెనీ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అశోక్, ఎంపీడీవో వేణుగోపాల్, సర్పంచ్ అనంతరెడ్డి, హౌసింగ్ ఏఈ,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ/వార్డు సభలను పకడ్బందీగా పెద్ద ఎత్తున నిర్వహించాలి



సంగారెడ్డి, మార్చి 31మనం ప్రతినిధిః ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఏప్రిల్ 2 నుండి రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు మరియు వార్డు సభలను పకడ్బందీగా, పెద్ద ఎత్తున నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. మంగళవారం హైదరాబాద్ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు మరియు జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులను ఈ సమావేశాలకు ఆహ్వానించాలని తెలిపారు. ఈ సభలలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రత్యేకంగా రైతు భరోసా, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ వంటి పథకాల లబ్ధిదారుల వివరాలను సభలో చదివి వినిపించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే జూన్ 2 నుండి ప్రారంభం కానున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం అమలు చేయబోతున్న విషయాన్ని వివరించాలని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహార పథకం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విశయం కూడా ప్రజలకు వివరించాలని సూచించారు. సాంస్కృతిక కళాకారుల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, జిల్లాలో గ్రామసభలు/వార్డు సభల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ పాండు, జెడ్పీ సీఈవో జానకి రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.


## కువైట్ చమురు ట్యాంకర్‌పై ఇరాన్ దాడి..!



బాగ్దాద్, మార్చి 31: గల్ఫ్ దేశాలపై ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసింది. తాజాగా కువైట్‌కు చెందిన ఓ చమురు ట్యాంకర్‌పై భీకర దాడి చేసింది. ఈ ఘటనలో భారీగా మంటలు చెలరేగాయి. కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ఓ ప్రకటనలో ఈ ఘటనను ధ్రువీకరించింది.

కువైట్‌కు చెందిన 'అల్ సల్మీ' అనే భారీ ముడిచమురు నౌక దుబాయ్ పోర్టు వద్ద ఉంది. దీనిపై ఇరాన్ డ్రోన్‌తో దాడి చేయగా.. పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఘటన తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ 24 మంది సిబ్బంది సురక్షితంగానే ఉన్నారని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు ధ్రువీకరించారు. అయితే, దాడి సమయంలో ట్యాంకర్ నిండా చమురు ఉన్నట్లు తెలుస్తోంది. సముద్ర జలాల్లో చమురు ఒలికే ప్రమాదం ఉందని కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ఆందోళన వ్యక్తంచేసింది. ఈ ఘటనను దుబాయ్ అధికారులు కూడా ధ్రువీకరించారు. రెస్క్యూ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చినట్లు వెల్లడించారు.

## చొరబాట్లు.. ఎన్నికల అంశం కాదు



- అస్తిత్వ పరిరక్షణ, దేశ భద్రత ముఖ్యం
- అస్సాంలో హ్యాట్రిక్ లక్ష్యంగా పని
- ప్రధాని నరేంద్ర మోడీ

ఢిల్లీ, మార్చి31: అస్సాంలో చొరబాట్లు కేవలం ఎన్నికల అంశం కాదని.. ఆ రాష్ట్ర అస్తిత్వ పరిరక్షణ, దేశ భద్రత దానితోనే ముడిపడి ఉన్నాయని ప్రధాని నరేంద్రమోడీ చెప్పారు. చొరబాటుదారులకు కొమ్ముకాయడం ద్వారా భూముల దురాక్రమణను కాంగ్రెస్ అనుమతిస్తోందని ఆరోపించారు. అస్సాం బీజేపీ బూత్‌స్థాయికార్యకర్తల్ని ఉద్దేశించి ఆయన ఢిల్లీ నుంచి వర్చువల్గా ప్రసంగించారు. చాలాకాలం పాటు అస్సాంలో అస్థిరత కొనసాగిందని, పదేళ్ల క్రితం బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారు కొలువుదీరిన తర్వాత శాంతిని నెలకొల్పే చర్యలన్నీ తీసుకుంటూ వచ్చిందని మోడీ వివరించారు. ఆనాటి దుష్పరిపాలన గురించి నవతరం ఓటర్లకు తెలియజెప్పాలని సూచించారు. చిన్న తప్పిదం కూడా రాష్ట్రాన్ని మళ్లీ వెనక్కి నెడుతుందనేది వివరించాలని చెప్పారు. ''చొరబాటుదారులు ఎక్కడ స్థిరపడినా చిన్నవ్యాపారాలను గుప్పిటపడతారు. స్థానికుల ఉపాధి అవకాశాలను హరిస్తారు. భూముల్ని కబ్జా చేస్తారు. ఆక్రమణల్ని కాంగ్రెస్ ప్రోత్సహించిన తీరు, ప్రజల హక్కుల్ని బీజేపీ రక్షిస్తున్న విధానం గురించి ప్రజలకు తెలియాలి'' అని తెలిపారు.

### నూతన విశ్వాసంతో ముందుకు..

''అస్సాం ఇప్పుడు నూతన ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోంది. ఒక రాష్ట్ర అభివృద్ధికి శాంతి అత్యంత అవసరం. ఈశాన్య ప్రాంతంలో వివిధ సంస్థలతో 12 శాంతి ఒప్పందాలు కుదుర్చుకున్నాం. గత పదేళ్లలో నిజాయితీగా అమలుచేసిన ఆ ఒప్పందాల వల్ల అస్సాంలో స్థిరత్వం నెలకొంది. మునుపటి కాంగ్రెస్ ప్రభుత్వాలు కేవలం వార్తల్లో నిలిచేందుకు ఒప్పందాలు చేసేవి. అవి కాగితాలకే పరిమితమయ్యేవి. బోడో సమస్య సహా అనేక అంశాల్లో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది. తిరుగుబాటుదారులు, విద్యార్థి సంఘాలతో ఆ పార్టీ కుదుర్చుకున్న ఏ ఒప్పందమూ ఫలించలేదు'' అని ప్రధాని నరేంద్ర మోడీ విమర్శించారు. ఎన్నికల సమయంలో కృత్రిమ మేధతో రూపొందించి ప్రచారం చేస్తున్న ఏఐ వీడియోలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అస్సాంలో హ్యాట్రిక్ విజయం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. తేయాకు తోటల్లో పోలింగ్ కేంద్రాలను కార్యకర్తలు సందర్శించి, చాయ్ పే చర్చా వంటివి నిర్వహించి ప్రజల గాథలు తెలుసుకోవాలని సూచించారు.

### వారికి కుటుంబం.. మాకు దేశం ముఖ్యం

కాంగ్రెస్, డీఎంకేలకు ప్రజా ప్రయోజనాల కంటే కుటుంబమే తొలి ప్రాధాన్యమని, తమకు మాత్రం దేశమే ముఖ్యమని మోడీ చెప్పారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఈ విషయం చెప్పాలని సూచించారు. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని బీజేపీ బూత్‌స్థాయి కార్యకర్తల్ని ఉద్దేశించి కూడా ఆయన వర్చువల్గా మాట్లాడారు. కాంగ్రెస్-డీఎంకేలు అధికారంలోకి వచ్చేందుకు పుదుచ్చేరి ఓటర్లు అనుమతించబోరని ఆశాభావం వ్యక్తపరిచారు. పుదుచ్చేరిలో ఆ పార్టీల నిర్వాకాలను బీజేపీ శ్రేణులు బలంగా ఎండగడుతున్నాయని ప్రశంసించారు. ఆ రెండు పార్టీల ప్రవర్తన ఇప్పటికీ మారడం లేదని, అవి పరస్పరం కలహించుకుంటూనే ఉంటాయని ప్రధాని నరేంద్ర మోడీ విమర్శించారు.

## పాలస్తీనీయులు ఉగ్ర దాడి చేస్తే.. మరణ శిక్షే: ఇజ్రాయెల్



జరుసలెం, మార్చి31: దేశంలో ఉగ్ర దాడులకు పాల్పడిన పాలస్తీనీయులకు మరణశిక్ష విధించేలా కొత్త చట్టాన్ని ఇజ్రాయెల్ పార్లమెంట్ (క్నెసెట్) అమల్లోకి తెచ్చింది. దాదాపు పన్నెండు గంటల చర్చ తర్వాత దీనిని ఆమోదించారు. దీని ప్రకారం ఉగ్ర దాడులకు పాల్పడిన వారందరికీ మరణశిక్ష విధించే అధికారం అక్కడి కోర్టులకు ఉంటుంది. శిక్ష విధించిన 90 రోజుల లోపు దానిని అమలుచేయాలి. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రం న్యాయస్థానం నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తుంది.

ఉగ్రవాదాన్ని అంతం చేయాలనే స్పష్టమైన లక్ష్యంతో ఈ చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చినట్లు ఇజ్రాయెల్ అధికారులు పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌లోని ఓ ప్రాంతంపై హమాస్ చేసిన ఉగ్రదాడులకు వ్యతిరేకంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇజ్రాయెల్ పౌరులు, నివాసితులను ఈ చట్టం నుంచి మినహాయించినప్పటికీ ప్రత్యేక నిబంధన ప్రకారం ఉగ్ర కార్యకలాపాలతో ఒక వ్యక్తి మరణానికి కారణమైన ఇజ్రాయెలీలకు సైతం ఈ చట్టం వర్తిస్తుందని అధికారులు వెల్లడించారు. ఇజ్రాయెల్ పార్లమెంట్ నిర్ణయాన్ని అమెరికా స్వాగతించింది. సొంత చట్టాలను ప్రవేశపెట్టుకొనే హక్కు ఇజ్రాయెల్ పార్లమెంట్‌కు ఉందని పేర్కొంది. సుదీర్ఘ సమావేశం అనంతరం ఇజ్రాయెల్ పార్లమెంట్ వార్షిక బడ్జెట్ను ఆమోదించింది. సాధారణంగా ప్రభుత్వ పదవీకాలం పూర్తికాకముందే ఇజ్రాయెల్‌లో ఎన్నికలు నిర్వహిస్తారు. నెతన్యాహు ప్రభుత్వం నాలుగేళ్ల పదవీకాలం మరికొన్ని నెలల్లో పూర్తి కానుంది. అక్టోబర్ నెలాఖరులోగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ సమయంలో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టడం గమనార్హం.

## శబరిమల గోల్ స్కాంపై మోడీ మాట్లాడరేం?

- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

కన్నూర్, మార్చి31: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోడీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేరళలోని కన్నూరులో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.. సీపీఐ (ఎం) ఏమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్‌వింగ్ పార్టీ అని పేర్కొన్నారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఆ పార్టీ నేతలు బీజేపీతో జత కట్టారని ఆరోపించారు. అందువల్లే కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ విజయం సాధించాలని ప్రధాని కోరుకుంటున్నారని అన్నారు.

ఇతరచోట్ల మతం, దేవుడి గురించి మాట్లాడే మోడీ కేరళలో మాత్రం ఆ విషయాలను ప్రస్తావించరన్నారు. శబరిమల ఆలయంలో జరిగిన బంగారు తాపడాల స్కాం గురించి ఇప్పటివరకు ఆయన ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. బంగారు తాపడాలు మాయమవడం వెనక సీపీఐ నేతల హస్తం ఉన్నందువల్లే ఈ విషయంలో బీజేపీ మౌనంగా ఉందని రాహుల్ అన్నారు. సీపీఐ బీజేపీతో జత కట్టడం ఆ పార్టీలోని కొందరు సీనియర్ నేతలకు నచ్చలేదని అందువల్లే వారు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్రులుగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు.



### స్మార్ట్ సిటీ మిషన్ ఓ అసంపూర్ణ పథకం

ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన స్మార్ట్ సిటీ మిషన్ వల్ల ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదని రాహుల్ అన్నారు. ఈ పథకం గురించి మోడీ ఎప్పుడూ గొప్పలు చెబుతుంటారని కానీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయన్నారు. స్మార్ట్ సిటీలుగా కేంద్రం ఎంపిక చేసిన ఏ ఒక్క నగరాన్ని పూర్తిగా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. అక్కడి ప్రజలు కలుషిత నీరు, నిర్మాణ సమయంలోనే కుప్పకూలుతున్న బ్రిడ్జిలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పౌరులకు ప్రాథమిక గౌరవం, స్వచ్ఛమైన నీరు, గాలి, భద్రతను అందించడంలో ఆ నగరాలు విఫలమవుతుండడంతో అది ఓ అసంపూర్ణ పథకంగా మిగిలిపోయిందని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు.

## మహిళలకు నెలకు రూ.3వేలు

- అస్సాంలో భాజపా మ్యానిఫెస్టో విడుదల




డిస్పూర్, మార్చి 31: అస్సాం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో.. బీజేపీ మంగళవారం మ్యానిఫెస్టోను విడుదల చేసింది. ఇందులో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)తో పాటు మహిళలకు నెలకు రూ.3వేలు అందిస్తామంటూ పలు హామీలు ప్రకటించింది. మొత్తం 31 హామీలతో కూడిన మ్యానిఫెస్టోను అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహా పలువురు నేతలు విడుదల చేశారు. కాగా.. 126 అసెంబ్లీ స్థానాలు ఉన్న అస్సాంలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్, ఎస్టీ ప్రాంతాలు మినహా.. అస్సాం అంతటా యూసీసీ అమలు ...వరదరహిత రాష్ట్రంగా చర్యలు.. బంగ్లాదేశీ మియాలు ఆక్రమించుకున్న భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడం..అరుణోదయ పథకం కింద మహిళలకు నెలకు రూ.3వేలు అందజేత..ఐదేళ్లలో 2 లక్షల మందికి ఉద్యోగాల కల్పన..లఖ్‌పతి దీదీ పథకం కింద 40లక్షల మంది మహిళలకు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు మానిఫెస్టోలో ప్రకటించారు.

## ఇరాన్ ఓడిపోయే వరకు యుద్ధం కొనసాగించండి..!

### ట్రంప్‌ను కోరిన గల్ఫ్‌దేశాలు



వాషింగ్టన్, మార్చి31: ఇరాన్ ఓడిపోయేవరకు యుద్ధం కొనసాగించాలని గల్ఫ్ దేశాలు కోరుకుంటున్నాయట. ప్రస్తుత పాలనా యంత్రాంగం పూర్తిగా కూలిపోయేవరకు యుద్ధం ముగించవద్దని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రైవేట్‌గా కోరాయట. అలా కోరిన దేశాల జాబితాలో సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, బహ్రెయిన్ ఉన్నాయని అసోసియేటెడ్ ప్రెస్ సంచలన కథనం వెల్లడించింది.

''నెల రోజులుగా జరుగుతోన్న యుద్ధంలో ఇరాన్ చెప్పుకోదగ్గ స్థాయిలో బలహీనపడలేదు. ఇరాన్ నాయకత్వంలో గణనీయమైన మార్పు రావాలి. అప్పటివరకు సైనికచర్య ముగియకూడదు'' అని ఆ దేశాల అధికారులు ప్రైవేటు సంభాషణలో భాగంగా ట్రంప్‌ను కోరారని ఆ వార్తా ఏజెన్సీ కథనం వెల్లడించింది. ఈ మేరకు అమెరికా, ఇజ్రాయెల్, గల్ఫ్ అధికారులను ఉటంకించింది. ఇరాన్‌పై దాడి గురించి ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంపై, యుద్ధం కారణంగా సంభవించే హెచ్చరికలను పట్టించుకోకపోవడంపై ఈ చర్చల సందర్భంగా ఆయా దేశాలు అసంతృప్తి వ్యక్తంచేశాయట. ఈ ఘర్షణలు ఎలాగూ కొనసాగుతున్నాయి గనక.. టెహ్రాన్‌లోని మతపెద్దల పాలనను పూర్తిగా కూలదోయడానికి ఇదొక చరిత్రాత్మక అవకాశమని కొన్ని దేశాలు అభిప్రాయం వ్యక్తం చేశాయని పేర్కొంది.

### హర్మూజ్ గురించి నాకెందుకు.. ఎపిక్ ఫ్యూరీని ఆపేస్తా..!

అమెరికా 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'తో యుద్ధరంగంలోకి దిగడంతో ఇరాన్ హర్మూజ్ జలసంధిని మూసివేసిన సంగతి తెలిసిందే. దానిని తెరిపిస్తామని ట్రంప్ ప్రకటనలు చేశారు. అయితే ఇప్పుడు వాటికి భిన్నమైన కథనాన్ని వాల్‌స్ట్రీట్ జర్నల్ రాసుకొచ్చింది. ఇరాన్‌పై సైనిక చర్యను ముగించడానికి తాను సిద్ధంగా ఉన్నానని సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. హర్మూజ్ ఇప్పటికీ మూతపడే ఉన్నా ట్రంప్ ఈ ఆలోచన చేస్తున్నారట. ఈ కథనాలు ఇలాఉంటే మరోవైపు పశ్చిమాసియాలో అమెరికా బలగాల మోహరింపులు పెరుగుతుండటం గమనార్హం.

## ఢిల్లీ ఆలయాలు.. రద్దీ ప్రాంతాల్లో లష్కరే ఉగ్రవాది రెక్కీ



ఢిల్లీ, మార్చి31: భారత్‌లో దాడులకు కుట్ర పన్నినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న లష్కరే తోయిబా ఆపరేటివ్ షబ్బీర్ అహ్మద్ లోన్ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం 2004-2005 సమయంలో పలువురు లష్కరే ఉగ్రవాదులు ఆహారం, ఆయుధాల కోసం షబ్బీర్ నివాసానికి తరచూ వస్తుండేవారు. ఆ సమయంలోనే అతడు లష్కరేలో చేరాడు.

పాకిస్థాన్‌లోని లష్కరే తోయిబాకు చెందిన ఆసిఫ్ దార్, సుమామా బాబర్ అనే హ్యాండ్లర్లతో ఎన్‌క్రిప్టెడ్ యాప్ల ద్వారా షబ్బీర్ అహ్మద్ నిరంతరం సంప్రదింపులు జరిపేవాడు. దేశంలోకి అక్రమంగా చొరబడిన బంగ్లా దేశీయులతో భారత వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించడం కోసం ఓ ముఠాను ఏర్పాటుచేశాడు. ఈ ముఠా సభ్యులు ఢిల్లీ సహా దేశంలోని ప్రముఖ నగరాల్లోని ఆలయాలు, రద్దీగా ఉండే వాణిజ్య సముదాయాల వద్ద రెక్కీ నిర్వహించేవారు. అక్కడి భద్రతా లోపాలను అంచనా వేసి, దాడులకు ప్రణాళికలు రచించేవారు. వీరికోసం దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో స్లీపర్ సెల్స్ కూడా పని చేస్తున్నారు.

అంతేకాకుండా కశ్మీర్ యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించేలా షబ్బీర్ వారికి సోషల్ మీడియా సందేశాలు, ఉగ్రవాద భావజాలాన్ని ప్రచారం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు అనేకమంది యువకులను అతడు లష్కరేలో చేర్చాడన్నారు. అతడి వద్ద భారత్, పాక్, బంగ్లాదేశ్, నేపాల్‌కు చెందిన కరెన్సీ, ఇతర పత్రాలు, మొబైల్ ఫోన్లు, రెండు సిమ్ములు లభ్యమయ్యాయని.. దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు.

## యుద్ధాన్ని లాభాల కోసం..

### పీట్ హెగ్సెత్‌పై అనుమానాలు..?



వాషింగ్టన్, మార్చి31: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నానాటికీ తీవ్రమవుతోన్న వేళ అమెరికా రక్షణమంత్రి పీట్ హెగ్సెత్‌కు సంబంధించి ఓ సంచలన వార్త వినిపిస్తోంది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సైనిక చర్య ప్రారంభానికి కొన్నివారాల ముందు హెగ్సెత్ బ్రోకర్ ఒకరు అమెరికా రక్షణ రంగానికి సంబంధించిన కంపెనీల్లో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ కథనం వెలువరించింది. మార్గాన్ స్టాన్లీతో కలిసి పనిచేస్తోన్న ఆ బ్రోకర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో బ్లాక్రాక్‌ను సంప్రదించినట్లు సమాచారం. బ్లాక్రాక్‌కు చెందిన డిఫెన్స్ ఇండస్ట్రియల్స్ యాక్టివ్ ఈటీఎఫ్‌లో మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టే అవకాశాల గురించి ఆ బ్రోకర్ ఆరా తీసినట్లు సదరు కథనం వెల్లడించింది. దీనికి సంబంధించి అంతర్గతంగా చర్చలు నడిచాయని సదరు వర్గాలు పేర్కొన్నట్లు తెలిపింది. కానీ, ఆ ఈటీఎఫ్‌లను మార్గాన్ స్టాన్లీ ద్వారా కొనుగోలు చేసేందుకు అప్పట్లో అవి అందుబాటులో లేకపోవడంతో ఆ పెట్టుబడుల ప్రక్రియ ముందుకువెళ్లలేదని సమాచారం. ఎట్ చెప్పడం వల్లే పశ్చిమాసియాలో యుద్ధానికి దిగానంటూ అమెరికా అధ్యక్షుడు ఇటీవల వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కాగా ఈ పెట్టుబడుల వార్తల గురించి రక్షణ మంత్రి నుంచి గానీ పెంటగాన్ నుంచి గానీ ఎలాంటి స్పందన వెలువడలేదు.

బ్లాక్రాక్‌కు చెందిన డిఫెన్స్ ఇండస్ట్రియల్స్ యాక్టివ్ ఈక్విటీ ఫండ్ విలువ 3.2 బిలియన్ డాలర్లు. రక్షణ, భద్రతపై ప్రభుత్వం ఖర్చు పెరగడం వల్ల లాభపడే ఏరోస్పేస్, సెక్యూరిటీ టెక్నాలజీ, డిఫెన్స్ కాంట్రాక్టింగ్ వంటి కంపెనీల స్టాక్ పోర్ట్‌ఫోలియోను ఇది నిర్వహిస్తుంది. ఆర్టీఎక్స్, లాక్‌హీడ్ మార్టిన్ వంటి ప్రధాన రక్షణ రంగ కంపెనీలు దీనితో కలిసి పనిచేస్తున్నాయి. తక్కువ ఫీజులు, పన్ను ప్రయోజనాలు వంటి కారణాలతో ఇలాంటి ఈటీఎఫ్‌లకు మదుపర్ల నుంచి మంచి స్పందన లభిస్తుందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.

## ఉక్రెయిన్ డ్రోన్ల కోసం గల్ఫ్ దేశాల ఒప్పందం



కీవ్, మార్చి31: అమెరికా స్థావరాలే లక్ష్యంగా గల్ఫ్ దేశాల్లో ఇరాన్ ప్రతీకార దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇరాన్ ఉపయోగిస్తున్న షాహెద్ డ్రోన్లను అడ్డుకునేందుకు అమెరికా సహా ఆయా దేశాలు లక్షల డాలర్ల విలువైన క్షిపణులను ప్రయోగించాల్సి వస్తోంది. ఈ భారాన్ని తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్న వేళ.. తక్కువ ధరలో లభ్యమయ్యే ఉక్రెయిన్ డ్రోన్లు గల్ఫ్ దేశాలకు ఆశాదీపంగా మారాయి. వీటి కోసం ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా దేశాలు ఉక్రెయిన్‌తో ఇటీవల ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

ఇరాన్ ఉపయోగిస్తోన్న షాహెద్-136 డ్రోన్లు.. చిన్న క్రూజ్ మిస్సైళ్లలా పనిచేస్తాయి. ఆత్మాహుతి డ్రోన్లుగా పిలవబడే ఈ ఒక్కో డ్రోన్ తయారీకి సుమారు 20 వేల నుంచి 30 వేల డాలర్లు అవుతుందని అంచనా. వీటిని అడ్డుకునేందుకు పేట్రియాట్ వంటి అత్యంత ఖరీదైన క్షిపణులను అమెరికా వినియోగించాల్సి వస్తోంది. ఇటు గల్ఫ్ దేశాలు ఎఫ్-16 వంటి యుద్ధ విమానాలను ఉపయోగిస్తుండడంతో యుద్ధం ఖర్చు ఊహించని రీతిలో పెరిగిపోతోంది. మరోవైపు, దాదాపు నాలుగేళ్లుగా రష్యా దాడులను ఎదుర్కొంటున్న ఉక్రెయిన్.. భిన్న వ్యూహాలు, అత్యాధునిక ఆయుధాలను ఉపయోగిస్తూ ముందుకెళ్తోంది. ముఖ్యంగా స్టింగ్, బుల్లెట్ ఇంటర్సెప్టర్ డ్రోన్లను ఉపయోగిస్తోంది. ఈ ఆయుధ సాంకేతికతోపాటు రష్యాతో చేస్తున్న యుద్ధ అనుభవాలను పశ్చిమాసియా దేశాలతో పంచుకునేందుకు ఉక్రెయిన్ సిద్ధమైంది. ఇప్పటికే జోర్డాన్, కువైట్లకు వందలాది ఆయుధాలను అందించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే గల్ఫ్ దేశాల్లో పర్యటించిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ.. రక్షణ సహకారానికి సంబంధించి పలు దేశాలతో కీలక ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. ఇవి చరిత్రాత్మకమైనవి.. సాంకేతిక సహకారం, భవిష్యత్తు ఒప్పందాలు, పెట్టుబడులకు పునాది వంటివని పేర్కొన్నారు.

## బట్టబయలైన కిడ్నీ రాకెట్

- రూ.50వేల కోసం
- పోలీస్ స్టేషన్‌కు వెళ్తే..
- వెల్లడైన గుట్టు..!



కాన్పూర్, మార్చి31: రూ.50వేల కోసం వచ్చిన తగాదా భారీ అంతరాష్ట్ర కిడ్నీ రాకెట్‌ను బయటపెట్టింది. ఆర్థికంగా చితికిపోయిన వారిని టార్గెట్ చేసి మధ్యవర్తులు, కొన్ని ఆసుపత్రులు ఆ నెట్‌వర్క్‌ను నడిపిస్తున్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం..

తన బంధువు ఒకరికి కిడ్నీ అవసరం ఉందని యూపీలోని కల్యాణ్‌పూర్‌కు చెందిన శివమ్ అగర్వాల్ ఉత్తరాఖండ్ యువకుడిని ప్రలోభపెట్టాడు. అందుకు రూ.10 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చాడు. అప్పటికే ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఆ యువకుడు తన కిడ్నీ ఇచ్చేందుకు ముందుకువచ్చాడు. దాంతో రావత్‌పూర్ ఆసుపత్రిలో సర్జరీ జరిగింది. తర్వాత ఆ కిడ్నీని ముజఫర్‌నగర్‌కు చెందిన మహిళ కుటుంబానికి రూ.9 లక్షలకు అమ్మారని ఆరోపణలు ఉన్నాయి. ఆ కిడ్నీ ఇచ్చిన వ్యక్తికి రూ.9.5 లక్షలు అందాయి. అయితే మిగతా రూ.50వేలు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారంటూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ రాకెట్ గుట్టు రట్టయింది. ఈ మార్పిడి ప్రక్రియ కోసం నిందితులు మూడు ఆసుపత్రుల టెక్నిక్ వాడుతున్నారు. మొదట ఒక ఆసుపత్రిలో సర్జరీ చేసి, కిడ్నీ తీస్తారు. ఆ తర్వాత వైద్యసేవల కోసం మరో ఆసుపత్రికి తీసుకెళ్తారు. గ్రహీతను ఇంకో ఆసుపత్రిలో ఉంచుతారు. ఏ ఒక్క ఆసుపత్రి వద్ద పూర్తి సమాచారం లేకుండా చూసుకునేందుకు ఇలాంటి ఎత్తుగడ వేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ క్రమంలో కిడ్నీ ఇచ్చిన వ్యక్తికి ఒక్కో దగ్గర ఒక్కో పేరును ఉపయోగిస్తారు. మధ్యవర్తులు, హాస్పిటల్ ఆపరేటర్లు, వైద్య నిపుణులు కలిసి ఒక నెట్‌వర్క్‌గా ఏర్పడి.. ఆర్థికంగా బలహీనవర్గాలకు చెందిన వ్యక్తులను లక్ష్యంగా చేసుకుంటున్నారని పోలీసు అధికారులు భావిస్తున్నారు. ఆరోపణలు వచ్చిన ఆసుపత్రులపై తనిఖీలు చేసి, పలువురిని అదుపులోకి తీసుకున్నారు. అవయవ మార్పిడికి సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నారు. గ్రహీతలు చెప్పిన వివరాలను బట్టి.. ఈ నెట్‌వర్క్ ఉత్తర ప్రదేశ్‌కు మాత్రమే పరిమితం కాలేదని అనుమానిస్తున్నారు.

# హుజూర్‌నగర్ మున్సిపాలిటీ ఆదర్శంగా నిలపాలి



**సూర్యాపేట, మార్చి 31 (మనం ప్రతినిధి):** నూతన పాలకవర్గం హుజుర్నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. మంగళవారం హుజుర్ నగర్ మున్సిపల్ బడ్జెట్ 2026 - 27 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ పై మంగళవారం హుజుర్ నగర్ మున్సిపాలిటీ లో నిర్వహించారు..ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... మున్సిపల్ నిధులను సక్రమంగా వినియోగించి సత్ఫాలితాలు రాబట్టలని కోరారు. మున్సిపాలిటీ 2026 -27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.33 కోట్లతో బడ్జెట్ రూపొందించడం జరిగిందని వివరించారు. హుజుర్నగర్ మున్సిపాలిటీని దశలవారీగా అభివృద్ధి చేసుకునేందుకు పాలక వర్గం కృషి చేయాలన్నారు. వార్డులలో ఉన్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకొని ముందుకు పోవాలని సూచించారు. ప్రాధాన్యత అంశాలైన త్రాగునీరు, పరిశ్యుభ్యం, రోడ్లకు సంబంధించిన పనుల కోసం ప్రత్యేక గ్రాంట్ల నిధులను వినియోగించుకుని పూర్తి చేయాలని తెలిపారు. రానున్న వేసవికాలం దృష్టిలో పెట్టుకొని త్రాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆర్డిఓ కు సూచించారు వార్డులలోని ముఖ్యమైన ప్రదేశాలలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తే మహిళభద్రత కల్పించడం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక**

మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల కార్యక్రమాన్ని మున్సిపాలిటీలలో సమర్థవంతంగా నిర్వహించాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు ప్రజా ప్రతినిధులు, అధికారులు వార్డుల్లో పర్యటించి కాలనీల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రపరచడం, రోడ్లను శుభ్రంగా ఉంచడం వంటి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా మరియు అందంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, మున్సిపల్ చైర్ పర్సన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్**

హుజుర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాలలో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌసింగ్ కాలనీని త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.మంగళవారం హుజుర్నగర్ నియోజకవర్గ కేంద్రంలోనీ రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీ ని, అంతర్గత రోడ్లు, సభాస్థలిని, మొక్కలు నాటడం, హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించి మిగిలి పోయిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖ ల అధికారులను ఆదేశించారు.లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హత లేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని అని స్పష్టం చేశారు. అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు హౌసింగ్ పీడీ సిద్ధార్థ, మిషన్ భగీరథ కరుణాకర్ రెడ్డి, తహసిల్దార్ కవిత, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి




**సూర్యాపేట టౌన్, మార్చి 31, మనం న్యూస్:** ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా ఎస్పీ నర్సింహ అన్నారు. మంగళవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఆటో డ్రైవర్లకు, ఇతర వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..... ఆటో డ్రైవర్ లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని అన్నారు. అలా ధరించని వారికి పెనాల్టి విధిస్తామన్నారు. అలాగే డ్రైవర్ కు ఇరువైపులా ప్యాసింజర్లను ఎక్కించుకోకూడదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేనియెడల పెనాల్టి విదిస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే బండి సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఆటోలు, ట్రాక్టర్ లలో సౌండ్ సిస్టమ్ పెట్టుకుని వాహనాలు నడపడం వలన రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై 12 మందికి జైలు శిక్ష విధించడం జరిగిందని చెప్పారు. రోడ్డు నియమాలు పాటించాలని జాగ్రత్తగా వాహనాలు నడిపించాలని, రోడ్డు పక్కన నడుస్తున్న పాదాచారులను గుర్తించాలని, ఎదురుగా వస్తున్న వాహనాలను, పక్క నుండి వెళుతున్న వాహనాలు చూసి వాహనాలు నడపాలని అన్నారు. మన తెలంగాణ రాష్ట్రంలో ఏట రోడ్డు ప్రమాదంలో 7,000 మంది మరణిస్తున్నారని ఆయన అన్నారు. వారి మరణాల వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని కాబట్టి ప్రతి ఒక్కరు కూడా జాగ్రత్తగా వాహనాలు నడపాలని ఆయన అన్నారు. ప్రజల భద్రత కోసం జిల్లా పోలీస్ శాఖ ఎరైవ్ ఎలైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా జిల్లా పోలీస్ శాఖ అరైవ్ అలైవ్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్య క్రమంలో పట్టణ సిఐ వెంకట్, ఎ స్ ఐ లు పాల్గొన్నారు.

# ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక

- క్షేత్రస్థాయిలో అభివద్ధి పనుల పరిశీలన
- కౌకుంట్ల, హస్తేపూర్ గ్రామాల్లో ప్రత్యేక అధికారి ఎన్. వెంకటేశ్వర్లు పర్యటన
- నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్లు, పాఠశాలల తనిఖీ
- పారిశుధ్య పనులపై ప్రత్యేక దష్టి సారించాలని ఆదేశం



**చేవెళ్ల, మార్చి 31 (మనం న్యూస్):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చేవెళ్ల మండలంలో అభివద్ధి పనుల పరిశీలన ముమ్మరంగా సాగుతోంది. మంగళవారం మండలంలోని కౌకుంట్ల మరియు హస్తేపూర్ గ్రామ పంచాయతీలలో ప్రత్యేక అధికారి, డీడీ ఆడిట్ శ్రీ ఎన్. వెంకటేశ్వర్లు గారు విస్తతంగా పర్యటించారు. గ్రామాల్లో జరుగుతున్న వివిధ అభివద్ధి పనులను ఆయన స్వయంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అభివద్ధి పనుల అంచనా ఈ పర్యటనలో భాగంగా ఆయన గ్రామాల్లోని కీలక విభాగాలను తనిఖీ చేశారు. నర్సరీలను సందర్శించి మొక్కల పెంపకంపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు మరియు వెటర్నరీ హాస్పిటల్ను సందర్శించి సేవలను సమీక్షించారు. గ్రామ పంచాయతీ భవనాలు, వీఓ భవనాలు, నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనుల నాణ్యతను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై అధికారి ప్రత్యేకంగా దష్టి సారించారు. సెగ్రిగేషన్ షెడ్ల పనితీరును పరిశీలిస్తూ.. తడి, పొడి చెత్త వేరు చేయడం ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పిపివి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం లేకుండా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ గడువులోగా పూర్తి చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# మున్సిపల్ వార్షిక బడ్జెట్ రూ. 38.44 కోట్ల అంచనా

- ఏకగ్రీవంగా తీర్మానించిన మున్సిపల్ పాలకవర్గం
- అత్యవసర పనులకు మొదటి ప్రాధాన్యత
- మున్సిపల్ చైర్మన్ వెంకటరెడ్డి




**నేరేడుచర్ల మార్చి 31 మనం న్యూస్:** సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీ 2026-27 అంచనా బడ్జెట్ రూ38.44 కోట్లుగా నేరేడుచర్ల మున్సిపల్ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించి ప్రవేశపెట్టింది. నేరేడుచర్ల పురపాలక కార్యాలయం నందు మంగళవారం బడ్జెట్ సమావేశం జరిగింది. బడ్జెట్ అంచనాలు 2026-27 2025-26 సవరించిన అంచనా బడ్జెట్ పై మున్సిపల్ చైర్మన్ కొణతం చిన వెంకటరెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సర్వసభ్య సమావేశం జరిగినది.నేరేడుచర్ల పురపాలక సొంత ఆదాయం రూ 4.64 కోట్లు మరియు ప్రభుత్వం నిధులు రూ. 33.71 కోట్లు మొత్తం రూ. 38.44 కోట్లు ఇందులో ఖర్చులు సిబ్బంది జీతాలు రూ.1.13 కోట్లు, పారిశుధ్యానికి రూ 1.09 కోట్లు,విద్యుత్తు చార్జీలు క్రింద రూ 0.61 కోట్లు, హరితహారం 10 శాతం నిధుల క్రింద 0.57 కోట్లు, పరిపాలన, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ క్రింద రూ. 1.25 కోట్లు, విలీన ప్రాంతాలు, స్లమ్ ఏరియాలో మైనారిటీ నివాస ప్రాంతాల అభివృద్ధికి 0.04 కోట్లు, వివిధ అభివృద్ధి పనుల క్రింద రూ 33.75 కోట్లు, మునిసిపల్ వ్యయాల క్రింద రూ 38.44 కోట్లు గా అంచనా వేయడం జరిగిందని మున్సిపల్ కార్యాలయ ఏఈఈ స్వాతి సభలో వెల్లడించారు. సభ ఆమోదం కోరుతూ చైర్మన్ వెంకటరెడ్డి ప్రతిపాదన చేయగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఆయా అవార్డుల్లో పనులపై వార్డు కౌన్సిలర్లతో సమీక్షా సమావేశం జరిపిన అనంతరం ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయింపు జరుగుతుందని పారదర్శకంగా పనులు చేపడుతామన్నారు. గత పాలకవర్గం చేపట్టిన పనులు, ఖర్చుల ఆధారంగా మున్సిపల్ బడ్జెట్ అంచనా వేశారని అప్పటి ఖర్చులలో స్పష్టత లేదని ఏ వార్డులో ఏ పనులకు ఎంత ఖర్చు చేశారో పూర్తి వివరాలు వెల్లడించాలని మూడవ వార్డు కౌన్సిలర్ దొండపాటి అప్పిరెడ్డి సభలో డిమాండ్ చేయగా గతంలో జరిగిన ఖర్చుల వివరాలను మరోసారి నిర్వహించే సర్వసభ్య సమావేశంలో సభ్యులకు వివరాలు వెల్లడించాలని మున్సిపల్ కమిషనర్ చెన్నబోయిన నాగరాజు ను చైర్మన్ చిన వెంకటరెడ్డి ఆదేశించారు. గత పాలకవర్గంలో ఏమైనా అవకతవకలు జరిగి నిధులు దుర్వినియోగం అయితే రికవరీ చేయాలని 7వ వార్డు కౌన్సిలర్ తాళ్ళ లావణ్య సభలో డిమాండ్ చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ నూకల సందీప్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు యారవ లక్ష్మి , కొణతం మంజుల, నన్నెపంగ శ్రీనివాస్, వాసా జ్యోతి , ఇంజమూరి శ్రీకాంత్, ఇంజమూరి వెంకటమ్మ, షేక్ షాహీన్, మహమ్మద్ అబ్దుల్ కలీం ,బొలిశెట్టి లక్ష్మయ్య, అర్రూరి విజయలక్ష్మి, మున్సిపల్ మేనేజర్ షేక్ యాకుబ్ పాషా, జే ఏ ఓ శారద , టీపీఎస్ కె.అంజయ్య కార్యాలయ సిబ్బంది హాజరయ్యారు.

# విద్యా బోధనలో భాగ్యలక్ష్మి సేవలు గణనీయం



- ప్రధానోపాధ్యాయులు దోరి రమేష్

**భీమదేవరపల్లి, మార్చి 31 మనం న్యూస్:** విద్యాబోధనలో ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి సేవలు గనినీయమని ప్రధానోపాధ్యాయులు దోరి రమేష్ ప్రశంసించారు. మంగళవారం గట్ల నర్సింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రధానోపాధ్యాయులు దోరి రమేష్ హాజరై అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా 29 సంవత్సరాలు పూర్తి పట్ల అంకితభావంతో పనిచేసి విద్యార్థులకు క్రమ శిక్షణతో పాటు భౌతిక శాస్త్రం సులువుగా అర్థమయ్యే రీతిలో బోధించి సేవలు అందించాలని అభినందించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , పాఠశాల సిబ్బంది,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన వర్సిటీలోలో హార్టీ ఇన్నోవేషన్ హబ్ స్థాపన





**ములుగు, మార్చి 31(మనం న్యూస్):** శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం లో హార్టీ ఇన్నోవేషన్ హబ్ స్థాపనకు చర్యలు చేపట్టుతున్నట్లు వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండా రాజి రెడ్డి వెల్లడించారు. ఉద్యాన రంగంలో ఆధునిక సాంకేతికతలను ప్రవేశపెట్టి, పరిశోధనలను మరింత అభివృద్ధి చేయడమే ఈ హబ్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ పరిపాలనా కార్యాలయాన్ని ఏ ఎన్ జి ఆర్ ఏ యు మాజీ ఉపకులపతి డాక్టర్ సురవరం సుధాకర్ రెడ్డి, అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడా నాచురల్ రిసోర్సెస్ డైరెక్టర్ కె. రమేష్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా యూనివర్సిటీ ఆఫ్ ఫ్లోరిడాతో సంయుక్తంగా ఫ్యాకల్టీ ఎక్స్చేంజ్ ప్రోగ్రాంలు, సహకార పరిశోధన ప్రాజెక్టులపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఉప కులపతి దండ రాజి రెడ్డి మాట్లాడుతూ, ఈ హార్టీ ఇన్నోవేషన్ హబ్ ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో పరిశోధన అవకాశాలు కల్పించబడతాయని, విద్యార్థులు, అధ్యాపకులకు ప్రపంచ స్థాయి పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ హబ్ ద్వారా ఉద్యాన రంగంలో కొత్త ఆవిష్కరణలు, స్టార్టప్లు కూడా ప్రోత్సహించబడతాయని ఆయన అన్నారు. హార్టీ ఇన్నోవేషన్ హబ్లో భాగంగా రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ, వెబ్ స్టూడియో, ఉద్యాన రంగానికి ఇన్క్యుబేషన్ సెంటర్ వంటి విభాగాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ విభాగాల ద్వారా పరిశోధన, శిక్షణ, సాంకేతిక సేవలు సమగ్రంగా అందించబడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులు, విద్యార్థులు, శాస్త్రవేత్తలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం చేరువ కావడంతో పాటు, అంతర్జాతీయ స్థాయి సహకారంతో ఉద్యాన రంగ అభివృద్ధికి కొత్త దారులు తెరుచుకుంటాయని విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. భగవాన్, డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్. జె. చీనా నాయక్, యూనివర్సిటీ కన్సల్టెంట్ డాక్టర్ కె. వీరాంజనేయులు, డాక్టర్ జి పి సునందిని, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డాక్టర్ సురేష్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డాక్టర్ ఎన్. శ్రీనివాసన్, టెక్నికల్ సెక్రటరీ డా. పిడిగం సైదయ్య, ఆఫీసర్ ఇంచార్జ్ డాక్టర్ వి.సుచిత్ర మరియు బోధన సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధికి సహకరించిన వారు అభినందనీయులు




**నేరేడుచర్ల మార్చి 31 మనం న్యూస్:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెంచికల్ దిన్నె అభివృద్ధికి సహకరించిన దాతలు పారుపల్లి అనిల్ కుమార్ తక్కెలపాటి రవీంద్రనాథ్ ఠాగూర్ అభినందనీయులు అని పెంచికలదిన్నె సర్పంచ్ నర్సింగ్ చిన్న సోములు అన్నారు. నేరేడుచర్ల మండలం పెంచిక దిన జిల్లా పరిషత్ హై స్కూల్ నందు దాతల సహకారంతో ఒక లక్ష 40 వేల రూపాయల వ్యయంతో నిర్మించబడిన తరగతి గదిని పెంచికల్ దిన్నె సర్పంచ్ నర్సింగ్ చిన్న సోములు ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎల్. శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో దాతల సహకారం మరువలేనిదని కొని యాడారు . అనంతరం దాతల్ని సన్మానించడం జరిగింది. పూర్వ విద్యార్థులు ,దాతలు ఇంకా ముందుకు వచ్చి సహకరించినట్లయితే ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించడానికి ఉపాధ్యాయులు సంసిద్ధంగా ఉన్నారని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వల్లంశట్ల వెంకటేశ్వరరావు వల్లంశట్ల కోటేశ్వరరావు సుంకరి వెంకటేశ్వరరావు గ్రామ పెద్దలు ఉపాధ్యాయులు రాఘవరెడ్డి గోపయ్య శ్యాంసుందర్రావు అనిల్ కుమార్ సైదులు శ్రీనివాస్ రెడ్డి ఏసు పాదం లింగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# నీటి సమస్య పరిష్కారం కోసం చేస్తాను



**చిలుకూరు, మార్చి 31(మనంన్యూస్):** గ్రామంలో నీటి సమస్యను పరిష్కారం చేస్తామని అలాగే గ్రామ సభలో తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యని పరిష్కరిస్తానని సర్పంచ్ వట్టికూటి నాగయ్య అన్నారు. మంగళవారం గ్రామ పంచాయితీ కార్యాలయంలో జరిగిన గ్రామ సభలో మాట్లాడారు. ప్రభుత్వం నుండి వచ్చే నిధులతో ప్రాధన్యత ప్రకారం అత్యవసర పనులను గుర్తించి ప్రజా సమస్యలను పరిష్కారం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏడుకొండలు, ఇన్చార్జి కార్యదర్శి రామారావు, వార్డు -సభ్యులు, గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం



**కోదాడ, మార్చి 31(మనం న్యూస్):** గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని గుడిబండ గ్రామ సర్పంచి మందుల నాగయ్య అన్నారు. మండల పరిధిలోని గుడిబండ గ్రామంలో 9 వ వార్డులో లో సీఎం శ్రీను బజారు సిసి రోడ్డు నిర్మాణానికి శంఖుస్తాపన చేసిన గ్రామ సర్పంచి మందుల నాగయ్య. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఇట్టి కార్యక్రమం లో కోదాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమాటి వర ప్రసాద్ రెడ్డి, గుడిబండ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇర్ల నరసింహ రెడ్డి, ఉప సర్పంచి ఇర్ల జయసింహ రెడ్డి, 9 వ వార్డు మెంబెర్ ధార అఖిల ప్రేమ్ చందు, కుక్కడపు సైదులు, సీఎం శ్రీను, కందికొండ నర్సయ్య, కందికొండ పవన్ కళ్యాణ్, మాదాసి నాగరాజు, పులి గామయ్య, పవన్, ప్రవీణ్, 8 వ వార్డు మెంబర్ పులి అనిత, 10 వ వార్డు మెంబర్ రోజా, 11 వ వార్డు మెంబర్ ఖాజా, 12 వ వార్డు మెంబర్ సక్రు, 7 వ వార్డు మెంబర్ సుహాసిని, పసుపులేటి గురవయ్య, కాలితిరిపి బాబు, మందుల జోసెఫ్, నెంబర్ దానియేలు, ఇస్సాకు, కరుణాకర్, మందుల రాంబాబు, ఇరుగు సురేష్, మంద సైదులు, మేస్త్రి లక్ష్మయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసర పరిస్థితుల్లో సమాజానికి అవసరమయ్యేది పోలీసులు, డాక్టర్లే

- సిద్దిపేట సీపీ రష్మీ పెరమాలు






**ములుగు, మార్చి 31(మనం న్యూస్):** రోడ్డు ప్రయాణాలలో ప్రమాదాల నివారణకు సీఎం, రాష్ట్ర డిజిపిచే ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఉదయం 11 .30 నిమిషాలకు సిద్దిపేట సీపీ రష్మీ పెరమాలు సిద్దిపేట జిల్లా ములుగు మండలం లక్ష్మక్క పల్లి గ్రామ శివారులో గల ఆర్వీఎం మెడికల్ కాలేజీలో మెడిసిన్ అనుబంధ కోర్సుల విద్యార్థులకు రోడ్డు భద్రతా పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఇందులో భాగంగా సిపి రష్మీ పెరమాలు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో నిత్యం రోడ్డు ప్రమాదాలలో ప్రజలు మరణిస్తున్నారని మితిమీరిన వేగం నిర్లక్ష్యం ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన రాహిత్యం, రాంగ్ రూట్లో డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడపడం తదితర కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాటన్నింటినీ సరియైన ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ఆత్మరక్షణ చర్యలైన హెల్మెట్ ధరించడం సీడ్ బెల్ట్ పెట్టుకోవడం నిర్దేశిత వేగంలోని వాహనాలు నడపడం వంటి చర్యల ద్వారా ప్రమాదాలు తగ్గించవచ్చునని విద్యార్థులకు సూచించారు. అంతేకాకుండా మత్తుపదార్థాల వినియోగం గంజాయి వంటి నిషేధిత ఉత్పే రకాలను వినియోగించడం శారీరక మానసిక ఆరోగ్యాలకు హానికరం, చట్టరీత్యా నేరమని తెలియపరిచారు. దీనితో పాటుగా ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని చదువుకున్న యువత అత్యాశలకు పోయి సైబర్ నేరస్తుల చేతిలో మోసపోయి ఆర్థికంగా నష్టపోతున్నారని దానికి నివారించడానికి ప్రతి ఒక్కరు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కాలేజీలలో ర్యాగింగ్ ఒక సవాలుగా మారిందని విద్యార్థులందరూ ర్యాగింగ్ కు దూరంగా ఉంటూ తమ తోటి విద్యార్థుల పట్ల స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. సమాజంలో 24 గంటలు విధులు నిర్వహించే పోలీసులు మరియు డాక్టర్ల మధ్య సమన్వయం అవసరం అటువంటి పోలీసులు డాక్టర్లు సమిష్టి కృషితో సమాజంలో ప్రజల ప్రాణాలను భద్రత కలిగించే విధంగా బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. సిద్దిపేటలో సిపి వినూత్న ప్రయోగంలో భాగంగా 'మన పోలీస్- మన ఊరు' అనే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు అతి కార్యక్రమంలో భాగంగా ఒక్కో పిఎస్ పరిధిలో ఒక్కొక్క గ్రామాన్ని సిపి గారు స్వయంగా సందర్శించి ఆ గ్రామస్తులతో మమైకమై వారి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగమేళా ఊరూరా సీసీటీవీలు ఏర్పాటు సిద్దిపేట సురక్షనేత్ర వంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్వీఎం మెడికల్ కాలేజ్ చైర్మన్ డాక్టర్ యాకయ్య, సూపరింటెండెంట్ డాక్టర్. శ్రీనివాస్, గజ్వేల్ ఏసీపీ నర్సింహులు, గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు, గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి, ములుగు ఎస్సై రఘుపతి పాల్గొన్నారు.

## టీఎన్జీవోస్ కేంద్ర సంఘ ఉపాధ్యక్షులుగా రామునాయక్



**హైదరాబాద్, మార్చి 31 న్యూస్:** టీఎన్జీవోస్ కేంద్ర సంఘం ఉపాధ్యక్షులుగా రెండవసారి ఏకగ్రీవమైనందున బంజారా ఆణిముత్యం నిరంతరం ప్రజాసేవ అందిస్తూ సంఘం కోసం అనునిత్యం కృషి చేస్తూ ఏకగ్రీవంగా ఎన్నికైనందున బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వీ ఎన్ నాయక్ బృందం, అర్పిత నాయక్, అనసూయ, రామన్న నాయక్, భర్తీయా నాయక్, లక్ష్మణ్ నాయక్, జవహర్లాల్ నాయక్, భూక్య శ్రవణ్ కుమార్, రాజు నాయక్, హేమా నాయక్, రమేష్, కిషన్ నాయక్, వీరన్న నాయక్, మొదలైన నాయకులు రాములు నాయక్ కు అభినందనలు శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

## మహాదేవపూర్ ఎస్సీ హాస్టల్‌ను సందర్శించిన సర్పంచ్

**మహాదేవపూర్ మార్చి31మనం న్యూస్:** మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని (ఎస్సీ హాస్టల్) మంగళవారం సర్పంచ్ హసీనా బాను అక్బర్ ఖాన్ ప్రజాప్రతినిధులతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్లోని సౌకర్యాలను, విద్యార్థుల సమస్యలను ఆమెస్వయంగా అడిగితెలుసుకున్నారు. సందర్శనలో భాగంగా వారు విద్యార్థులకు అందుతున్న భోజనం, నీటి సౌకర్యం, మరియు గదుల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారంఅందించాలని, వసతి గృహంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూపేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని, హాస్టల్ విద్యార్థులందరికీ తమ వంతు పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు విద్యార్థుల ఆరోగ్య బాగోగులను అడిగి తెలుసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ హసీనా బాను అక్బర్ ఖాన్, ఉప సర్పంచ్ ఉప సర్పంచ్ తుంగల శ్రీజ సంతోష్,వార్డు సభ్యులుచీర్లవంచచంద్రశేఖర్, పడాల మొగిలి మహమ్మద్ బిన్ అలీ,గడ్డం స్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.





### కాళేశ్వర ముక్తేశ్వర దేవస్థాన
## డైరెక్టర్లకు ఘన సన్మానం

**మహాదేవపూర్ మార్చి 31మనం న్యూస్:** మహాదేవపూర్ మండలం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర దేవస్థానం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్లుగా నూతనంగా ఎన్నుకోబడిన దొడ్ల అశోక్ మరియు కుంభం పద్మ లను సోమవారంరోజు ఘన సన్మానం జరిగింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కట్కం అశోక్ స్వగృహంలో వారిని శాలువాలతో సత్కరించి హృదయపూర్వకంగా అభినందించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దొడ్ల అశోక్ మరియు కుంభం పద్మ దేవస్థాన అభివృద్ధికి కృషి చేసి భక్తులకు మెరుగైన సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వారి నియామకం ఈ ప్రాంతానికి గౌరవకరమైన విషయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కట్కం అశోక్, అంబట్పల్లి మాజీ సర్పంచ్ విలాస్ రావు,కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు కోట సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెన్నెపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి శివరాజ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోతె సాంబయ్య, మధు తో పాటు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు నూతనంగా ఎన్నుకోబడిన డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో దేవస్థానం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.



## బిజెపిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా జె ఎస్ ఆర్



**భీమదేవరపల్లి, మార్చి 31 మనం న్యూస్:** బిజెపి పార్టీలో సామాజిక కార్యకర్త జెఎస్ ఆర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు. మంగళవారం రోజున జొన్నపరెడ్డి సురేందర్ రెడ్డి ప్రెస్ నోట్లో తెలిపిన వివరాల ప్రకారం భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ లో హుస్నాబాద్ నియోజవర్గం చెందిన సామాజిక కార్యకర్త జన్నపరెడ్డిరెడ్డి సురేందర్ రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు తో పాటు అధిష్టానం నియమించారని తెలిపారు. భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇస్తూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులకు, అధిష్టానానికికృతజ్ఞతలు తెలిపారు. జె ఎస్ ఆర్ ను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించినందుకు హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోనిఅభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

## కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

**హనుమకొండ, మార్చి 31(మనంన్యూస్):** గ్రేటర్ వరంగల్ హనుమకొండ ఎన్ పి డి సి ఎల్ యాదవ నగర్ హనుమకొండ యాదవ్ నగర్ యూనిట్ లో క్యాజువల్ కట్టర్ గా పనిచేస్తున్న గాదే పున్నం చందర్ కరెంట్ షాక్ తో మృతి శ్రీనివాసరావు హాస్పిటల్ లో మృతి చెందడం జరిగింది. విద్యుత్ ఉద్యోగస్తుల వల్ల నిన్న బీసీ కాలనీలో సాక్స్ సర్క్యూట్ వల్ల మరణించడం జరిగింది కావున నక్కలగుట్ట లోని విద్యుత్ భవన్ ముందు పున్నం మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన. సోమవారం హనుమకొండ గుండ్లసింగారం బీసీ కాలనీ వద్ద మరమ్మతుల పేరుతో విద్యుత్ సరఫరా అవుతున్న పోల్ ఎక్కించిన అధికారులు. కరెంట్ షాక్ వల్ల కిందపడి తలకు తీవ్ర గాయాలు. నగరంలోని ఒక హాస్పిటల్లో అడ్మిట్ చేసి చేతులు దులుపేసుకున్న అధికారులు. వీరి కుటుంబానికి ప్రభుత్వము



భార్యకు ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వం నుండి వీరి కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సాయం అందించాలని వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మరియు పున్నం చందర్ చావుకు కారణం అయిన వారిని సస్పెండ్ చేయాలని మరియు వదిలేదే లేదని వారి కుటుంబానికి నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు.

## మహాలక్ష్మి పథకంతో మహిళల ఆర్థిక ప్రగతి

- **వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు**
- **దక్షిణ కాశీ నుండి పుణ్యక్షేత్రాలకు బస్సు సౌకర్యాల ఏర్పాటు**

**వేములవాడ,మార్చి31(మనం న్యూస్):** వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండ్ వద్ద మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళలు రూ.10 వేల కోట్ల ప్రయాణ ఛార్జీలు ఆదా చేసిన సందర్భంగా మంగళవారం రోజున ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్య అతిథిగా హాజరై మహిళా ప్రయాణికులకు ఉచిత టికెట్లు అందజేసి వారిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ నుండి ఇతర ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో బస్సు సౌకర్యాలను ఏర్పాటు చేశారని కొనియాడారు. నియోజకవర్గంలో మహిళా సంఘాల ఆర్థిక ఎదుగుదల కోసం ఆది శ్రీనివాస్ నాయకత్వంలో ఆరు బస్సులను ఏర్పాటు చేశామని వివరించారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆదా అవుతున్న నగదును మహిళలు తమ పిల్లల చదువులకు, కుటుంబ అవసరాలకు వాడుకుంటూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, డిపో మేనేజర్ శ్రీనివాస్, పట్టణ కౌన్సిలర్లు, ఆర్టీసీ అధికారులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## విద్య ప్రేరణకు నిలయంగా మహాదేవపూర్ ప్రభుత్వ లైబ్రరీ

- **లైబ్రేరియన్ కృషితో లైబ్రరీ కొత్త ఊపిరి పొందింది**

**మహాదేవపూర్, మార్చి 31మనం న్యూస్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ లైబ్రరీ విద్య ప్రేరణకు నిలయంగా మారిందని మండల ప్రజలు అంటున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ లైబ్రరీ లో లైబ్రేరియన్ గా భాగ్యలక్ష్మి బాధ్యతలు తీసుకోని జ్ఞానాన్ని విద్యావంతులకు పంచే దిశగా కృషి చేస్తూ లైబ్రరీకి కొత్త ఊపిరి పోసిందని, లైబ్రరీ లో వాతావరణం చదువుకు అనుగుణంగా ఎంతో అనుకూలంగా మారిందని, చిన్నారులు ఆసక్తిగా పుస్తకాలు చదువుతూ తమ జ్ఞానాన్ని పెంచుకుంటూ కనబడడం ఎంతో ఆనందదాయకంగా ఉందని, లైబ్రేరియన్ పిల్లలకు పుస్తక పఠన అలవాటు పెంపొందే దిశగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వారికి సరైన మార్గదర్శకం చేస్తుండటం చాలా సంతోషంగా ఉందని, లైబ్రేరియన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత లైబ్రరీకి వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని, ప్రతిరోజు పత్రికలు చదివేందుకు, పలు అంశాలపై పుస్తకాలు చదవడానికి యువత మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో వస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాగే పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువకులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందని అలాగే స్కూల్ పిల్లల కోసం కథల పుస్తకాలు విజ్ఞాన వనరులు సమకూర్చి వారు చదువుపై ఆసక్తి పెంచేలా జరుగుతుందని పలువురు విద్యావంతుల వాపోతున్నారు అలాగే లైబ్రరీల అభివృద్ధి వెనుక జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోటరాజా బాపు ప్రోత్సాహం మరియు మార్గదర్శకం ఎంతో ముఖ్యమైనదని, ఆయన నిరంతర పర్యవేక్షణ, లైబ్రరీ అభివృద్ధి పట్ల ఉన్న ఆసక్తి వల్లనే ఈ స్థాయిలో మార్పు సాధ్యమైందని అలాగే గ్రామీణ ప్రాంతాల్లో కూడా చదువుపై ఆసక్తి పెంపొందించాలని ఆయన దూరదృష్టి మరియు తీసుకునే చర్యలు ప్రశంసనీయమని జిల్లా విద్యావంతులు అభినందనలు తెలుపుతున్నారు.

## ఉచిత కుట్టు మిషన్ కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్



**మహాదేవపూర్ మార్చి31(మనం న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో ఉచిత కుట్టు మిషన్ శిబిరం నిర్వహిస్తుండగా మంగళవారం రోజున సర్పంచ్ హసీనాబాన్ అక్బర్ ఖాన్ గ్రామపంచాయతీ పాలకవర్గంతో కలిసి సంయుక్తంగా సందర్శించారు. ఆడపడుచులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని బృహత్ సంకల్పంతో మంత్రి శ్రీధర్ బాబు ఆశీర్వాదంతో కొనసాగుతున్న ఉచిత కుట్టు మిషన్ శిబిరాన్ని సర్పంచ్ హసీనాబాన్ అక్బర్ ఖాన్ తోటి గ్రామపంచాయతీ పాలకవర్గంతో కలిసి సంయుక్తంగా సందర్శించి ఉచిత కుట్టు మిషన్ నేర్చుకుంటున్న మహిళలతో మాట్లాడి బాగోగులను అడిగి తెలుసుకుని సరళంగా అర్థమయ్యే రీతిలో మహిళలకు నేర్పించాలని శిక్షణ కేంద్ర నిర్వాహకులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీజ సంతోష్, వార్డు సభ్యులు చంద్రశేఖర్, మొగిలి, ఆలీ మరియు మహిళలు పాల్గొన్నారు.

## ఉప సర్పంచ్‌ల సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా కటకం స్వప్న నరేష్

**మల్హర్ మార్చి 31 మనం న్యూస్:** హైదరాబాద్ లో జరిగిన ఉప సర్పంచ్ ల సమావేశంలో మంథని నియోజకవర్గం వల్లెంకుంట ఉప సర్పంచ్ కటకం స్వప్న నరేశ్ తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్ ల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాములు నాయక్ మరియు రాష్ట్ర ఉపాధ్యక్షులు బొట్ల కార్తీక్ స్వప్న నరేష్ గారికి నియామకపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా స్వప్న నరేష్ మాట్లాడుతూ నా నియామకానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్రీను బాబు మరియు తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి డీసీసీ ప్రధాన కార్యదర్శి అయిత రాజిరెడ్డి మరియు తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు మరియు ఉపాధ్యక్షులకు ధన్యవాదములు తెలపడం జరిగింది.



### కనకం పున్నం చందర్
## ఉద్యోగ పదవి విరమణ అభినందన సభ

**హనుమకొండ, మార్చి 31(మనంన్యూస్):** 37 సమ్మత్సరాలు జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా పని చేస్తు 30/3/2026 రోజున పదవి విరమణ చేయడం జరిగింది ఈ ప్రోగ్రామ్ కీ ముఖ్యఅతిధిగా బి రవి కుమార్ ఎం ఈ ఓ మాట్లాడుతూ పున్నం చందర్ మృధుస్వభావి, నీగర్వి, నీస్వార్ధపారుడు, పర్వతగిరి, ఛాన్నారోపేట్, నెక్కొండ, మండలాలలో పనిచేయడం జరిగింది బావి జీవితం, బాగుండాలని కోరుకోవడం జరిగింది అభినందనసభలో చంద్రుగొండ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు కె కృష్ణారావు , ఎల్ సునీల్ , వి శ్రీనాథ్ , సరిత , మమత , పవన్ కుమార్ , రంజిత్ కుమార్, అనిత పాల్గొనడం జరిగింది పాఠశాల ఉపాధ్యాయులు మెమోంటు, శాలువతో సన్మానం చేయడం జరిగింది, ప్రశంశ పత్రం సమర్పించారు.



### పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొన్న వి ఎన్ నాయక్



**హనుమకొండ,మార్చి 31(మనం న్యూస్):** సీనియర్ వర్కర్ సరళ రిటైర్మెంట్ ఫంక్షన్ బాలుర వసతి గృహము కాజీపేట యందు జరుపుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్ ఏ బి సి డి ఓ హనుమకొండ , శంకర్ హెచ్ డబ్ల్యు ఓ ఖాజీపేట్, ప్రిన్స్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం, ఫ్రాన్సిస్ హెచ్ఎం, సీనియర్ జర్నలిస్టు శ్రావణ్ నాయక్ పాల్గొని సరళ కి బొకే ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించినారు.

## గుర్రపు డెక్క తొలగించాలని డీసీకి వినతి



**రంగారెడ్డి మార్చి 31 (మనం న్యూస్):** సరూర్ నగర్ చెరువులో గుర్రపు డెక్క బాగా పేరుకుపోవడంతో దోమల బెడద ఎక్కువైందని, వెంటనే గుర్రపు నొక్కిన తొలగించాలని కోరుతూ సరూర్నగర్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ కు గడ్డి అన్నారం డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ ఎం సునీల్ బాబు మంగళవారము వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ బాబు మాట్లాడుతూ గడ్డిఅన్నారం డివిజన్ ప్రజలు దోమల బెడదతో చాలా ఇబ్బందులు గురవుతున్నారు అని గుర్రపుడెక్కను రెండుమూడు వెహికల్స్ ను ఏర్పాటుచేసి అతి త్వరగా గుర్రపు డెక్క ను తొలగించాలని కోరారు.

సానుకూలంగా స్పందించి ఇప్పుడు రెండు వెహికల్స్ నడుస్తున్నాయి అని ఇంకొక వెహికల్ కూడా తెప్పించేసి అతి త్వరలో తొలగించి దోమల బెడద నుంచి ప్రజలకు విముక్తి కలిగించాలని భావనతో ప్రభుత్వం పనిచేస్తుందని వారు తెలపడం జరిగినది తెలిపారు.

## బీసీ జన జాగరణ జాతర

**ఎల్బీనగర్ మార్చ్ 31 (మనం న్యూస్) :** ఏప్రిల్ 19 ఆదివారం నాంపల్లిఎగ్జిబిషన్ గ్రౌండ్లో జరిగే జన జాగరణ జాతరకార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు మీ సహాయ సహకారాలు ఉండాలని మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు కోరడం జరిగింది. ఈ యొక్క జన జాగరణ జాతర కార్యక్రమానికితన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాస్ గౌరవ అధ్యక్షులు గడ్డం నరసింహ గౌడ్,కోల భాస్కరరావు,మాస్ ఉపాధ్యక్షులు దేవేందర్ జి, మాస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెద్దవూర బ్రాహ్మయ్య పాల్గొన్నారు.



## రిజర్వేషన్ విధానాన్ని ఎత్తివేయాలి



- **ప్రతిభకు పట్టం కట్టాలి తప్ప కులం పేరుతో రిజర్వేషన్లు ఉండొద్దు**
- **బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య క్రమశిక్షణ కమిటీ చైర్మన్ వక్క లంక శ్రీనివాసరావు**

**రంగారెడ్డి మార్చి 31 (మనం న్యూస్):** రిజర్వేషన్లను పూర్తిగా ఎత్తివేయాలని కింది జాతి పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అమలు చేస్తున్న రిజర్వేషన్ లను ప్రభుత్వం తొలగించాలని బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య క్రమశిక్షణ కమిటీ చైర్మన్ వక్క లంక శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల ఎంఆర్పిఎస్ నాయకులు, మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ బ్రాహ్మణులు దేవాలయాల్లో పూజలు చేయవద్దని ఒక సమావేశంలో మాట్లాడడం అది బ్రాహ్మణులను కించపరచడమేనని సమాజం నాగరికత నేర్చుకోక ముందు నుండే బ్రాహ్మణుడి మాటను సమాజం గౌరవించిందని,ఆయన చెప్పిన మంచి రోజునే శుభకార్యాలను చేసుకుంటున్న సమాజం మనది అని అన్నారు . అలాంటి సమాజంలో జీవిస్తున్న మందకృష్ణ మాదిగ బ్రాహ్మణులను కించపరుస్తూ సర్వేజనా సుఖినోభవంతు అంటూ... తమ వృత్తి తాము చేసుకుంటున్న బ్రాహ్మణులు ఆ వృత్తిలో కొనసాగరాదని అనడం తగదని, అందుకే మాకు కడుపు మండి, రక్తం ఉడికి, రిజర్వేషన్లు ఎత్తివేయాలి అనే వ్యాఖ్యలు చేయవలసి వచ్చిందని...తక్షణమే మంద కృష్ణ మాదిగ తన వ్యాఖ్యలను వెనుకకు తీసుకోవాలని, యావత్ బ్రాహ్మణ సమాజానికి క్షమాపణ చెప్పి సమాజంలో తిరగాలని లేకపోతే బ్రాహ్మణ జాతి అతనికి తగిన బుద్ధి చెబుతుందని, హెచ్చరించారు. కులాలను అడ్డుపెట్టుకొని రిజర్వేషన్లు అనుభవిస్తూ సనాతన ధర్మాన్ని కాపాడుతున్న బ్రాహ్మణ కులాలను కించపరచినట్లు మాట్లాడడం క్షమించరాన్ని నేరమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు... మంద కృష్ణ మాదిగ నువ్వు పుట్టినప్పుడు నీ జన్మ దినోత్సవాన్ని ఏరోజు చేయాలి అని, నీ పెళ్లి ఏ తేదీలో జరపాలని ముహూర్తం చూసి చెప్పినవాడు బ్రాహ్మణుడు కాదా, ఒక్కసారి ఆలోచించుకోవాలని, ఇలాంటి బుద్ధి తక్కువ మాటలు మాట్లాడితే సమాజం నీకు గుణపాఠం చెబుతుందని అన్నారు . ప్రజాసేవలో ఉన్న నీవు ప్రజలలో భాగంగా ఉన్న బ్రాహ్మణుల గురించి మాట్లాడడం నీ మూర్ఖత్వానికి పరాకాష్ట అని ఎద్దేవా చేశారు. ఇకనైనా మందకృష్ణ మాదిగ యావత్ బ్రాహ్మణ జాతికి క్షమాపణ చెప్పే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని తమ ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తం చేస్తామని హెచ్చరించారు.

## వీఆర్ఏలకు న్యాయం ఎప్పుడూ? ప్రభుత్వ హామీలు కేవలం మాటలేనా

### జాతీయ బీసీ సంక్షేమ సంఘం మద్దతుతో ఢిల్లీలో జంతర్ మంతర్ వేదికగా ధర్నా




**రంగారెడ్డి మార్చి 31 (మనం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 81, 85ల అమలులో కొనసాగుతున్న ఆలస్యం వల్ల వేలాది వీఆర్ఏల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం విమర్శించారు. మిగిలిన 3797 మంది వీఆర్ఏలకు వెంటనే నియామక ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వేదికగా నిర్వహించిన ధర్నాకు ఆయన మద్దతు తెలుపుతూ మాట్లాడారు.వీఆర్ఏ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇంకా పూర్తిగా అమలు కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ 81, 85ల ద్వారా ఉద్యోగ భద్రత కల్పిస్తామని ప్రకటించినప్పటికీ, ప్రాక్టికల్ స్థాయిలో అమలు నత్తనడకన సాగుతోందని పేర్కొన్నారు. దీని కారణంగా వేలాది కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో వీఆర్ఏల సమస్య రాజకీయ, పరిపాలనా స్థాయిల్లో చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ జోక్యం అవసరమని గుజ్జ సత్యం అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వీఆర్ఏలు అధికంగా ఉండటం వల్ల ఈ సమస్య సామాజిక న్యాయం కోణంలో కూడా ప్రాముఖ్యత సంతరించుకుందని తెలిపారు.



# అందుకే త్వరగా నిద్రపోయా : వైభవ్

యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ 2026 సీజన్ ను ఓ రికార్డుతో మొదలుపెట్టాడు. చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో ఈ రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్ కేవలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేశాడు. అతిపిన్న వయసులో వేగవంతమైన అర్ధశతకం చేసిన బ్యాటర్ గా నిలిచాడు. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, సురేశ్ రైనా, ఇషాన్ కిషన్ ను అధిగమించాడు. ఇటీవలే తన 15వ సంవత్సరంలోకి (మార్చి 27న) అడుగుపెట్టిన అతడు ఆ సంబరాలను కూడా చేసుకోలేదని సీఎస్కే తో మ్యాచ్ అనంతరం వెల్లడించాడు.

''బర్త్ డే సెలబ్రేషన్స్ ను ప్రత్యేకంగా ఏమీ చేసుకోలేదు. నాకోసం కేక్ కటింగ్ కూడా ఏర్పాటుచేశారు. కానీ, ఆ కేకును మొత్తం పూసేస్తారని ముందే నిద్రపోయా. నా పుట్టినరోజు అలా జరిగింది. ఇక మ్యాచ్ లో నేను కొత్తగా ఏమీ చేయలేదు. పవర్ ప్లేలో దూకుడుగా ఆడటమే నా లక్ష్యం. ఆరంభంలో కాస్త బ్యాటింగ్ కు కష్టమనిపించింది. కానీ, బంతి పాతబడిన కొద్దీ ఈజీగా మారిపోయింది.

నేను కూడా డిఫెన్స్ గురించి ఆలోచిస్తుంటా. ఈ మ్యాచ్ లో మాత్రం పవర్ ప్లేలోనే ఆధిపత్యం ప్రదర్శించాలని భావించాం. లక్ష్యం కూడా చిన్నదే. ప్రత్యర్థి బౌలర్లు కాస్త కట్టుదిట్టంగా బంతులేస్తే ఆ టార్గెట్ కూడా పెద్దదిగా మారిపోయే ప్రమాదం ఉంది. అందుకే, పవర్ ప్లేలో చాలా దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించాం. మా కోచ్ లు కూడా ప్రతి బౌలర్ పైనా ఎటాకింగ్ గేమ్ ఆడమని చెప్పారు. బంతిని బట్టి ఆడాలంటారు. నా సహజసిద్ధమైన ఆటను ఆడాలని చెబుతారు.

ప్రతి బంతి తర్వాత యశస్వి జైస్వాల్ తో మాట్లాడుతూనే ఉన్నా. అతడే సింగిల్స్ తీసి.. స్ట్రైకింగ్ ఇచ్చాడు. భారీ షాట్లు కొట్టేందుకు ప్రోత్సహించాడు'' అని వైభవ్ వెల్లడించాడు.



## ఇంగ్లాండ్ పర్యటనకు వైభవ్‌ను పంపించాలి: మైకెల్ వాన్

వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు 15వ ఏడాదిలోకి అడుగుపెట్టిన వెంటనే ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ చేసిన పిన్న వయస్కుడిగా ఘనత సాధించాడు. అంతర్జాతీయ క్రికెట్ లోకి అడుగుపెట్టేందుకు ఉన్న వయసు అడ్డంకి కూడా తొలగిపోయింది. దీంతో వెంటనే అతడిని జాతీయజట్టులోకి తీసుకోవాలనే డిమాండ్లు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైకెల్ వాన్ బీసీసీఐకి ఓ కీలక సూచన చేశాడు. రాబోయే ఇంగ్లాండ్ పర్యటనకు అతడిని పంపించాలని సూచించాడు.

''వైభవ్ సూర్యవంశీ ఎప్పుడు భారతజట్టులోకి ఎంట్రీ ఇస్తాడా? అని ఎదురుచూస్తున్నా. ఐపీఎల్ 2026 సీజన్ తొలి మ్యాచ్ లోనే అతడి గేమ్ ఏంటో చూశాం. రాబోయే కొద్ది నెలల్లో ఇంగ్లాండ్ పర్యటనకు భారత్ వెళ్లనుంది. ఒకవేళ నేనే భారత క్రికెట్ లో ఉండుంటే.. వైభవ్ కు అవకాశం కల్పించేవాడిని. ఒకేసారి తుది జట్టులో అవకాశం ఇవ్వమని కూడా చెప్పను. అలా ఇచ్చినా పెద్ద నష్టమేం లేదు. కనీసం స్క్వాడ్ లోకి తీసుకుంటే.. భారత జట్టు డ్రెస్సింగ్ రూమ్ అనుభవమైనా వస్తుంది. రాజస్థాన్ జట్టు మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ అన్ని ఫార్మాట్ల ప్లేయర్. అయితే, వైభవ్ వచ్చాక అతడిని సాధారణ ప్లేయర్ గా మార్చాడని నేను అనుకోవడం లేదు. యశస్వి బంతిని చూసి.. ఆడుతున్నాడు. వైభవ్ మాత్రం తన సహజసిద్ధంగా బంతిని స్టాండ్స్ లోకి పంపించేందుకే మొగ్గు చూపిస్తున్నాడు. ఇటు వైపు యశస్వి ఉండటంతో సూర్యవంశీకి స్వేచ్ఛ లభించినట్లైంది'' అని వెల్లడించాడు



## చెలరేగిన పంజాబ్ బౌలర్లు.. స్వల్ప స్కోర్కే పరిమితమైన గుజరాత్

ఐపీఎల్ 2026లో భాగంగా పంజాబ్ కింగ్స్ తో ఇవాళ (మార్చి 31) జరుగుతున్న మ్యాచ్ లో గుజరాత్ టైటాన్స్ స్వల్ప స్కోర్కే పరిమితమైంది. పంజాబ్ హోం గ్రౌండ్ అయిన మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో (ముల్లాన్పూర్) జరుగుతున్న ఈ మ్యాచ్ లో పంజాబ్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. వారి బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేయడంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 162 పరుగులకే పరిమితమైంది. విజయ్ కుమార్ వైశాక్ (4-0-34-3), యుజ్వేంద్ర చహల్ (4-0-28-2), మార్కో జన్సెన్ (4-0-20-1), బార్ట్ లెట్ (4-0-36-0) అద్భుతంగా బౌలింగ్ చేసి గుజరాత్ బ్యాటర్లను కట్టడి చేశారు. ఒక్క అర్షదీప్ సింగ్ (4-0-42-0) మినహా పంజాబ్ బౌలర్లంతా అద్భుతంగా బౌలింగ్ చేశారు.

గుజరాత్ ఇన్నింగ్స్ లో శుభ్ మన్ గిల్ (27 బంతుల్లో 39; 6 ఫోర్లు), జోస్ బట్లర్ (33 బంతుల్లో 38; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), గ్లెన్ ఫిలిప్స్ (17 బంతుల్లో 25; 2 ఫోర్లు) ఓ మోస్తరు స్కోర్లు చేయగా.. సాయి సుదర్శన్ (13), వాషింగ్టన్ సుందర్ (18), షారుక్ ఖాన్ (4) తక్కువ స్కోర్లకే ఔటయ్యారు. రాహుల్ తెవాతియా (11), రషీద్ ఖాన్ (0) అజేయంగా నిలిచారు.



## మరింత ఆలస్యం అవుతున్న 'స్పిరిట్'.. కారణం ఏమిటంటే..?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుస సినిమాలతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. బ్లాక్ బస్టర్ దర్శకడు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రాబోతున్న 'స్పిరిట్' చిత్ర షూటింగ్ ఇప్పటికే ప్రారంభించాడు ఈ స్టార్ హీరో. అయితే, ఈ చిత్ర షూటింగ్ మరోసారి వాయిదా పడింది. నిజానికి ఈ సినిమా గత ఏడాదే మొదలవ్వాలి. కానీ ప్రభాస్ ఇతర సినిమాల వల్ల 2026కి వెళ్ళింది. ఇప్పుడు 'రాజా సాబ్' తర్వాత పరిస్థితులు మారడంతో, ఈ సినిమా షూటింగ్ మరికొంత కాలం ఆలస్యం కానుంది.

ప్రస్తుతం ప్రభాస్ 'ఫౌజీ' సినిమాకు ప్రాధాన్యత ఇస్తున్నాడు. ఈ సినిమాపై భారీగా డబ్బు ఖర్చు చేయడంతో, దీనిని త్వరగా పూర్తి చేసి ఈ ఏడాదే విడుదల చేయాలని ఆయన నిర్ణయించుకున్నారు. అలాగే, 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ షూటింగ్ కూడా ఫిబ్రవరిలో మొదలైంది. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి స్టార్స్ డేట్స్ ఇచ్చి ఉండటంతో, ప్రభాస్ త్వరలోనే ఆ సెట్స్ లో జాయిన్ కానున్నాడు.

ఈ రెండు సినిమాల వల్ల 'స్పిరిట్' ఆలస్యమైనా, షూటింగ్ మాత్రం ఆగలేదు. ఇప్పటికే ప్రభాస్ లేకుండా గోవాలో ఒక షెడ్యూల్ పూర్తి చేశాడు సందీప్ రెడ్డి వంగా. చిన్న చిన్న ఆలస్యాలు ఉన్నప్పటికీ, ముందుగా ప్లాన్ చేసినట్లుగానే మార్చి 5, 2027న 'స్పిరిట్' సినిమాను విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సిద్ధమవుతోంది.

## ఆయ్ డైరెక్టర్‌తో నితిన్ నెక్స్ట్ మూవీ ఫిక్స్..!



యంగ్ హీరో నితిన్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు బ్యాక్ టు బ్యాక్ అప్డేట్స్ ఇచ్చారు. ఇప్పటికే దర్శకుడు వి.ఐ. ఆనంద్ తో ఒక సైన్స్ ఫిక్షన్ సినిమాను ప్రకటించిన నితిన్, తాజాగా నాగవంశీ నిర్మాణంలో ఒక నూతన దర్శకుల ద్వయంతో మరో ప్రాజెక్ట్ను లైన్ లో పెట్టారు. ఈ రెండు సినిమాలు ప్రస్తుతం చర్చల్లో ఉండగానే, ఇప్పుడు మరో క్రేజీ అప్ డేట్ బయటకు వచ్చింది. గతేడాది 'ఆయ్' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్న దర్శకుడు అంజి కె. మణిపుత్రతో నితిన్ తన తదుపరి సినిమా చేయబోతున్నారు. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వెలువడింది. రుచిర ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై నికిత రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. అయితే ఈ సినిమా ఎప్పుడు షూటింగ్ ప్రారంభమవుతుందనే విషయంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. గత కొంతకాలంగా సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న నితిన్, ప్రస్తుతం తన ఆశలన్నీ ఈ మూడు వైవిధ్యమైన ప్రాజెక్ట్ లపైనే పెట్టుకున్నారు. విభిన్న జానర్లలో తెరకెక్కనున్న ఈ సినిమాలు నితిన్కు మళ్ళీ సాలిడ్ హిట్ ను అందించి, బాక్సాఫీస్ వద్ద ఆయనను తిరిగి ఫామ్లోకి తెస్తాయని అభిమానులు ఆశిస్తున్నారు. ఒకేసారి మూడు సినిమాలను లైన్ లో పెట్టడం టాలీవుడ్ లో ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

## మిమ్మల్ని మీరు నమ్మడమే మీ సూపర్ పవర్ – కృతి సనన్

కెరీర్ ప్రారంభంలో పరిశ్రమలో గుర్తింపు, తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవాలని ఎక్కువగా ఆందోళన పడ్డానని అంటోంది బాలీవుడ్ కథానాయిక కృతి సనన్. వైవిధ్యమైన కథలతో అలరించే తార ఈమె. ప్రస్తుతం 'కాక్ టెయిల్ 2' సినిమాతో బిజీగా ఉన్న ఈ భామ.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని కెరీర్ మొదట్లో సవాళ్ల గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. ''ఈ రంగంలో ప్రతి నటుడు ఒత్తిళ్లను ఎదుర్కొంటాడు. ముఖ్యంగా సినీ నేపథ్యం లేని వారు మరింత ఎక్కువగా ఎదుర్కొంటారు. తొలి నాళ్లలో నాపై ఎన్నో విమర్శలు వచ్చాయి. 'నువ్వు నవ్వినప్పుడు నీ చిగుళ్లు ఎక్కువగా కనిపిస్తాయి'.. ఇలా ఎన్నో మాటలు వింటూ ఉండేదాన్ని. ఇక్కడ మిమ్మల్ని మీరు నమ్మడమే మీ సూపర్ పవర్. ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. విమర్శల్ని అధిగమించకపోతే.. మార్పు ఎలా తీసుకురాగలం. అందుకే మనసు మాట వింటూ కష్టపడుతూ పనిచేసుకోవాలి'' అని చెప్పుకొచ్చింది కృతి.



## విజువల్స్‌తో అదరగొట్టిన 'కథనార్'!

స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి తన కెరీర్ లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'కథనార్ - ది వైల్ సోర్సెరర్'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమాతో ఆమె మలయాళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతుండగా, జయసూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకలను ఆకట్టుకుంది. కాగా, తాజాగా ఈ చిత్ర ట్రైలర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ ఆద్యంతం అద్భుతమైన విజువల్స్ మరియు మిస్టరీ ఎలిమెంట్స్ తో సినిమాపై భారీ అంచనాలను పెంచింది. దర్శకుడు రోజిన్ థామస్ ఈ చిత్రాన్ని ఒక ఫాంటసీ ఎంటర్టైనర్ గా, గ్రాండ్ విజువల్ స్పెక్టాకిల్ గా తీర్చిదిద్దుతున్నారు. ఒక మాంత్రికుడి జీవితం చుట్టూ తిరిగే ఈ కథను శ్రీ గోకులం మూవీస్ సంస్థ అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మిస్తోంది. వినీత్, సందీప్, దేవిక, హరీష్ ఉత్తమన్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి రాహుల్ సుబ్రమణియన్ సంగీతాన్ని అందిస్తున్నాడు. అనుష్క ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ పాన్-ఇండియన్ చిత్రం పలు భాషల్లో విడుదల కానుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ సినిమా, బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తుందని చిత్ర యూనిట్ ధీమాగా ఉంది. ఈ భారీ విజువల్ వండర్ కోసం అనుష్క అభిమానులు మరియు సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





## కింగ్ కోసం ఐశ్వర్య రాజేష్?

అక్కినేని నాగార్జున కెరీర్ లో ఎంతో ప్రతిష్టాత్మకమైన 100వ చిత్రం 'లాటరీ కింగ్' గురించి ఒక ఆసక్తికరమైన వార్త బయటకు వచ్చింది. ఈ భారీ ప్రాజెక్ట్ లో టాలెంటెడ్ నటి ఐశ్వర్య రాజేష్ హీరోయిన్ గా ఎంపికైనట్లు సమాచారం. యాక్షన్ మరియు ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో సీనియర్ నటి టబు కూడా ఒక కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం.

వెంకటేష్ సరసన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఐశ్వర్య రాజేష్, ఇప్పుడు కింగ్ నాగార్జునతో జోడీ కట్టడంపై ఫిల్మ్ నగర్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. వీరిద్దరి కాంబినేషన్ ఈ సినిమాకు కొత్తదనాన్ని ఇస్తుందని భావిస్తున్నారు. ఈ చిత్రానికి రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. నాగార్జున వంటి స్టార్ హీరో తన ల్యాండ్మార్క్ మూవీ కోసం ఒక యువ తమిళ దర్శకుడిని నమ్మడం ఇప్పుడు టాలీవుడ్ లో చర్చనీయాంశమైంది. 'లాటరీ కింగ్'లో నాగార్జున అత్యంత స్టైలిష్ గా కనిపించబోతున్నారని తెలుస్తోంది. గతంలో ఆయన నటించిన శివ, రక్షకుడు, కూలీ వంటి చిత్రాల గెటప్పుల స్ఫూర్తితో ఇందులో రకరకాల వేరియేషన్స్ ఉంటాయని సమాచారం. ఐశ్వర్య రాజేష్ నటనకు స్కోప్ ఉన్న పాత్రలో కనిపిస్తుండగా, టబు ఉండటం సినిమాపై అంచనాలను మరింత పెంచింది. నాగార్జున కెరీర్ లో ఈ 100వ చిత్రం ఒక చిరస్మరణీయమైన సినిమాగా నిలుస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.